www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
28-09-2024

సంపుటి : 01 | సంచిక : 146 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD

## ప్రధాని మోదీతో స్టాలిన్ భేటీ

'సమగ్ర శిక్షా స్కీమ్' కింద కేంద్ర నిధులు విడుదల చేయాలి

చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేజ్-2కు అనుమతి ఇవ్వాలి

మోదీని కోరిన తమిళనాడు సీఎం



**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీతో డీఎంకే అధ్యక్షుడు, తమళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. 'సమగ్ర శిక్షా స్కీమ్' కింద కేంద్ర నిధులు విడుదల చేయాలని, 50:50 ఈక్విటీ షేర్ కింద చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేజ్-2కు అనుమతి ఇవ్వాలని ప్రధానిని ఆయన కోరారు. భారత మత్స్యకారులకు సంప్రదాయంగా ఉన్న చేపలవేట హక్కును పరిరక్షించాలన్నారు. సముద్ర జలాల్లో పట్టుకున్న తమిళ మత్స్యకారులను, వారి పడవలను త్వరితగతిని విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధానిని కోరారు. ఈ మేరకు ఒక విజ్ఞాపన పత్రాన్ని ప్రధానికి స్టాలిన్ అందజేశారు. సుమారు 45 నిమిషాలపాటు వారు భేటీ అయ్యారు. ప్రధానితో భేటీ అనంతరం స్టాలిన్ మీడియాతో మాట్లాడారు. ఒక ముఖ్యమంత్రిగా తాను ప్రధానికి మూడు వినతులు చేశానని, తన వినతులను ఆయన ఆలకించారని చెప్పారు. మిగతా2లో...

## భారత్‌కు యూకే మద్దతు

- ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉండాలన్న బ్రిటన్ ప్రధాని
- ఇండియాతో పాటు మరో మూడు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కైర్ స్టార్మర్ సూచన



2




"రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను, చారిత్రక కట్టడాలను విద్యార్థులు ఉచితంగా సందర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందు కోసం "తెలంగాణ దర్శిని" అనే కొత్త కార్యక్రమాన్ని తీసుకొస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమం ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు
# తెలంగాణ దర్శిని

ఉచితంగా పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశం

- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకెళ్తాం
- చారిత్రక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం
- కట్టడాల పరిరక్షణకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి
- ఉస్మానియా ఆసుపత్రి గోషామహల్‌కు తరలిస్తాం..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉచితంగా పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. చారిత్రక, పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన తెలంగాణ దర్శిని కార్యక్రమానికి సంబంధించి జీవోను జారీ చేసినట్టు సీఎం తెలిపారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని సీఎం కోరారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు మిగతా2లో...



2

### తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళం



2

## నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి

- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- రాష్ట్రపతి నిలయంలో స్టాల్స్ పరిశీలన
- నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొననున్న ద్రౌపది ముర్ము

విక్రాంత్ మాస్సే 12th ఫెయిల్‌కి

## అరుదైన గౌరవం

సుప్రీంకోర్టులో చిత్ర ప్రదర్శన వీక్షించిన సీజేఐ, న్యాయమూర్తులు




2

## విచారణకు హాజరు కావాలి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు ఆదేశం

కోర్టులో పెండిగ్‌లో కేసు ఉందని చెప్పినా పట్టించుకోకుండా కూల్చేశారు..

హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఓ బాధితుడు

**విశ్వంభర, హైదరాబాద్:** అమీన్‌పూర్ చెరువుకు సంబంధించిన కేసు విషయంలో విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు నోటీసులు జారీ చేసింది. హైడ్రా కమిషనర్ సోమవారం విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. అమీన్‌పూర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని ఇటీవల ఓ భవనాన్ని హైడ్రా సిబ్బంది కూల్చేశారు. అయితే కోర్టులో మిగతా2లో...





## మేడిగడ్డ డ్యామేజీకి ప్రధాన కారణం

- గేట్స్ ఆపరేషన్, మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడమే..
- ఉన్నత స్థాయి కమిటీ మినట్స్‌ను కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్ ఫాలో కాలేదు
- విచారణలో ఈఎన్సీ హరిరామ్ కీలక విషయాల వెల్లడి

2



## మంత్రి పొంగులేటి నివాసంలో ఈడీ సోదాలు

లగ్జరీ వాచ్‌ల కుంభకోణం చేశారని శ్రీనివాసరెడ్డిపై అభియోగం

- విచారణను ముమ్మరం చేసిన అధికారులు
- మనీలాండరింగ్ సహా మరో కేసు నమోదు

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. లగ్జరీ వాచ్‌ల కుంభకోణం నేపథ్యంలో ఈడీ అధికారులు మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 125 | రిటైల్ ₹ 147 |
| స్కిన్ ₹ 213 | స్కిన్ లెస్ ₹ 243 |

## నేను నిద్రపోను.. రేవంత్ రెడ్డిని నిద్రపోనీయను

రూ.2లక్షల రుణమాఫీ హామీని నెరవేర్చాలి

- కేసీఆర్ హయంలో నాట్లకు రైతుబంధు అందిస్తే.. ఈ ప్రభుత్వం పంట కోతకు వచ్చినా ఇవ్వలే
- కేసీఆర్ కడుపు నిండా 24 గంటల కరెంట్ ఇచ్చిండు ఇప్పుడెందుకు వస్తలేదు?
- బీఆర్ఎస్ శ్రేణుల ధర్నాలో హరీశ్ రావు విమర్శలు

**విశ్వంభర, నంగునూరు:**

నంగునూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేపట్టారు. రూ.2 లక్షల రుణమాఫీతోపాటు రైతులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. మిగతా2లో...





## ముడా కుంభకోణం కేసులో సిద్ధరామయ్యపై కేసు నమోదు

**బెంగళూరు:** మైసూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ముడా) భూముల వ్యవహారం లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటోన్న సీఎం సిద్ధరామయ్యకు రోజురోజుకు కష్టాలు ఎక్కువవుతున్నాయి. శుక్రవారం ఆయనపై లోకాయుక్త కేసు నమోదు చేసింది. రెండురోజుల క్రితం కర్ణాటక లోకాయుక్త అధికారి ఆధ్వర్యంలో దర్యాప్తునకు ప్రత్యేక న్యాయస్థానం అనుమతించిన నేపథ్యంలో మిగతా2లో...

ఏడుకొండలవాడి పవిత్రతను కాపాడేందుకు

## అత్యంత ప్రాధాన్యం

- తిరుమలకు వెళ్లే ప్రతి ఒక్కరూ టీటీడీ నిబంధనలు పాటించాలి
- ఆలయ ఆచారాలకు భిన్నంగా ఎవరూ వ్యవహరించొద్దు
- ఎక్స్ వేదికగా ఏపీ సీఎం చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి:** తిరుమల శ్రీవారి సన్నిధికి వెళ్లే ప్రతి ఒక్కరూ టీటీడీ నిబంధనలు పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు " భక్తుల మనోభావాలు, ఆచారాలకు భిన్నంగా ఏ ఒక్కరూ వ్యవహరించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవారి ఆలయం కోట్లాది మంది హిందువులకు అతిపెద్ద పుణ్యక్షేత్రం. ఈ దివ్యక్షేత్రం ఏపీలో ఉండటం మనందరి అదృష్టం. మిగతా2లో...

## నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం హైదరాబాద్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి నిలయంలో పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక, అటవీ, విద్యుత్, తదితర శాఖల ఏర్పాట్లపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష నిర్వహించారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రతా ఏర్పాట్లు, బందోబస్తును పర్యవేక్షించాలని పోలీసులకు సూచించారు. అనంతరం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన 8 రాష్ట్రాలకు సంబంధించిన స్టాళ్లను, 4 ఫుడ్ కోర్టులను, మీడియా సెంటర్‌ను, ఇతర స్టాళ్లను పరిశీలించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని అడిషనల్ సీపీ ట్రాఫిక్ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఉదయం 9 గంటల నుంచి బేగంపేట, హెచ్‌పీఎస్, పీఎన్‌టీ జంక్షన్, రసూల్‌పురా, సీటీవో ప్లాజా, టివోలి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, బొల్లారం రాష్ట్రపతి నిలయం ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని తెలిపారు.

**నల్సార్ 21వ స్నాతకోత్సవం ముఖ్యఅతిథిగా..**

మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పరిధిలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం 28న నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్నారు. గౌరవ అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, నల్సార్ ఛాన్స్‌లర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింహులు విచ్చేస్తున్నట్లు విశ్వవిద్యాలయ వీసీ క్రిష్ణదేవరావ్ మీడియాకు వెల్లడించారు.

## కేరళలో మరో మంకీపాక్స్ కేసు నమోదు

**మలప్పురం:** ప్రపంచ దేశాల్లో కలకలం సృష్టించిన ప్రాణాంతక మంకీపాక్స్ (ఎంపాక్స్) కేసుల సంఖ్య భారత్‌లో మూడుకు చేరింది. కేరళలో మరో మంకీపాక్స్ కేసు నమోదైనట్లుగా ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఎర్నాకుళం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మంకీపాక్స్ లక్షణాలతో ఆస్పత్రిలో చేరినట్లు ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు. అతడి నమూనాలను పరీక్షల కోసం పంపించగా.. పాజిటివ్ నిర్ధారణ అయినట్లు తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందన్నారు. భారత్ లో సెప్టెంబర్ 9న తొలి మంకీపాక్స్ కేసు నమోదైంది. విదేశాల నుంచి వచ్చిన ఓ యువకుడి నమూనాలు పరీక్షించగా.. అది పశ్చిమ ఆఫ్రికాలో వ్యాప్తిలో ఉన్న క్లేడ్-2 రకంగా నిర్ధరించిన విషయం తెలిసిందే. అనంతరం యూఏఈ నుంచి కేరళకు వచ్చిన 38 ఏళ్ల వ్యక్తికి మంకీపాక్స్ నిర్ధారణ అయినట్లుగా సెప్టెంబర్ 18న కేరళ ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రస్తుతం 122 దేశాల్లో 99,518 మంకీ పాక్స్ కేసులు నమోదయ్యాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకటించింది. దీంతో ఇది ప్రపంచ దేశాలకు పెద్ద ఆరోగ్య సమస్యగా మారింది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ఈ వ్యాధి వ్యాప్తిని నిరోధించడానికి పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మహమ్మారి ఆఫ్రికా దేశాల్లో విస్తృతంగా వ్యాపిస్తుండడంతో అక్కడ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించినట్లుగా అంతర్జాతీయ మీడియా వెల్లడించింది.

## విక్రాంత్ మాస్సే 12th ఫెయిల్‌కి అరుదైన గౌరవం



**ఢిల్లీ:** బాలీవుడ్ యంగ్ హీరో విక్రాంత్ మాస్సే నటించిన 12th ఫెయిల్ చిత్రానికి అరుదైన గౌరవం దక్కింది. కేసుల విచారణకు వేదికగా ఉన్న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు లో ఈ చిత్రాన్ని తాజాగా ప్రదర్శించారు. సీజేఐతోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులు, రిజిస్ట్రీ అధికారుల కోసం ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. అడ్మినిస్ట్రేషన్ భవనంలోని సి-బ్లాక్‌లో గల ఆడిటోరియంలో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సీజేఐ డీవై చంద్రచూడ్ సహా 600 మంది న్యాయవాదులు, ఇతర అధికారులు ఈ చిత్రాన్ని వీక్షించారు. ఐపీఎస్ ఆఫీసర్ మనోజ్ కుమార్ శర్మ, ఐఆర్ఎస్ ఆఫీసర్ శ్రద్ధా జోష్ జీవిత కథ ఆధారంగా ఫిల్మ్‌ను తెరకెక్కించారు. విదు వినోద్ చోప్రా తీసిన 12th ఫెయిల్ సినిమా గతేడాది అక్టోబర్ 27వ తేదీన రిలీజైంది. హిందీ, తమిళ్, తెలుగు, కన్నడ భాషల్లో ఆ సినిమాను విడుదల చేశారు. చిన్న సినిమాగా విడుదలైన 12th-ఫెయిల్ చిత్రం పెద్ద సినిమాలకు పోటీనిస్తూ మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. మనోజ్ పాత్రలో విక్రాంత్ మాసే నటించారు. మేధా శంకర్ హీరోయిన్ పాత్రను పోషించారు. అనురాగ్ పాఠక్ రాసిన నవల ఆధారంగా 12th ఫెయిల్ సినిమాను తీశారు. విక్రాంత్ మాస్సే ఈ సినిమాలో మనోజ్ అనే ఐపీఎస్ ఆస్పిరంట్‌గా కనిపించాడు. చంబల్‌లోని ఒక చిన్న గ్రామం నుంచి ఢిల్లీలోని ముఖర్జీ నగర్‌కు యూపీఎస్సీ ప్రిపరేషన్ కోసం వచ్చిన విక్రాంత్ అక్కడ ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడు అనేది కథాంశం. ఇక యూపీఎస్సీ కోసం ప్రయత్నించే లక్షలాది విద్యార్థుల నిజమైన కథల నుంచి ఈ చిత్రం రూపొందింది.

## మంత్రి పొంగులేటి నివాసంలో ఈడీ సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

సోదాలు చేపట్టారు.శుక్రవారం రాత్రి సమయానికి శ్రీనివాస్ రెడ్డి ఇల్లు, ఫామ్ హౌజ్‌తో పాటు ఐదు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు ఈడీ అధికారులు.

**కలకం రేపిన సోదాలు..**

రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో, ఆయన బంధువుల ఇళ్లలో ఈడీ సోదాలు కలకలం రేపాయి. లగ్జరీ వాచ్‌ల కొనుగోలు కోసం క్రిప్టో, హవాలా మార్గంలో లావాదేవీలు జరిపారనే అభియోగంతో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. ఫిబ్రవరి 5న సింగపూర్ నుంచి ఖరీదైన వాచ్‌లు తెప్పించారని, ఇందుకు సుంకం చెల్లించలేదని, చెన్నై కస్టమ్స్ అధికారులు అతని కుమారుడు హర్షారెడ్డికి నోటీసులు జారీ చేశారు. సింగపూర్ నుంచి చెన్నై పోర్టుకు వాచ్‌లు వచ్చినట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. అలోకం నవీన్ కుమార్ మధ్యవర్తిగా సింగపూర్‌కి చెందిన ఫహెర్దీన్ ముబీన్ నుంచి హర్షరెడ్డి వాచ్‌లు కొనుగోలు చేసినట్లు కస్టమ్స్ గుర్తించింది. విచారణలో అలోకం నవీన్ కుమార్ రూ. 100 కోట్ల స్మగ్లింగ్ చేసినట్లు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. దీనిపై ఇటీవల చెన్నై కస్టమ్స్ అధికారులు హైదరాబాద్, ఖమ్మంలో సోదాలు చేసింది. ఈ వ్యవహారంపై మరో కేసు నమోదు చేసిన ఈడీ దర్యాప్తు చేస్తోంది. మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. దర్యాప్తులో భాగంగా నగరంలో మొత్తం 5 చోట్ల సోదాలు చేపట్టింది. మంత్రి పొంగులేటి నివాసం, అతని ఫామ్‌హౌస్, జూబ్లీహిల్స్‌లోని కుమార్తె నివాసం, కార్యాలయాలు సహా మొత్తం 5 చోట్ల ఏక కాలంలో ఈడీ సోదాలు చేస్తోంది. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది భద్రతతో సోదాలు కొనసాగాయి.ఈ వ్యవహారంపై మనీలాండరింగ్ సహా మరో కేసు నమోదు చేసిన ఈడీ విచారణను ముమ్మరం చేసింది.

## తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళం

**విశ్వంభర, హైదరాబాద్:** వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధి కి రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళాన్ని అందజేసింది. రూ.20 కోట్ల చెక్కును సీఎంఆర్‌ఎఫ్‌కు అందజేశారు. శుక్రవారం ఉదయం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి ఎం ఎస్ ప్రసాద్, బోర్డు సభ్యులతో పాటు తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రిలయన్స్ గ్రూప్ మెంటార్ పి వి ఎల్ మాధవరావులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎంను కలిసి ఆయనకు రూ.20 కోట్ల చెక్కును అందజేశారు.

# మేడిగడ్డ డ్యామేజీకి ప్రధాన కారణం



**విశ్వంభర, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ దర్యాప్తు వేగంగా జరుగుతోంది. శుక్రవారం గజ్వేల్ ఈఎన్సీ, కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీ హరిరామ్‌ను విచారించింది. ప్రాజెక్టు నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్, ఈఎన్సీ హరిరామ్‌ను 90కి పైగా ప్రశ్నలను అడిగారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణ బిల్లుల చెల్లింపులకు ఏర్పాటు చేసిన కాళేశ్వరం కార్పొరేషన్ ఆర్థిక అంశాలపై సైతం కమిషన్ ఆరా తీసింది.

**వారి పేర్లు ప్రస్తావన...**

శనివారం మరోసారి కమిషన్ ముందు హరిరామ్ హాజరుకానున్నారు. శుక్రవారం సమాధానం చెప్పని ప్రశ్నలకు రేపు డాక్యుమెంట్స్ సమర్పిస్తామని ఆయన తెలియజేశారు. విచారణలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హరిరామ్, అప్పటి తెలంగాణ సీఎస్ ఎస్‌కే జోషి, ఈఎన్సీ మురళీధర్ పేర్లను ప్రస్తావించారు. ఇప్పటి వరకు కార్పొరేషన్ ద్వారా బ్యాంకులకు 29,737 కోట్ల రూపాయలు వరకు తిరిగి చెల్లించినట్లు వివరణ ఇచ్చారు. బ్యాంకుల నుంచి తీసుకున్న డబ్బుల్లో 64 వేల కోట్ల రూపాయలు గుత్తేదారులకు చెల్లింపులు జరిగాయని ప్రస్తావించారు.

**డ్యామేజీకి అదే ప్రధాన కారణం..**

కార్పొరేషన్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లను ప్రభుత్వానికి ఇచ్చామని, అది శాసనసభలో పెట్టారా? లేదా? అనేది తనకు ఏమీ తెలియదని హరిరామ్ వివరించారు. మేడిగడ్డ బ్యారేజీ డామేజ్‌కు బాధ్యులు ఎవరని ఘోష్ కమిషన్, హరిరామ్‌ను ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో గేట్స్ ఆపరేషన్, మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడమే ప్రధాన కారణమన్న హరిరామ్, 2017 సంవత్సరం నాటి ఉన్నత స్థాయి కమిటీ మినట్స్‌ను కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్ ఫాలో కాలేదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు పీసీ ఘోష్ కమిషన్ ఇప్పటికే కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ అధికారులను ప్రశ్నించింది. కమిషన్ ముందు కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట అప్పారావు, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ పద్మావతి, డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్ చీఫ్ ఫణిభూషణ్ శర్మ హాజరయ్యారు. గతంలో దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా వారి నుంచి పలు వివరాలపై ఆరా తీసింది.

# భారత్‌కు యూకే మద్దతు

**లండన్:** ప్రపంచ శాంతి స్థాపనే లక్ష్యంగా ఏర్పాటైన ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ దిశగా ప్రధాని మోదీ ప్రపంచ దేశాల మద్దతు కూడగడుతున్నారు. భారత్ ప్రయత్నాలకు అంతర్జాతీయంగా మద్దతు లభిస్తోంది. ఇప్పటికే పలు దేశాలు భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం మద్దతు ప్రకటించాయి. తాజాగా ఈ జాబితాలోకి యూకే కూడా వచ్చి చేరింది. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌లో బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ మాట్లాడుతూ.. యూఎన్ఎస్సీలో మరిన్ని దేశాలు ప్రాతినిధ్యం వహించాలని పేర్కొన్నారు. 'భద్రతా మండలిలో తగినన్ని సభ్యదేశాలు లేనంతవరకూ ప్రతిపక్ష ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు సాగడం కష్టం. కాబట్టి భద్రతామండలిని మరింత పటిష్టం చేయాలి. ఇందులో భాగంగానే శాశ్వత సభ్యత్వ దేశాల సంఖ్యను పెంచాలి. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలుగా భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీ ఉండాలని కోరుకుంటున్నాం. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి' అని అన్నారు. అంతకుముందు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రన్ స్పందించిన విషయం తెలిసిందే. జనరల్ అసెంబ్లీలో మెక్రాన్ ప్రసంగిస్తూ.. యూఎన్ఎస్సీ విధానాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని మెక్రాన్ అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిలో భారత్‌కు మద్దతు ప్రకటించారు. యూఎన్ఎస్సీ సమర్థతను పునరుద్ధరించడానికి ఈ మార్పులు తగినవి అని పేర్కొన్నారు. ఇక గత వారం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి అమెరికా కూడా మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక అమెరికన్ టైకూన్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సైతం గతంలోనే భారత్‌కు మద్దతు ప్రకటించారు. ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా భద్రతామండలి ఏర్పడి ఏడున్నర దశాబ్దాలు దాటింది.కాగా, భద్రతా మండలిలో భారత్‌కు సాధారణ సభ్యత్వం మాత్రమే ఉంది. భద్రతా మండలిలో ప్రస్తుతం చైనా, అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యా దేశాలు శాశ్వత సభ్య దేశాలుగా కొనసాగుతున్నాయి. ఈ ఐదు దేశాలకు ప్రత్యేకంగా వీటో పవర్ ఉంటుంది. మండలి సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను ఈ ఐదు దేశాల్లో ఏ ఒక్క దేశం అభ్యంతరం వ్యక్తం చేసినా సరే ఆ నిర్ణయం వీగిపోతుంది. శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఐదింటిలో నాలుగు మద్దతు ఇస్తున్నా.. చైనా మాత్రం భారత్ ప్రయత్నాలకు అడ్డుపడుతోంది.

## నేను నిద్రపోను.. రేవంత్ రెడ్డిని నిద్రపోనీయను

(మొదటి పేజీ తరువాయి)

ధర్నాలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ జరిగే వరకు నేను నిద్రపోను, రేవంత్ రెడ్డిని నిద్రపోనీయను అన్నారు. రైతుబంధు కేసీఆర్ హయంలో నాట్లకు రైతుబంధు అందిస్తే, ఈ ప్రభుత్వం పంట కోతకు వచ్చినా రైతుబంధు ఇవ్వలేదని మాజీ మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు దొంగరాత్రి కరెంట్ ఇస్తుందని, కానీ కేసీఆర్ కడుపు నిండా 24 గంటల కరెంట్ ఇచ్చిందని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు వచ్చిన 24 గంటల కరెంటు.. ఇప్పుడెందుకు వస్తలేదని ఆయన ప్రశ్నించారు. కరోనా సమయంలోనూ రైతు బంధుకు సమయం ఇచ్చినమన్నారు.

రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని, ఈ వానాకాలం ఆయన చెప్పిన రూ.7,500 లేవని, గతంలో ఇచ్చిన రూ.5 వేలు లేవని మండిపడ్డారు. రైతు బంధు ఇవ్వకుండా రైతులను అప్పులపాలు చేస్తున్నారని విమర్శించారు. కుంటిసాకులు, అబద్దాలతో కాలం గడుపుతున్నారని అన్నారు. కేసీఆర్ 11 సార్లు సమయానికి రైతు బంధు ఇచ్చిండని, వద్దు కొంటే మూడు రోజుల్లో పైసలు వేసిండని చెప్పారు. కేసీఆర్ రైతు విలువ, రైతు భూమి విలువ పెంచిండని, కానీ కాంగ్రెస్ వచ్చినంక రైతు విలువ తగ్గిందని, భూమి విలువ తగ్గిందని హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం కూలిపోయిందంటున్న రేవంత్ రెడ్డి వచ్చి రంగనాయకసాగర్, మాల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ చూడాలని సూచించారు. కాళేశ్వరంలో వంద బాగాలు ఉంటాయని, అందులోని ఒక్క భాగంలో రెండు పిల్లర్లు కుంగితే మొత్తం పోయిందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

కేసీఆర్ వచ్చి కాళేశ్వరం కట్టినంక రైతులు రెండు పంటలు పండిస్తున్నరని చెప్పారు. రెండు లక్షల మాఫీ, వడ్లకు బోనస్ అన్నారని, వచ్చిందా అని మాజీ మంత్రి ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకు బోనస్ అని, ఇప్పుడు సన్నాలు అంటున్నారని మండిపడ్డారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తెలంగాణ దర్శిని

(మొదటి పేజీ తరువాయి)

తీసుకెళ్తామన్నారు. మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, మూసీ పరివాహకంలోని చారిత్రక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దనున్నట్టు సీఎం తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రి గోషామహల్‌కు తరలిస్తాం.. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని సీఎం అన్నారు. పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసన మండలిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం శాసనమండలి కొనసాగుతున్న జూబ్లీహాల్‌ను పరిరక్షించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన జూబ్లీహాల్ ను దత్తత తీసుకొని పరిరక్షించాలని సీఐఐకి ముఖ్యమంత్రి సూచించారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ కు తరలించి ప్రస్తుత భవనాన్ని పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైకోర్టు భవనం, సిటీ కాలేజ్ భవనం, పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.. పలు ఒప్పందాలు కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని.. సచివాలయంలో తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే.. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల పునరుద్ధన గురించి సమీక్షలో చర్చించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పురాతన కట్టడాలు కాపాడడమే లక్ష్యంగా సీఐఐతో రాష్ట్ర పర్యాటక శాఖ ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఈ క్రమంలో.. పురాతన బావులను దత్తత తీసుకునేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ రంగ సంస్థలు ముందుకొచ్చాయి. ఇకపై పురాతన బావులను ప్రక్షాళన చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి వారికి ఒప్పంద పత్రాలు అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్దరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. మంచిరేవుల మెట్ల బావిని సాయి లైఫ్ సంస్థ దత్తత తీసుకుంది. భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్దరించనుంది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్‌నుమా మెట్ల బావిని టీజీఎస్ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్దరించనుంది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ఏడుకొండలవాడి పవిత్రతను కాపాడేందుకు

## అత్యంత ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఏడుకొండలవాడి పవిత్రతను కాపాడేందుకు, భక్తుల మనోభావాలను పరిరక్షించేందుకు మా ప్రభుత్వం ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. తిరుమల దర్శనానికి వెళ్లే ప్రతి భక్తుడు అత్యంత నియమనిష్టలతో, శ్రద్ధాసక్తులతో స్వామివారిని ఆరాధిస్తారు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ఈ క్షేత్ర పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. శ్రీవారి సన్నిధికి వెళ్లే ప్రతి ఒక్కరూ ఆలయ నియమాలు, ఆగమశాస్త్ర ఆచారాలను, తితిదే నిబంధనలను తప్పక పాటించాలని కోరుతున్నా. భక్తుల మనోభావాలకు, ఆలయ ఆచారాలకు భిన్నంగా ఎవరూ వ్యవహరించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

## ప్రధానితో తమిళనాడు సీఎం భేటీ



(మొదటి పేజీ తరువాయి)

చెన్నై మెట్రోను ఏవిధంగా అయితే కేంద్రం, రాష్ట్రం కలిసి అమలు చేశాయో అదేవిధంగా రెండో విడత కూడా అమలు చేయాలని తాము కోరుకుంటున్నామని ప్రధాని చెప్పారు. 2021-22 బడ్జెట్‌లో చెన్నై రైల్ ఫేస్-2 ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తామని ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారని, 2022లో కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోదం తెలిపిందని అన్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టు నత్తనడకన నడుస్తోందని, ఆ కారణంగా ఎలాంటి జాప్యం లేకుండా నిధులు విడుదల చేయాలని ప్రధానిని కోరినట్టు స్టాలిన్ చెప్పారు. తమిళ మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రధాని జోక్యం చేసుకోవాలని, సమగ్ర శిక్షా పథకం కింద కేంద్ర నిధులను తమిళనాడుకు విడుదల చేయాలని కూడా కోరినట్టు తెలిపారు.

## ముడా కుంభకోణం కేసులో సిద్ధరామయ్యపై కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆ ఎఫ్ఐఆర్ సిద్ధరామయ్యను ప్రథమ నిందితుడిగా పేర్కొంది. ఆయన సతీమణి పార్వతి, బావమరిది మల్లికార్జున్ స్వామితో పాటు మరోవ్యక్తి పేరు నిందితుల జాబితాలో చేర్చింది. 'ముడా' స్థలాల కేటాయింపుల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుటుంబసభ్యులు లబ్ధి పొందటం, అందుకు ముఖ్యమంత్రి అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు దాఖలాలతో సామాజిక కార్యకర్త టి.జె అబ్రహం గవర్నర్కు ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు స్నేహమయి కృష్ణ, ప్రదీప్ కుమార్ ముఖ్యమంత్రిపై ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదుల మేరకు ఆగస్టు 16న సీఎంను విచారించాలంటూ గవర్నర్ ఆదేశించారు. ఈ ఆదేశాలను రద్దు చేయాలని మంత్రివర్గం తీర్మానించగా.. దానిని గవర్నర్ తోసిపుచ్చారు. దాంతో సీఎం హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది.ఈ భూకుంభకోణం సమగ్ర దర్యాప్తులో భాగంగా సిద్ధూను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడం చట్టబద్ధమేనని న్యాయస్థానం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. అదే సమయంలో కర్ణాటక లోకాయుక్త అధికారి ఆధ్వర్యంలో దర్యాప్తునకు ప్రత్యేక న్యాయస్థానం అనుమతించగా.. తాజాగా కేసు నమోదైంది.

## విచారణకు హాజరు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

కేసు పెండింగ్‌లో ఉందని చెప్పినా పట్టించుకోకుండా కూల్చేశారని బాధితుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైడ్రా కమిషనర్ వివరణ ఇవ్వాలని కోర్టు సూచించింది. నేరుగా లేదా ఆన్‌లైన్ విచారణకు హాజరు కావాలని హైడ్రా కమిషనర్‌ను కోర్టు ఆదేశించింది.

# లైంగిక వేధింపుల కేసులో జానీ మాస్టర్‌కు ప్రశ్నల వర్షం

### పోలీసు విచారణలో కీలక అంశాలు



**విశ్వంభర, హైదరాబాద్:** కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ దగ్గర మూడోరోజు పోలీసు ఇంటరాగేషన్ కొనసాగుతోంది. లాయర్ సమక్షంలో జానీ మాస్టర్‌పై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు పోలీసులు. కేసులో కీలమైన టెక్నికల్ ఎవిడెన్స్ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే బాధితురాలి నుంచి రెండుసార్లు స్టేట్మెంట్లను పోలీసులు రికార్డు చేశారు. అయితే... ఇంటరాగేషన్‌లో జానీ మాస్టర్ పలు కీలక విషయాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. బాధితురాలు సమర్పించిన ఆధారాలను ముందుపెట్టి జానీ మాస్టర్ దగ్గర పోలీసులు విచారణ జరుపుతున్నారు. బాధితురాలే తనను వేధించిందని జానీ మాస్టర్ పోలీసులకు చెప్పినట్లు సమాచారం. ఢీ షో సమయంలో బాధితురాలు తనకు తానే పరిచయం చేసుకున్నట్లు పోలీసులకు జానీ మాస్టర్ తెలిపారు. తనపై బాధితురాలు చేస్తోన్న లైంగిక వేధింపుల ఆరోపణలు నిరాధారమైనవిగా పోలీసులకు జానీ మాస్టర్ చెప్పినట్లు తెలుస్తోంది. బాధితురాలు మైనర్‌గా ఉన్న సమయంలో ఆమెపై తాను లైంగిక దాడి చేశానన్నది అబద్ధమని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. కేవలం తన ట్యాలెంట్‌ను గుర్తించి అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. తనను పెళ్లి చేసుకోవాలని బాధితురాలే తనను హింసించేదని.. ఈ విషయంలో చాలాసార్లు బాధితురాలు తనపై బెదిరింపులకు దిగినట్లు పోలీసు విచారణలో వెల్లడించారు. ఈ విషయంలో తాను పడుతున్న ఇబ్బంది గురించి డైరెక్టర్ సుకుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపాడు. సుకుమార్ పిలిచి మాట్లాడినా బాధితురాలు తీరులో మార్పు లేదని జానీ మాస్టర్ పోలీసులకు తెలిపాడు. తనపై కుట్ర జరిగిందని.. వెనుక ఉండి తనకు వ్యతిరేకంగా కుట్ర చేశారని.. తన ఎదుగుదలను చూసి ఓర్వలేకే ఈ కేసులో తనను ఇరికించారని పోలీసులకు తెలిపాడు. ఇక మొత్తంగా శనివారంనాటితో రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు అనుమతించిన నాలుగు రోజుల పోలీసు కస్టడీ ముగియనుంది. శనివారం సాయంత్రం 4 గంటల వరకు ఆయన దగ్గర పోలీసుల విచారణ కొనసాగనుంది. అనంతరం రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టులో జానీ మాస్టర్‌ను పోలీసులు హాజరుపరచనున్నారు. మరోవైపు జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది.

## హైదరాబాద్‌లో..

# మరో కొత్త హెచ్‌సీఎల్ క్యాంపస్..

### 5 వేల మంది ఇంజినీర్లకు ఉద్యోగాలు..!



**విశ్వంభర, హైదరాబాద్ :** హైటెక్ సిటీలో హెచ్‌సీఎల్ త్వరలో కొత్త క్యాంపస్‌ను ప్రారంభించనుంది. ఇందులో అదనంగా 5 వేల మంది ఇంజినీర్లకు ఉద్యోగాలను కల్పించనుంది. శుక్రవారం సచివాలయంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవానికి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానంగా చర్చించారు. విద్యార్థులకు మెరుగైన శిక్షణతో పాటు, విద్యా వనరులను విస్తరించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో హెచ్‌సీఎల్ భాగస్వామ్యం ఉండాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువకులకు ప్రయోజనం చేకూర్చే నైపుణ్యాభివృద్ధికి హెచ్‌సిఎల్‌తో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

రాష్ట్రంలో ఇప్పటికే ఉపాధి అవకాశాల కల్పనకు హెచ్‌సీఎల్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. హెచ్‌సీఎల్‌కు రాష్ట్ర ప్రభుత్వం తగినంత సహకారం అందిస్తుందని అన్నారు. హెచ్‌సీఎల్ వ్యూహాత్మక భాగస్వామ్యం యువతకు ఉద్యోగాలను కల్పించటంతో పాటు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో యువతకు నైపుణ్యాలను నేర్పించి సాధికారత కల్పించేందుకు చేపట్టే కార్యక్రమాల్లో తమ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందని రోష్నీ నాడార్ అన్నారు. ఉపాధి అవకాశాలతో పాటు సాంకేతిక సామర్థ్యాలను HCL GUVI పెంపొందిస్తుందని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వంతో తమ కంపెనీ భాగస్వామ్యం పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించి అభ్యాసకులకు సాధికారత కల్పిస్తుందని అన్నారు. ఔత్సాహిక సాంకేతిక నిపుణులను తయారు చేస్తుందని చెప్పారు.

స్కిల్ యూనివర్సిటీతో పాటు హెచ్‌సిఎల్ విద్యా కార్యక్రమాలను తెలంగాణలో ఉన్న ఇతర విశ్వవిద్యాలయాలకు విస్తరించే ప్రణాళికలు, దీంతో ఎక్కువ మంది లబ్ధి పొందుతారనే ఆలోచనలను కూడా ఈ సమావేశంలో పంచుకున్నారు. హెచ్‌సీఎల్ రెండేండ్ల కిందట తమ నైపుణ్య విభాగం GUVIని ప్రారంభించింది. దీంతో దేశీయ భాషల్లో సాంకేతిక కోర్సులను అందిస్తోంది. ప్రధానంగా సాంకేతిక విద్యలో భాషా అవరోధాలు తొలిగించేందుకు కృషి చేస్తోంది.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి కొండా సురేఖకు నిరసన సెగ



**విశ్వంభర, సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖకు నిరసన సెగ తగిలింది.చెక్కుల పంపిణీ చేస్తున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులుతులం బంగారం ఎప్పుడిస్తరు అనే ప్లకార్డులు ప్రదర్శించడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. బీఆర్ఎస్ కార్యకర్తల ప్లకార్డులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలు కుర్చీలు ప్రదర్శించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల నాయకులను చెదరగొట్టారు. కాంగ్రెస్ కార్యకర్తలకు పోలీసులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఇరు వర్గాలకు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

## మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

### డ్రైవర్ మృతి, 20 మంది విద్యార్థులకు గాయాలు

**విశ్వంభర, నర్సాపూర్ :** మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదంచోటు చేసుకుంది. రెండు కాలేజీ బస్సులు ఢీ కొనడంతో ఓ డ్రైవర్ మృతి చెందగా 20 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే..మెదక్ జిల్లా నర్సాపూర్( సమీపంలో బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన రెండు కాలేజీ బస్సులు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో 20 మంది విద్యార్థులకు గాయాలవ్వగా డ్రైవర్ నాగరాజు మృతి చెందాడు. మరో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివారాలు తెలియాల్సి ఉంది.



## ఖానాపూర్ చెరువు సర్వేకు వెళ్లిన

# అధికారులను అడ్డుకున్న స్థానికులు

**విశ్వంభర, ఆదిలాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా కూల్చివేతలపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ఇలాంటి తరహా కూల్చివేతలకు పలు జిల్లాల్లో అధికారులు శ్రీకారం చుట్టారు. ఎలాంటి సమాచారం లేకుండా కూల్చివేతలకు పాల్పడుతున్నారు. తాజాగా ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని గుర్తించడానికి మున్సిపల్, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకున్నారు. సర్వే కోసం వచ్చిన అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. నంబర్లు వేయవద్దంటూ అధికారులను నిలదీశారు. ఎన్నో ఏండ్లుగా ఇక్కడ నివసిస్తున్న తమను ఆక్రమణల పేరుతో ఆగం చేయొద్దని అధికారులను అడ్డుకున్నారు. స్థానికుల ఆందోళనతో చేసేదిమిలేక మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది వెనుదిరిగారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు హైదరాబాద్ నగరంలోని మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ఉద్రిక్తత కొనసాగుతున్నది.




ఆపరేషన్ మూసీ పేరుతో తమ ఇండ్లకు మార్కింగ్ చేయడంపై నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వే చేయడానికి వస్తున్న అధికారులను అడ్డుకుంటున్నారు. మూసీ సుందరీకరణకోసం తమ బతుకులను ఛిద్రం చేస్తున్నారంటూ మండిపడితున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనబాటపట్టారు.

## కన్వీనర్ కోటా

# ఎంబీబీఎస్ వెబ్‌ఆప్షన్లు ప్రారంభం..

### సెప్టెంబర్ 29 వరకు అవకాశం

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో 202425 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్ల అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా గురువారం నుంచి వెబ్‌ఆప్షన్లు కూడా మొదలయ్యాయి. ఈ మేరకు అవకాశం కల్పిస్తూ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. కన్వీనర్ కోటా సీట్లకు పోటీపడే విద్యార్థులు సెప్టెంబర్ 26 ఉదయం 6 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ సాయంత్రం 6 గంటలలోపు వెబ్‌ఆప్షన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొంది. ఇప్పటికే విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమెదు ప్రారంభించారు.





కన్వీనర్ కోటా (కాంపిటెంట్ ఆథారిటీ కోటా)లో దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు, పోలీసు అమరవీరుల పిల్లలు (పీఎంసీ), సైనికోద్యోగుల పిల్లలు (క్యాప్) కేటగిరీకి చెందిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ప్రైవేటు, అన్‌ఎయిడెడ్, మైనార్టీ/నాన్ మైనార్టీ మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేస్తున్నట్లు వివరించింది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల మెరిట్ జాబితా కాళోజీ వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. రాష్ట్రంలో మొత్తం 34 ప్రభుత్వ, 22 ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉన్నాయి. మరో 4 ముస్లిం మైనార్టీ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేయనుంది. కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న 16,694 మంది విద్యార్థుల తుది మెరిట్ జాబితాను విడుదల చేసింది. వీరితో పాటు కోర్టు ద్వారా అనుమతి తెచ్చుకున్న విద్యార్థుల మెరిట్ జాబితాను వర్సిటీ పొందుపరిచింది. సీటు పొందిన విద్యార్థులు రూ.12 వేలు చెల్లించి ఎలాట్‌మెంట్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కన్వీనర్ కోటా సీట్లకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఫీజు రూ.10 వేలు, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో రూ.60 వేలు, ఈఎస్ఐ మెడికల్ కాలేజీల్లో రూ. లక్షగా ఉంటుంది.

మొదటి రౌండ్‌లో కన్వీనర్ కోటా సీట్లకు వెబ్‌ఆప్షన్లు ఇవ్వని విద్యార్థులకు రెండో రౌండ్‌లో వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉండదు. అలాగే మొదటి రౌండ్‌లో ఎంబీబీఎస్ సీటు పొందిన విద్యార్థులు సంబంధిత కాలేజీల్లో చేరకుంటే తర్వాత రౌండ్లలోకౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అర్హత ఉండదు. ఈ మేరకు ఎంబీబీఎస్ ప్రవేశాల్లో అర్హతకు సంబంధించి హైకోర్టులోని పెండింగ్‌లో ఉన్న కేసుల తుది తీర్పునకు లోబడి సీట్ల కేటాయింపులు, అడ్మిషన్లు ఉంటాయని వర్సిటీ తన ప్రకటనలో వివరించింది. కన్వీనర్ కోటా వెబ్‌ఆప్షన్లను వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. విద్యార్థులకు ఇందుకు సంబంధించి ఎవైనా సందేహాలు, సమస్యలు ఉంటే 9392685856/7842136688/9059672216 నంబర్లకు ఫోన్ చేయొచ్చు. లేదా tsmedadm2024@gmail.comకు మెయిల్ పంపవచ్చని పేర్కొంది.











# నవయుగ కవి చక్రవర్తి

## నేడు గుఱ్ఱం జాషువా జయంతి

> రాజులను సేవించడం, ఆస్థాన కవులుగా అగ్రహారాలు రాయించుకోవడం, దేవుళ్ళ చరిత్రలను, వారి మహిమలను రాసి భక్త కవులుగా మారిపోవడం, సంస్కృత కావ్యాలను తెనుగీకరించడం, పురాణ కథలు, గాథలను స్త్రీ అంగాంగ వర్ణనలతో విలసిల్లే ప్రబంధాలుగా రాసి, తమకు తామే గొప్ప కవులమని పొగిడించుకోవడం పరిపాటిగా మారిన తెలుగు కావ్య చరిత్రలో శిష్ట, ఆత్మాశ్రయ, సంప్రదాయ కవిత్వం రాసిన వారే నిజమైన కవులని ముద్రపడిన పండిత జననాడిని, తనవైపు తిప్పుకుని.. కవిత్వమంటే అట్టడుగు వర్గాల ప్రజల కష్టాలు, వెలివేతలు, కన్నీళ్ళు, కడగండ్లు, కులభేదాలు అని చెప్పి, మత్తేభ, శార్దూల, సీస పద్యాలతో మరో చరిత్రను కావ్య ప్రపంచంలో సృష్టించి కన్నీటిని తుడిచిన కవి అతడు.



నాలుగు పడగల హైందవ నాగరాజు 'తలను' తన కావ్య 'నాదస్వరం'తో నేలకు కొట్టించిన నవ్యకవి అతడు. భారత కులవ్యవస్థను కూకటివేళ్ళతో పెకిలించివేయాలని కావ్యనినాదం చేసిన "నవయుగ కవిచక్రవర్తి" అతడు. వడగాల్పు జీవితాన్ని, వెన్నెల కవిత్వంగా మార్చుకున్న చందమామలాంటి కవి అతడు. 'ఎన్నో యేళ్ళు గతించి పోయినవి.... ఒక్కడైనను లేచి రాడని' దళిత ధిక్కార ప్రభంజనం వినిపించి కరకు రాతి అగ్రవర్ణ గుండెలపై దండోరా వేసి తన 'గబ్బిలం'తో ప్రశ్నల కొడవళ్ళు విసిరిన ఆ'ఖండకావ్యం'పేరే 'గుఱ్ఱం జాషువా'..28 సెప్టెంబర్, 1885లో గుంటూరు జిల్లాలోని వినుకొండలో గుఱ్ఱం వీరయ్య - లింగమాంబలకు జన్మించాడు జాషువా, తండ్రిది యాదవ కులం అయినా జాషువా అగ్రకుల బ్రాహ్మణ మనువాదులచే ఈసడించబడ్డాడు. అది తన 'ఉత్పల మాల' పద్యంలో సిగ్గుపడుతున్నాను. ఈ కులరక్కసులను చూచి అని స్వయంగా చెప్పుకున్నాడు.

'నా కవితా వధూటి వదనంబు
నెగాదిగ జూచి రూపురే /
ఖా కమనీయ వైఖరులు గాంచి
భళీ భళీ యన్న వారే మీ /
దే కుల మన్న ప్రశ్న వెలయించి
చివాలున లేచి పోవుచో /
బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర!
వచింప సిగ్గగున్'

అని కవిత్వం బ్రాహ్మణుల సొత్తుకాదు అని, దళిత వర్గాల దారిద్ర్యాన్ని రూపుమాపడానికి కావ్యమే ఆయుధ మని చెప్పి 'గబ్బిలం'లో కథానాయకుడిగా దళితున్ని పెట్టి శివునికి తమ సమస్యలను ఏకరువు పెట్టిన మనసున్న కవి జాషువా.

'"ఎల్లకష్టముల్ బుక్కెడు బువ్వతో మరిచిపోవు క్షుధానల దగ్ధమూర్తి'" దళితుడు అని భారతదేశంలో కుల నిర్మూలన జరగాలని వారి క్షుద్బాధ తీరాలని కాంక్షించారు. /

"వాని రెక్కల కష్టంబు లేని నాడు / పస్యరమ పండిపు లకింప సంశయించు / వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు భోజనము బెట్టు, వానికి భుక్తి లేదు"'

**అని రైతు బాధలనువిప్పిచెప్పిన మానవతావాది జాషువా.**

జాషువా తిరగబడే తత్వం కలవాడు. చిన్నప్పటి నుంచే అగ్రవర్ణ పిల్లల అవహేళనకు గుర్తుగా వాళ్ళను కొట్టేవాడు. 1910వ సంవత్సరంలో వివాహం తర్వాత మూడురూపాయల జీతానికి మిషనరీ పాఠశాలలో ఉద్యోగం చేశాడు. 1915-16 కాలంలో సినిమా వాచకుడిగా పనిచేశాడు. తర్వాత గుంటూరులోని లూథరన్ చర్చి నడుపుతున్న ఉపాధ్యాయ శిక్షణాలయంలో 10 సంవత్సరాలు పనిచేశాడు. 1928 నుంచి 1942 వరకు గుంటూరులోని ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేశాడు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ప్రచారకుడిగా పనిచేశారు. 1957-59 వరకు మద్రాసు రేడియో కేంద్రంలో ప్రోగ్రాం ప్రొడ్యూసర్‌గా, కవిగా తాను ప్రజల నాలుకల మీద నిలచిన తర్వాత కూడా ప్రభుత్వాలు, అగ్రకులాలు గుర్తించకుంటే వారి మనుగడ ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి కనబడడంతో జాషువాను అందలమెక్కించారు. గండపెండేరం తొడిగారు. అయినా అది తన కవిత్వానికి, కావ్యానికి ఇచ్చిన గౌరవం గానే జాషువా భావించారు.

జాషువా కవిగానే కాదు, సమాజంలో ఉన్న మూడా చారాలను, నిమ్నవర్గాల జీవన విధానాలను, వాటిని అమలు పరుస్తున్న వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిన సంఘ సంస్కర్త. వేల, లక్షల, కోట్ల రూపాయలు వెచ్చించి దేవుళ్ళ పెళ్ళిళ్ళు చేస్తారు కానీ, పేదరికంలో మగ్గు తున్న వారి ఆకలి కేకలు ఎవరికీ వినపడవని పాలకు లను ప్రశ్నించారు. "ప్రతిమల

పెండ్లి జేయుటకు వందలు వేలు
వ్యయించుగాని దుః /
ఖితమతులైన పేదల ఫకీరుల
శూన్య ములైన పాత్రలన్ /
మెతుకు విదల్పరీ భరత మేదిని
ముప్పది మూడుకోట్ల దే /
వత లెగవడ్డ దేశమున భాగ్య విహీనులక్షుత్తులారునే?"

జాషువా కాంక్షించిన ప్రజాపక్ష పాలన నేటికీ రాలేదు. దళితుల బతుకులు మారుతాయన్న నమ్మకం నానాటికీ సన్నగిల్లుతోంది. ఈ భారతదేశం అట్టడుగు వర్గాల శూద్రు లకు అప్పుపడి ఉందని, దానిని వడ్డీతో సహా భవిష్యత్ కాలంలో చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించాడు. ఆ విషయాన్ని చాతుర్వర్ణ వ్యవస్థను పెంచిపోషించి, లేని 'పంచమ కులాన్ని' మనుషులకు ఆపాదించిన గొప్పతనం కేవలం హిందూమతంలోనే ఉందని వాపోయాడు. కులంపేరు తో తాను పడిన బాధలు, సహించిన అవమానాలు తన జాతి జనులకు రాకూడదని భావించాడు.

దేశంలో ఐకమత్యం ఉన్నదని. దానిని కులవ్యవస్థ చెడు, పెడతోవ పట్టిస్తున్నదనీ , దీనిని బుద్ధిజీవులు ఆపాలని కోరారు. జాషువా అంటరానితనం, కులభేదాలు, వెట్టిచాకిరీ, మూఢనమ్మకం పెంచి పోషించే వ్యవస్థపై 'కలం' ఎక్కుపె ట్టాడే కానీ, వ్యక్తిగత కోపతాపాలు, కులాభిమానం లేని వ్యక్తి అని సాహితీ లోకం గుర్తించాలి. జాతీయాభిమానం మెండుగా ఉన్న నిజమైన భారతీయుడు. జాషువా స్వాతంత్రం రాకపూర్వం, మరియు వచ్చిన తర్వాత జరిగిన సంఘటనలు నొక్కి వక్కాణిస్తూ 'తెల్ల దొంగలు తినురందురేల, నల్లదొంగలు నల్లమార్కెట్టులో తినకుండా చూచుకోండి' అని చెప్పాడు.

'జాషువా వర్ణవ్యవస్థ, దేశ కాల గమనాలతో పాటు, పసిమనసును పవిత్రంగా భావించి, ప్రతి ఇంట్లో వినిపించే కేరింతలు, మాటలు, అల్లరి గురించి అద్భుతంగా వర్ణించిన 'శిశువు' ను యోగి గా పరిచయము చేశాడు.

" బొట వ్రేల ముల్లోకముల జూచి లో లోన ఆనందపడు నోరులేని యోగి" అని చెప్పిన

ఖండకావ్య పద్యాలు తన కావ్య ప్రతిభకు గీటురాయిగా నిలుస్తాయనడం అతిశయోక్తి కాదు. గుఱ్ఱం జాషువా అనగానే 'గబ్బిలం' గుర్తుకు వస్తుంది. దానిని పక్షిగా ఎవరూ భావించరు. అలాగే నిమ్న జాతులను కూడా మనుషులుగా భావించలేదు. వారెవరూ ఊళ్ళో ఉండకుండా ఊరవతల కాలనీలు కట్టి నెట్టివేయడాన్ని సహించలేకపోయాడు.

'నిమ్నజాతుల కన్నీటి నీరదములు /
పిడుగులై దేశమును కాల్చివేయు'నని

దేశం బాగుపడాలంటే అందరినీ సమానత్వంతో చూడాలని చెప్పారు. అతడు స్పృశించని కథావస్తువు లేదు. పూర్వ కథావస్తువులను కాదని, సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలు, రైతులు, శ్రామికులు, పక్షుల జీవన విధానం (గిజిగాడు), శిశువులు, వీరులు, దేశభక్తులు, ప్రవక్తలు మొదలగు వారి జీవిత చరిత్రలను కూడా పద్య కావ్యాలుగా మలిచిన కీర్తి జాషువాకే దక్కుతుంది. జాతీయాభిమానం, సంఘ సంస్కరణాభిలాష, సూటిగా తన రచనలలో కన్పిస్తాయి. జాషువా శైలి సమ్మోహనాస్త్రం: పండిత పామర జనరంజకంగా ఆకట్టుకునే శైలి జాషువా సొంతం. ఏసుక్రీస్తు, బుద్ధుడు, గాంధీజీల జీవకారుణ్యం జాషువాలో ఉన్నది. 'రాజులు - పాలకులు రాతి విగ్రహాలలో జీవించినా, జాషువా అనే సుకవి ప్రజల నాలుకల యందు జీవిస్తాడు' అని చెప్పడం తెలుగు భాషకు దక్కిన అదృష్టంగా భావించాలి.

**రాజు మరణించే నొకతార రాలిపోయే**
**సుఖ మరణించె ఒక తార గగన మెక్కె**

**"రాజు జీవించు రాతి విగ్రహముల యందు**
**సుకవి జీవించు ప్రజల నాలుకలయందు"**



-డాక్టర్ మెంతబోయిన సైదులు
-9010910956

# సాహితీ రంగంలో భాను ప్రకాశం



## కవిగా, అవధానిగా ప్రత్యేక గుర్తింపు పొందిన అవుసుల

> తెలుగు భాషోపాధ్యాయునిగా, అవధానిగా, వక్తగా, వ్యాఖ్యాతగా, ప్రభుత్వ పాఠ్యపుస్తక రచయితగా, కమిటీ సభ్యులుగా, వ్యక్తిత్వ వికాస నిపుణులుగా, బాలగేయ కవిగా, మోటివేషనల్ స్పీకర్ గా సాహితీ లోకంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పొందారు అవుసుల భానుప్రకాశ్. తాజాగా పిల్లల కోసం ట్రెండింగ్ పద్యాలు పుస్తకం వెలువరించి బాల సాహితీవేత్తల కుటుంబంలో చేరిపోయాడు.

మెదక్ జిల్లాలో శశిరేఖ, గోపాల్ దంపతులకు 24 డిసెంబరు 1979న జన్మించిన భానుప్రకాశ్ విద్యాభ్యాసం డిగ్రీ వరకు మెదక్ లోనే గడిచింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ తెలుగు పూర్తి చేశాడు. చిన్నప్పటి నుంచి పద్యం పట్ల ఆసక్తి అభిరుచి కనబరిచే భాను ఎం.ఎ. ద్వితీయ సంవత్సరంలో 'భారతీ నీకై అక్షర హారతీ!' అనే కందపద్యాల అర్ధశతిని రచించాడు. విద్యార్థిగా ఉన్నప్పుడే ఆర్ట్స్ కాలేజీలో పద్యకృతిని వెలువరించిన ఘనత సొంతంచేసుకున్నాడు. కాంట్రాక్టు లెక్చరర్ గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన ఆయన 2009లో ప్రభుత్వోద్యోగం పొంది తెలుగు స్కూల్ అసిస్టెంట్ గా కొనసాగుతున్నాడు. యుగయుగాల తెలుగుసాహిత్యం అన్వయసూత్రం అనే అంశంపై పరిశోధన చేసి ఎం.ఫిల్ పట్టాపొందాడు. ప్రస్తుతం 'తెలంగాణలో అవధానం - సమగ్రపరిశీలన' అనే అంశంపై పీహెచ్‌డీ చేస్తున్నాడు. ఒకవైపు పిల్లలకు పాఠాలు బోధిస్తూనే విషయనిపుణునిగా ఉపాధ్యాయ శిక్షణల్లో తనవంతు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాడు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రభుత్వ పాఠ్యపుస్తక రచయితగా, తెలంగాణ రాష్ట్రం అవతరించిన తరువాత పాఠ్యపుస్తక రచనా కమిటీ సభ్యులుగా సేవలందిస్తున్నాడు.

**రచన ..సంపాదకత్వం**

భానుప్రకాశ్ తాను స్వయంగా రచించి ప్రచురించడమే కాదు, వివిధ సందర్భాల్లో అనేకమంది కవులతో రచనలు చేయించి పలు సంకలనాలకు సంపాదకత్వం వహించాడు. భాను కలం నుంచి జాలువారిన రచనలివి. భారతీనీకై అక్షర హారతి (కందపద్యాలు), హైందవవీరా (శివాజీ గేయగాథ), అంతర్నేత్రం (వచనకవిత్వం), ఆవాహన (వివేకానంద ప్రేరణగీతిక), మెతుకుసీమ కవనసీమ (సంపాదకత్వం), జరబోలోశంకర (వ్యంగ్యఖండికలు), బంగరుతెలగాణ (శతకం), భారత్ మాతాకీ జై (సంపాదకత్వం), తెలగాణవీరుడా (శతకం), ప్రణయమధురిమ (రుబాయిలు), మానవభారతం (వచన కావ్యం), వాగ్దేవతాశతకం, సైనికార్చన (సంపాదకత్వం), కవితరంగిణి (గేయకావ్యం), సంగారెడ్డి జిల్లా సాహిత్య చరిత్ర ( సాహిత్య అకాడమీ ప్రచురణ), అమృతమూర్తులు (దేశభక్తి కావ్యం), నువ్వు నేను (శివతత్వాలు), పచ్చధనం (సంపాదకత్వం), అవధానతెలంగాణ (వ్యాసావళి), మేలుకోర ఓ మనిషీ (పర్యావరణ గేయకావ్యం), శ్రీరామాయణ భానువు (పద్యకావ్యం), ట్రెండింగ్ పద్యాలు (బాలసాహిత్యం). ఈ రచనలన్నీ సామాజిక చైతన్యాన్ని రగిలించేవే. భానుప్రకాశ్ వెలువరించిన పద్యప్రభంజనం సంకలనం 611 మంది కవులు రచించిన 2375 పద్యాలతో అలరారుతోంది. ఆధునిక కాలంలో వచ్చిన పద్య బృహత్సంకలనమిదే!!

**బాలల కోసం కదిలిన భాను కలం**

భానుకలం సమాజానికి ఎంత దిశానిర్దేశం చేసిందో అంతే స్థాయిలో పిల్లల కోసం తపించింది. పిల్లలకోసం బాలగేయాలు, పద్యాలు రచించాడు. రచించడమే కాదు ఆ గేయాలను పిల్లలతో కలసి పాడుతూ ఆడుతూ చిత్రీకరించి యూట్యూబులో ఉంచాడు కూడా! బాలల జీవితాలను బంగారు మయం చేయడానికి, వారిలో జీవన మూల్యాలు పెంపొందించడానికి ఆయన కలం ఎప్పుడూ ముందుంటుంది.

ఇటీవలే భాను మరో రచన ట్రెండింగ్ పద్యాలు 'బాలా' మకుటంతో కొనసాగాయి. 132 పద్యాలు పిల్లలందరికీ నోటికి వచ్చేటట్లుగా ఆదిప్రాసలతో అందంగా అల్లాడు. అనేక ఆధునిక అంశాలను అత్యాధునిక శైలిలో అభివర్ణించాడు. అదీ తేలికైన చిన్న చిన్న పదాలతో గొప్ప భావాన్ని ఆవిష్కరించాడు. తెలుగు, ఇంగ్లీషు పదాలు కలిపి పద్యాలుగా మలచి ఆంగ్ల తెలుగు పద్యాలను సృజించాడు. ఇదొక కవిత్వశిల్పం. పిల్లలకోసం పిల్లల వస్తువుతో పిల్లల్లో మంచి మార్పును ఆశించి భాను చేసిన చక్కని ప్రయోగమిది. తెలుగు సాహితీక్షేత్రంలో భానువై ప్రకాశిస్తున్న అవుసుల భానుప్రకాశ్ ఆధునిక తెలుగుసాహిత్యానికి లభించిన వరం.

### వరించిన పురస్కారాలెన్నో..

తెలుగు సాహిత్యంలో అవధానంలో విశేష సేవలందిస్తున్న భానుప్రకాశ్ ను అనేక పురస్కారాలు వరించాయి. ఉపాధ్యాయుడుగా, వ్యాఖ్యాతగానూ ఎన్నో అవార్డులు పొందారు.

- జిల్లా ఉత్తమ సాహితీవేత్త పురస్కారం , ఉత్తమ యువకవి పురస్కారం
- జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్ధిపేట వారి పురస్కారం
- శ్రీభాష్యం విజయసారథి గారి యజ్ఞవరాహ క్షేత్ర 'ధర్మనిధి' పురస్కారం
- గాంధీ ప్రతిష్ఠాన్ & గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వారిచే స్వర్ణకంకణ సత్కారం
- తెలుగు రక్షణ వేదిక వారి సాహిత్య పురస్కారం
- గురజాడ ఫౌండేషన్, అమెరికా వారి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి సాహిత్య పురస్కారాలు
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం
- ప్రజాకవి రావికంటి రామయ్య గుప్త స్మారక పద్యకవితా పురస్కారం
- అందె వెంకటరాజం స్మారక అవధాన పురస్కారం
- కవిసింహ పోకూరి కాశీపతి అవధాని పురస్కారం
- 'స్వర్ణభారతి కళానిలయం' వారి రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారం
- సంగారెడ్డి జిల్లా సాహితీ పురస్కారం
- ప్రపంచ తెలుగు మహాసభల్లో పద్య కవిత్వ సదస్సు నిర్వహణా సత్కారం
- రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ వారి కాళోజీ జయంతి పురస్కారం
- ట్యూటర్స్ ప్రైడ్ వారి ఐటాప్ స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు
- లయన్స్ క్లబ్ వారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం
- విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వారి లెజండరీ పురస్కారం
- జాతీయ సాహిత్య పరిషత్తు, తెలంగాణ వారి రాష్ట్రస్థాయి యువసాహితీ పురస్కారం
- రాష్ట్ర ప్రభుత్వ పద్య తెలంగాణ కవిత్వ పురస్కారం
- ప్రభుత్వ, వివిధ సంస్థల కార్యక్రమాల (2000 కు పైగా) నిర్వహణకు వ్యాఖ్యాన సత్కారం
- పలు వ్యక్తిత్వ వికాస సదస్సులలో మోటివేషనల్ స్పీకర్ గా అనేక పర్యాయాలు సత్కారం

### పొందిన బిరుదులు

'సహస్ర పద్య కంఠీరవ , తెలుగు బంధు, సాహితీ కళాప్రవీణ, పద్యశిల్పి.

**(నేడు కరీంనగర్‌లో సమైక్య సాహితీ ఆధ్వర్యంలో అవుసుల భానుప్రకాశ్‌కు కల్వకుంట్ల రఘునాథాచార్య స్మారక పురస్కార ప్రదానం సందర్భంగా)**



-రావికంటి శ్రీనివాస్
అసోసియేట్ ఎడిటర్
విశ్వంభర దినపత్రిక, హైదరాబాద్
సెల్: 99088 92067

# మరపురాని మధుర గాయని లతా మంగేష్కర్

## భారతీయ సంగీతానికి దేవుడిచ్చిన వరం



లతా మంగేష్కర్, 'నైటింగేల్ ఆఫ్ ఇండియా' అని కూడా పిలుస్తారు, భారతీయ చలనచిత్ర పరిశ్రమలోని బహుముఖ గాయకులలో ఒకరు. లత సెప్టెంబర్ 28, 1929న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో శాస్త్రీయ గాయకుడు, థియేటర్ ఆర్టిస్ట్ పండిట్ దీనానాథ్ మంగేష్కర్ , శేవంతి దంపతులకు జన్మించారు. ఆమె తండ్రి చిన్నతనంలోనే సంగీతం నేర్పించడం ప్రారంభించాడు. అయిదవ ఏటనే తండ్రివద్ద సంగీత శిక్షణ ప్రారంభించిన లత సంగీతమే మరోలోకంగా జీవించారు.ఐదేళ్ల వయసు వచ్చేసరికి లత తన తండ్రి రాసిన నాటకాల్లో నటిగా పాల్గొంటూ కనిపించింది. ఆమె తోబుట్టువులు మీనా, ఆశా, ఉష మరియు హృదయనాథ్ అందరూ నిష్ణాతులైన గాయకులు, సంగీత విద్వాంసులు.

చిన్న తనంలోనే తండ్రి మరణించడంతో పదమూడేళ్ళ వయసుకే కుటుంబ పోషణ బాధ్యత లతపై పడింది. దీంతో సినీరంగంలోకి ప్రవేశించి 1942లో మరాఠీ చిత్రం పహ్లీ మంగళ గౌర్లో కథానాయిక చెల్లెలుగా నటించి రెండు పాటలు పాడారు. ఆ తరువాత పలు చిత్రల్లో నటించారు కూడా. 1947లో మజ్ బూర్ చిత్రంతో గాయనిగా లత ప్రస్థానంమొదలైంది. మహల్‌తో స్టార్‌డమ్ సంపాదించుకున్నారు. అతి తక్కువకాలంలోనే తన ప్రతిభతో ఉన్న శిఖరాల్ని అధిరోహించారు. పలు భాషల్లో పాటలు పాడిన ఆమె జనం గుండెల్లో లెజెండరీ సింగర్‌గా చెరగని ముద్ర వేసుకున్నారు. తొలిసారిగా 1955లో రామ్ రామ్ పవ్హనే అనే మరాఠా సినిమాకు సంగీత సారథ్యం వహించారు లతా. సాధి మనసే సినిమాకు గాను ఆమె ఉత్తమ సంగీత దర్శకురాలిగా మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వ అవార్డును గెలుచుకున్నారు. ఈ సినిమాలోని ఐరనించియా దేవ తులా పాటకు ఉత్తమ గాయినిగా కూడ అవార్డు అందుకున్నారు లతా. 1948-1978 వరకు 30వేల పాటలు పాడిన ఏకైక గాయనిగా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో పేరు సంపాదించుకున్నారు. నైటింగేల్ ఆఫ్ ఇండియాగా పేరు దక్కించుకున్న లతా మంగేష్కర్ పద్మ భూషణ్ , పద్మ విభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో పాటు పలు జాతీయ అవార్డులు ఆమెను వరించాయి. భారతీయ సినీ రంగానికి చేసినవిశిష్ట సేవలకు భారత అత్యున్నత పురస్కారమైన భారత రత్న అవార్డుతో సత్కరించింది. ఎంఎస్ సుబ్బులక్ష్మి తరువాత భారత ప్రభుత్వం నుండి ఎక్కువ అత్యుత్తమ పురస్కారాలు అందుకున్న అరుదైన గాయకురాలిగా కీర్తి గడించారు.తెలుగులో 1955 లో ఏఎన్నార్ 'సంతానం' కోసం నిదుర పోరా తమ్ముడా.. 1965 లో ఎన్టీఆర్ దొరికితే దొంగలు సినిమాలో శ్రీ వేంకటేశ పాట. 1988 లో నాగార్జున ఆఖరి పోరాటం సినిమాలో తెల్ల చీరకు పాట పాడారు.దాదాపు ఎనిమిది దశాబ్దాల కెరీర్‌లో, లతా మంగేష్కర్ బాలీవుడ్ ప్రముఖ మహిళల బృందానికి గాత్రదానం చేసింది. ఆమె వెయ్యికి పైగా హిందీ మరియు 36 ప్రాంతీయ చిత్రాలలో 5,000 పాటలకు తన గాత్రాన్ని అందించింది. భారతీయ చలనచిత్ర సంగీతంపై ఆమె అపూర్వమైన ప్రభావం చూపింది. 1942 నుండి, లత తన మనస్సును కదిలించే నైపుణ్యాలతో సంగీతం యొక్క సరిహద్దులను వెనక్కి నెట్టింది. కొన్ని సంవత్సరాలుగా, లత మధుబాల నుండి ప్రియాంక చోప్రా వరకు నటీమణుల కోసం పాడింది. ఆమె బహుముఖ స్వర నాణ్యతకు ప్రసిద్ధి చెందింది, ఆమె అన్ని రకాల ఆల్బమ్‌లను రికార్డ్ చేసింది (గజల్‌లు, పాప్, మొదలైనవి).లతా మంగేష్కర్ ఫిబ్రవరి 6, 2022న మరణించారు.ఈమెను భారతీయ సంగీతానికి దేవుడిచ్చిన వరంగా భావించవచ్చు.



- మిట్టపెల్లి రాజేశ్
సబ్ ఎడిటర్ (విశ్వంభర తెలుగు దినపత్రిక)
సెల్: 9441672957

# హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి డ్రామాలాడుతున్నాడు

## పేదలతో పెట్టుకుంటే కాలగర్భంలో కలిసిపోతావ్

## సీఎంపై ఎంపీ ఈటెల రాజేందర్ ఫైర్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** హైడ్రా పెడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రామాలాడతున్నాడని, ఇంతే డ్రామాలు కొనసాగిస్తే లక్షల మందితో రేవంత్ రెడ్డిని చుట్టుముడుతామని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ హెచ్చరించారు. మూసి పరివాహక ప్రాంతమైన ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేట డివిజన్,చైతన్యపురి డివిజన్ చెందిన సత్య నగర్, మారుతి నగర్,ఫణిగిరి కాలనీ మూసి పరివాహక ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకొని వారికి మద్దతుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ కు తమగోడును వెలబోసుకున్న కాలనీ ప్రజలు వెల్లబోసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలతో పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని అన్నారు. పేదల కడుపు కొట్టే దుర్మార్గమైన చర్యలకు ఈ ప్రభుత్వం దిగిందని మండిపడ్డారు. దొంగల్లా వచ్చి శనివారం,ఆదివారం ఇండ్లను కూల కొడతామంటే చూస్తూ ఊరుకోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అధికారులు ప్రజల కన్నీళ్లను, వేదనను,గోసను పట్టించుకోకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్న అధికారులు జైలుకు వెళ్లుతారని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు భిక్ష పెడితే ముఖ్య మంత్రి పదవి వచ్చిందని ఆ విషయాన్ని రేవంత్ రెడ్డి మర్చిపోవదని సూచించారు. అధికారులు వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. హెల్త్ డిపార్ట్మెంట్,సర్పంచులకు, జిహెచ్ఎంసి ఆఫీసులో పని చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణలో అనేక సమస్యలను డైవర్ట్ చేసి రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ లో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని వ్యాఖ్యానించారు. ధర్నాకు మద్దతుగా నిర్మల్ బిజెపి ఎమ్మెల్యే ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడుతూమూసి ఒడ్డున ఎఫ్ టి ఎల్ అని తెలియక చాలా మంది నిరుపేదలు ఇక్కడ కొనుకున్నారని,ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అధికారులు కూల్చడానికి వస్తున్నారని అని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి బీద ప్రజల సాధక బాధకాలు తెలుసు కోకుండా అమెరికా పర్యటనలు చేస్తూ టైం పాస్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్లో బడా బాబులకు నోటీసులు ఇచ్చారని వారు కోర్టుకు వెళ్లిస్తేలు తెచ్చుకుంటున్నారని, మరి ఈ పేదవారికి నోటీసులు ఎందుకు ఇవ్వడం లేదని విమర్శించారు.మరియు మీ తమ్ముని ఇంటిని ఎందుకు కూల్చలేదని అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కాళేశ్వరం పేరుమీద దోచుకుంటే, మీరేమో మూసి ప్రక్షాళన పేరు మీద దోచుకుంటున్నారని అని అన్నారు. ఉద్యోగులకు జీతాలకు , ఆరు హామీలు అమలు పర్చడానికి డబ్బులు లేవు కానీ, మూసి ప్రక్షాళనకు డబ్బులు ఎక్కడివి అని ప్రశ్నించారు. పాత బస్తి నాయకులు కబ్జా చేసి కట్టిన వాటిని ఎందుకు కూల్చడం లేదని, గతంలో బి ఆర్ ఎస్ పార్టీ దోపిడీ చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అదే చేస్తున్నాదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆపకపోతే బిజెపి ఎమ్మెల్యేలు ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలియజేశారు. ధర్నాలో ఎల్బీనగర్ బిజెపి ఇన్చార్జి సామ రంగారెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు ప్రేమేందర్ రెడ్డి, చైతన్యపురి కార్పొరేటర్ రంగా నరసింహ గుప్తా, కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్, ఆర్కే పురం కార్పొరేటర్ రాధా ధీరేజ్ రెడ్డి, గడ్డి అన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, జీవన్ రెడ్డి పెద్ద ఎత్తున బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

## జల్‌పల్లి పెద్ద చెరువును సందర్శించిన ఎమ్మెల్యే సబిత

**విశ్వంభర, మహేశ్వరం:** జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు ను హెచ్ఎండిఏ అధికారులు, మున్సిపల్ అధికారులుతో కలిసి సందర్శించిన మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి . సబితా ఇంద్రారెడ్డి పెద్ద చెరువు నలుమూలల సందర్శించి సుందరీకరణ, పీ 7 రోడ్డు నీరు ఎలా మళ్ళించాలి, వ్యూస్ కు సంబంధించి హెచ్ఎండిఏ మున్సిపల్ అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగినది. ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ, గతంలో మంజూరైన తొమ్మిది కోట్ల 70 లక్షల రూపాయల హెచ్ఎండి ఎ నిధులను రిఎస్టిమెంట్ ఏసి పంపించి సుందరీకరణ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు . అదేవిధముగా జల్ పల్లి మున్సిపాలిటీలో డ్రైనేజీ, రోడ్డు సమస్యలు అనేకం ఉన్నాయని, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామని తెలిపారు, గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో మంజూరైన 25 కోట్ల ఎస్ జి ఎఫ్ ఫండ్ ను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయటం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిన ఎస్ జి ఎఫ్ నిధులను హెచ్ ఎం డి ఎ నిధులను విడుదల చేస్తే 75% పనులు పూర్తవుతాయని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్స్ సభ్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ కమిషనర్, అధికారులు, హెచ్ఎండిఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## డీజీపీ చేతులమీదుగా అవార్డు అందుకున్న ఎస్ఐ దీపిక



**విశ్వంభర, మహబూబాబాద్:** ఏదైనా సమస్యలతో పోలీస్ స్టేషన్ లకు వచ్చిన బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యలను విని చట్టపరిధిలో పరిష్కారించడం, వారికి పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని నమ్మకం కలిగేలా చేయడం వలన ప్రజల ఆన్లైన్ ఫీడ్ బ్యాక్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సత్వర సేవలు అందించడంలో ముందున్న 10 పోలీస్ స్టేషన్ లను ఎంపిక చేయగా మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ తొమ్మిదవ స్థానం స్థానం పొందింది. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ రెడ్డి చేతులమీదుగా రూరల్ ఎస్.ఐ దీపిక అవార్డు అందుకున్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు సిబ్బందిని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందనలుతెలిపారు.

## పిల్లలపై మొబైల్స్ ప్రభావం



**విశ్వంభర, షాద్ నగర్:** మొబైల్స్ వద్దు కుంపు ముద్దు అని న్యూ పవర్ కుంగ్ ఫూ అకాడమీ కోచ్ బాలరాజ్ మాస్టర్, మాస్టర్ అహ్మద్ ఖాన్ (బ్రూస్ లీ) పిలుపునిచ్చారు. షాద్ నగర్ లో న్యూ పవర్ కుంగ్ ఫూ ఆకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే, కుంగ్ ఫూ నేర్పించడం జరుగుతుంది అన్ని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మొబైల్ లేనిదే జీవితం లేదనేలా తయారయ్యారన్నారు. ముఖ్యంగా పిల్లలపై మొబైల్ ప్రభావితం ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. చిన్నప్పటినుంచి మొబైల్ అలవాటుకు గురి కావడం వల్ల పిల్లలలో మానసిక ఒత్తిడి పెరిగి చదువులలో వెనుకబడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ అలవాట్లను మాన్పించేలా విద్యార్థులకు వాళ్ల తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని వారి శరీరం మానసికంగా దృఢంగా తయారు చేయాలనే సంకల్పం ఉండాలని అన్నారు. నేటి సమాజం లో నిత్యం చిన్నపిల్లలపై ఆడవారిపై జరిగే ఆకృత్యాలు సాహసంతో ఎదుర్కొనేలా ఇప్పటి నుంచే కరాటే కుంగ్ ఫూ పోటీలలో తార్ఫీదు ఇప్పించాలని కోరారు.

## మంత్రాల నెపంతో వ్యక్తి హత్య



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం గ్రామంలో మంత్రాల నేపంతో వ్యక్తి హత్య గావించబడ్డాడు. చిన్న ముప్పారం గ్రామానికి చెందిన మల్లం యాకయ్య అనే వ్యక్తిని మంత్రాలు చేశాడనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన వ్యక్తి కొట్టి చంపాడు. నాకు మంత్రాలు చేశాడు కాబట్టి చంపాను గ్రామస్తులకు చెప్పడంతో గ్రామస్తులందరు కలిసి చంపిన వ్యక్తిని తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పజెప్పారు.

## బావి సంపులో పడి యువకుడు మృతి



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వీరన్నపల్లి గ్రామానికి చెందిన బెక్కరి గోవర్ధన్ రెడ్డి కుమారుడు సుప్రీత్ రెడ్డి బావి సంపులో పడి మరణించాడు. విషయం తెలిసుకున్న బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్ మృతుడు సుప్రీత్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు నాగమణి లింగం గౌడ్, జయమ్మ వెంకటయ్య, రఘుపతి రెడ్డి, మండల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీపీయూఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరం పేట మండల తపస్ (టీ.పీ.యూ.ఎస్) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం చల్లా లక్ష్మన్‌లు శుక్రవారం తెలిపారు. పెద్ద శంకరంపేట మండలం తపస్ అధ్యక్షులుగా గుజ్జరి రవి (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్ద శంకరంపేట్), ప్రధాన కార్యదర్శిగా కాన్సిరాం జాదవ్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్ద శంకరంపేట్) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. పెద్ద శంకరంపేట మండలంలో తపస్ సంఘం అభివృద్ధి కోసం తమ వంతు నిరంతరం కృషి చేస్తామని, తమను ఎంపిక చేసినందుకు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు, మండల అధ్యక్ష కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు.

## స్వచ్ఛతా హి సేవ వైద్య శిబిరం ప్రారంభం




**విశ్వంభర, కొత్తూరు:** కొత్తూరు మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఫాయి కార్మికుల కోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును కార్మికులు వినియోగించుకోవాలని కోరారు. వ్యాధులు పట్ల ప్రజలు అవగాహన కలిగి వుండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, డాక్టర్ హరికృష్ణ, ఆశ వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి




**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలోఈనెల 28న జిల్లా కేంద్రంలో నిర్వహించే లోక్ అదాలత్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహాదేవపూర్ మండల పారా లీగల్ వాలంటర్ (పీ.ఎల్.వీ) చీర్లవంచ రజని తెలిపారు. మండల పరిధిలోని సూరారంతో పాటు పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కోర్టులో రాజీ పడదలచిన సివిల్, క్రిమినల్, భార్యాభర్తల కేసులు, యాక్సిడెంట్, ఎక్సైజ్ కేసులు లోక్ – అదాలత్ ద్వారా కాలయాపన జరగకుండా సత్వర న్యాయం అందించడం జరుగుతుందని వివరించారు. ప్రజలు ద్వేష భావాలను తగ్గించుకొని కేసుల్లో రాజీమార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. కేసుల ద్వారా మీ విలువైన సమయాన్నిడబ్బును వృధా చేయకుండా లోక్ అదాలత్ ద్వారా పరిస్కారం చేసుకుని వృద్ధిలోకి రావాలనితెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి అంజలి రెడ్డి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

**విశ్వంభర, చివ్వెంల:** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మాజీ ఎమ్మెల్యే, లయన్స్ క్లబ్ చైర్మన్ దోసపాటి గోపాల్, చివ్వెంల సింగిల్ విండో చైర్మన్ మారినేని సుధీర్ రావు అన్నారు. మండలంలోని బండమీది చందుపట్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ మాజీ చైర్మన్ నూకల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు, ఇతర సామాగ్రి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్న వయసు లోనే విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. భవిష్యత్తులో పిల్లలు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా ప్రభుత్వ ఉద్యోగులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వెంకట్ రెడ్డి గత పదేళ్లుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు బహుకరించడం అభినందనీయమని ఆయనను కొనియాడారు. ప్రభుత్వ పాఠశాల లోనే నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులకు సహాయం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సహాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. లయన్స్ క్లబ్ ద్వారా వందల మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు ఆపరేషన్లు చేస్తున్నామని వెల్లడించారు. నూతనంగా ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన కళారాణిని పాఠశాల ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, రీజినల్ చైర్మన్ గుడిపూడి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, నవీన్, రవీందర్ రెడ్డి, శబరినాథ్, వంశీ, గుద్దేటి వెంకన్న, చిన్న వెంకన్న, చెరుకు నగేష్, రమేష్, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ప్రిన్సిపాల్ ప్రభు దాస్



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఫుడ్ కాంట్రాక్ట్ కు సంబంధించి రూ .29000 లంచం తీసుకుంటూ కొత్తపేటలోని విఎం హోం పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభుదాస్ ఏసీబీ అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే స్కూల్‌కు ఫుడ్ కాంట్రాక్టు బిల్లు కు సంబందించి వాస్తవ బిల్లులు కన్న అధిక బిల్లులు సృష్టించి, అధిక మొత్తం బిల్లులకు సంబందించిన డబ్బులు 29,000/- వేలు కాంట్రాక్టర్ వద్ద నుండి తిరిగి తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. గత కొన్ని నెలలుగా ఫుడ్ కాంట్రాక్టు విషయంలో అవకతవకల పై పలు ఫిర్యాదులు రావడం తో వి ఏం హోమ్ స్కూల్ పై నిఘా ఏర్పాటు చేసిన ఏసీబీ అధికారులు శుక్రవారం ప్రభుదాసుని పట్టుకున్నారు. ప్రభుదాస్ ను అదుపులోకి తీసుకుని సంబంధించిన వివరాల పై ప్రశ్నిస్తున్నారు.

## పోలీస్ డ్యూట్ మీట్ పోటీలు



0**విశ్వంభర, సిద్దిపేట:** సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీసులకు డ్యూట్ మీట్ పోటీలను నిర్వహించారు. చట్టాల అమలు, అంతర్గత నేరాలు, శాస్త్రీయంగా కేసుల పరిశోధన, కంప్యూటర్ల నమోదు తదితర వాటిపై పోలీసులకు పోటీలను జరిపించారు. పోటీలలో ప్రతిభ చూపిన పోలీసులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని డిసిపి మల్లారెడ్డి తెలిపారు.

## రైతు రుణమాఫీని వెంటనే అమలు చేయాలి




**విశ్వంభర, నార్కెట్ పల్లి:** రెండు లక్షల పైన రైతు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని రైతులతో ధర్నా నిర్వహించిన నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేది కొండంత చేసేది గోరంత అని ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్, రైతుల పట్ల ప్రభుత్వంకు చిత్త శుద్ధి ఉంటె తక్షణమే రెండు లక్ష ల రుణ మాఫీ అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంధాలయ చైర్మన్ రేగట్టే మల్లికార్జున రెడ్డి, మాజీ ఎంపీటీసీ దుబ్బాక శ్రీధర్, బి ఆర్ ఎస్ టౌన్ అధ్యక్షులు దోసపాటి విష్ణు మూర్తి , మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కసి రెడ్డి సుధాకర్ రెడ్డి, నార్కట్పల్లి మండల బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బరిగల హేమలత



**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీల్లో గత నాలుగు సంవత్సరాలుగా భారతీయ జనతా పార్టీ న్యాయపోరాటం చేస్తూ వచ్చింది. చివరికి కోర్టు ఆర్డర్ ద్వారా భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బరిగల హేమలత రాజు గౌడ్ ని మున్సిపల్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ధర్మాసనం ఆదేశించడం జరిగింది. కోర్టు తీర్పుతో ఇవాళ తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ గా బరిగల హేమలత రాజు గౌడ్ ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బరిగల హేమలత రాజు గౌడ్ ని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు శివకుమార్ గౌడ్, రాజమోని రాజు ముదిరాజ్, జాపాల భావన సుధాకర్, బోధ యాదగిరిరెడ్డి, రాగన్నమోని మౌనిక మహేందర్, తూర్పు అనిత జయరాజ్, కొప్పుల పద్మ శివయ్య గౌడ్, బాకీ విలాస్, సహకార బ్యాంక్ డైరెక్టర్ చింతల స్వరూప రఘుమారెడ్డి, బిజెపి, బీజేవైఎం నాయకులు, పార్టీ అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశానికి పట్టుకొమ్మలు ఉపాధ్యాయులు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ మండలం జంగిలిగొండ ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుత్తోమాల మురళీధర్ స్వామి పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం మహబూబాబాద్ పట్టణం బాలాజీ గార్డెన్స్ లో నిర్వహించిన పదవీ విరమణ అభినందన సన్మాన మహోత్సవ సభకు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు హాజరై మురళీధర్ స్వామి దంపతులను సన్మానించి అభినందించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పీ.ఆర్.టీ.యూ జిల్లా అధ్యక్షులు సంకా బద్రినారాయణ, 18వ వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, డౌలాగర్ శంకర్, ఉపాధ్యాయులు, పీ.ఆర్.టీ.యూ టీఎస్ భాధ్యులు పాల్గొన్నారు.


ఆత్మకూరు సరస్వతీ విద్యా మందిర్‌లో


కడ్తాల్‌లో


పటాన్‌చెరులో


ఆత్మకూరులో


రామన్నపేటలో


నాగారంలో..



# ఉద్యమాల కొండ... లక్ష్మణ్ బాపూజీ

## కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**విశ్వంభర,మహేశ్వరం:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పదవులను సైతం లెక్కచేయని త్యాగాధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఒక్కడేనని చేవెళ్ల ఎంపీ, బీజేపీ పార్లమెంట్ విప్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమ మార్గదర్శి, బడుగు బలహీన వర్గాల చైతన్యానికి, ఆత్మ గౌరవానికి ప్రతీక ఉద్యమాల కొండ బాపూజీ అని కొనియాడారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని గాయత్రీ నగర్ జిల్లెలగూడ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం వారు ఏర్పాటు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు శ్రీరాములు మాట్లాడుతూ మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలన్ శంకర్ రెడ్డి . మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి. జిల్లా ఉపాధ్యక్షులు మద్ది రాజశేఖర్ రెడ్డి. స్థానిక కార్పొరేటర్లు గోవర్ధన్ రెడ్డి. కరుణానిధి .శ్రవణ్ కుమార్. ఇంద్రావతి రవి నాయక్, అనిత ప్రభాకర్ రెడ్డి. గౌరీ శంకర్. ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, సోమేశ్వర్, తిరుపతి రెడ్డి. రవి నాయక్. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు చింతల రాఘవేందర్ ముదిరాజ్. రవీందర్ రెడ్డి. గడ్డం జగన్. విక్కీ సాగర్. కాశీరాం యాదవ్. జగన్ ముదిరాజ్. నిఖిల్ సింగ్. పద్మశాలి కుటుంబ సభ్యులు బిజెపి బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

### ప్రజా పోరాట యోధుడు మన కొండా లక్ష్మణ్ బాపూజీ

విశ్వంభర, హైదరాబాద్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. ప్రజా పోరాట యోధుడు మన కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. 1969లో ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమంలో తన మంత్రి పదవికి రాజీనామా చేసి ఎందరో తెలంగాణ ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి మొదలుకొని మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు.. ప్రజా ఉద్యమాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ నిర్వహించిన పాత్ర అనిర్వచనీయమన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధనకు సాగిన సుదీర్ఘ ఉద్యమానికి కొండా లక్ష్మణ్ బాపూజీ ఎన్నో సేవలు అందించారని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ సారథ్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఆయన నివాసంలోనే పురుడు పోసుకుందన్నారు. రాష్ట్ర సాధన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఆ మహనీయుడిని సమున్నతంగా గౌరవించిందని చెప్పారు. ట్యాంక్ బండ్ వద్ద వారి విగ్రహం ఏర్పాటు చేసింది, వారి పేరు హార్టికల్చరల్ యూనివర్సిటీకి పెట్టిందని గుర్తుచేశారు. తెలంగాణ పోరాటంలో, తొమ్మిదిన్నరేండ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో కొండా లక్ష్మణ్ బాపూజీ అందించిన స్ఫూర్తి ఇమిడివుందన్నారు.




యాదాద్రిలో..


బోడుప్పల్‌లో


పెద్దశంకరంపేటలో

# బాపూజీ ఆశయాల బాటలోనే ప్రభుత్వం

## బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాష్

**విశ్వంభర, హైదరాబాద్, ఆత్మకూరు(ఎం):** కొండా లక్ష్మణ ఆశయ సాధన దిశగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని బీసీ కమిషన్ మెంబర్ రాపోలు జయప్రకాష్ తెలిపారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా ఆయన బాపూజీ విగ్రహా-నికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, అట్టడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కి మార్గదర్శకాలు రూపకల్పన చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ అన్నారు. ఆయన ఆశయాల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారన్నారు. కులగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహి-స్తామని ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తోం-దన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కా-ర్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు పడిగెల ప్రదీప్, దేవా గౌడ్, కసుబ శ్రీనివాసరావు, ఆంజనేయ స్వామి, కృష్ణారెడ్డి, హరిరాజు, రావుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

**పల్లెర్లలో**

**ఆత్మకూరు:** ఆత్మకూరు(ఎం)మండల పరిధిలోని పల్లెర్ల గ్రామ చేనేత సహకార సంఘ భవనంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం అధ్యక్షులు ఏలూరి సుదర్శన్ మాట్లాడుతూ క్విట్ ఇండియా పోరాటంలో ముందు నిలిచి పోరాడిన సమర యోధుడు, ప్రత్యేక రాష్ట్రం కోసం తన నివాసాన్ని కూడా ఉద్యమం కోసం త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం ఉపాధ్యక్షులు సాయిని అశోక్ , చేనేత సంఘం డైరెక్టర్లు గుర్రం వాసుదేవ్ , గుర్రం మల్లేష్ , చేనేత నాయకులు గుర్రం నారాయణ , ఏలే విశ్వనాథం , పొడుగు వెంకటేష్ , సాయిని పురుషోత్తం , రాపోలు వెంకటేష్ , ఏలూరి వెంకటేష్ , గుర్రం భిక్షపతి , సాయిని వెంకటేష్ , పొడుగు సత్యనారాయణ , ఏలూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

**సరస్వతీ విద్యాలయంలో**

ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని సరస్వతీ విద్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. వారి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరిస్తూ పేద విద్యార్థిని నూతన వస్త్రాలు బహూకరించారు. పాఠశాల కరస్పాండెంట్ తొర్ర విష్ణు, ప్రిన్సిపల్ పంజాల నర్సయ్య, వైస్ ప్రిన్సిపల్ ఐలయ్య, సుధాకర్, విష్ణు,యాసిన్, లలిత,సంతోష, మహేశ్వరి, సంధ్య, మాధవి, ఆదర్శ, శైలజ, కృష్ణవేణి, మాధవి, గంగా, లక్ష్మి, మమత ,అప్రజితలు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలోని కలెక్టరేట్లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు సమగ్ర కుల గణన చేపట్టి ఆ దిశలో ముందడుగు వేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. వారి ఆశయాలను, ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం గౌరవ అధ్యక్షులు గొట్టిపాముల, బాబురావు, బట్టు రామ చంద్రయ్య, కడారి వెంకటేష్, రత్నపురం పద్మ, మెరుగు మధు, తదితర బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**పెద్దశంకరంపేటలో..**

**పెద్దశంకరం పేట:** పెద్ద శంకరంపేటలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పాల్గొన్నారు. అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు నారాయణఖేడ్ వెంకటపూర్ చౌరస్తా లోగల మార్కండేయ భవన్ (పద్మశాలి భవనం) లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు . రానున్న రోజుల్లో చేనేత సహకార సంఘాలకు పూర్వ వైభవం తీసుకు వస్తామని, తద్వారా చేనేత కుల వృత్తులకు ఆర్థిక పరిపుష్టి చేకూరుతుందని అన్నారు. అనంతరం పద్మశాలి సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ దారం శంకర్ సెట్, హనుమండ్లు,రాజేష్,సయ్యద్, అభిషేక్ శెత్కర్,కాంగ్రెస్ నాయకులు, పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**పటాన్‌చెరులో**

**పటాన్‌చెరు:** కొండా లక్ష్మణ్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కొనియాడారు.పటాన్ చెరు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్నిప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి తరానికి కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రను తెలియజేయాలన్న లక్ష్యంతో పటాన్ చెరు బస్టాండ్ ఆవరణలో విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అతి త్వరలో విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, శీనయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అశోక్, వేముల రమేష్, రఘు రాముల, సునీల్, జగదీష్, శ్రీ రామ్, అశోక్, కృష్ణ, లక్ష్మణ్, కృష్ణ, సదానంద, ప్రసాద్, రాజు స్టీల్, సతీష్, నామ రాజు, తదితరులు పాల్గొన్నారు.

**కడ్తాల్‌లో..**

**కడ్తాల్:** కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. బాపూజీ ఆశయాలను నెరవేర్చడానికి యువకులు, మేధావులు ముందుకు రావాలని పలువురు నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్,మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మ రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ,రైతు డైరెక్టర్ నరసింహ, మాజీ వార్డు సభ్యులు నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


**బోడుప్పల్‌లో..**

**మేడ్చల్ జిల్లా:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు. మున్సిపల్ కార్యాలయంలో కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు డిప్యూటీ మేయర్,కమిషనర్, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, మరియు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**నాగారంలో**

**మహేశ్వరం :** మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి పురస్కరించుకొని, నాగారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు , ఈకార్యక్రమంలో బీసీ, ఎస్సీ. ఎస్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్నాటి నరేష్ నేత, పద్మశాలి సంఘం అధ్యక్షులు సంజీవ, నాయకులు, అశోక్, దాస శ్రీను, శ్రీశైలం, రాజు మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, హరినాథ్, శ్రీను, శ్రీహరి పాల్గొన్నారు


హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద


మెట్‌పల్లిలో



జగిత్యాలలో


రామన్నపేటలో


పెద్దశంకరంపేటలో

# కొండా... తెలంగాణ మది నిండా!

**ఊరూరా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు**

**ఘనంగా నివాళులు అర్పించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు**

**(విశ్వంభర యంత్రాంగం, తెలంగాణ)**

స్వాతంత్ర్య సమరయోధుడు, నిజాం నుంచి విముక్తి కోసం పోరాడిన వీరుడు, తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి 109వ వేడుకలు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు, అధికారులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటాలకు విగ్రహాలకు పూలమాలలు సమర్పించారు.

**హైదరాబాద్ గాంధీ భవన్‌లో..**

**హైదరాబాద్:** గాంధీ భవన్‌లో 'తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ 'మెట్టు సాయికు మార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ కోసం తపించిన బాపూజీ అడుగుజాడల్లో ప్రజా ప్రభు త్వం పనిచేస్తోందని, ఆయన సేవలు నిరంతరం గుర్తుండాలన్న లక్ష్యంతోనే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మెట్టు సాయికుమార్ తో పాటు కాంగ్రెస్ ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇంచార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్, ఫిషర్మెన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్‌లో..**

**మహబూబాబాద్:** తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు, బలహీన వర్గాల స్ఫూర్తిప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజి అని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. తెలంగాణ పోరాట యోధుడు కొం డా లక్ష్మణ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించుకోవడం అత్యంత గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యు అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, బిసి సంక్షేమ అధికారి నరసింహ స్వామి బిసి సంఘ నాయకులు, అధికారులు తదితరులు పాల్గోన్నారు.

**మీర్‌పేటలో విగ్రహావిష్కరణ**

**మహేశ్వరం:** మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపైన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వారి జీవిత చరిత్రను తెలియజేసే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ విగ్రహం జీవం ఉట్టిపడేలా ఉందన్నారు. శిల్పికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి, స్వశక్తితో ఎదిగిన మహోన్నత బీసీ వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. అలాగే సంఘం వారు అడిగిన విధంగా ఒక ఎకరం స్థలం కేటాయించేందుకు జిల్లా పరిధిలో ప్రభుత్వానికీ ప్రతిపాదనలు పంపుతానని, తన వంతుగా కమ్యూనిటీ హాల్


పటాన్‌చెరులో

ఏర్పాటుకు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట మునిసిపల్ కార్పోరే షన్ మేయర్ యం.దుర్గా దీపలాల్ చౌహాన్ ,డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి,ఫ్లోర్ లీడర్లు అర్కల భూపాల్ రెడ్డి కార్పొరేటర్లు,కో-ఆప్షన్ సభ్యులు,బి.ఆర్.యస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

**షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో**

**షాద్ నగర్:** మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేసిన మహోన్నత వ్యక్త కొండా లక్ష్మణ్ బాపూజీ అని షాదన్ నగర్ మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బహుభాషా కోవిదు డైన బాపూజీ జీవితాంతం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అలోనిపల్లి శ్రీనివాస్ గౌడ్, సేలంద్రం ఈశ్వర్ రాజు, రేటికల్ నందిశ్వర్, నాయకులు నడికూడ యాదగిరి యాదవ్, యాదగిరి (చిన్న),మున్సిపల్ సిబ్బంది మేనేజర్ నాయింషా, సీనియర్ అసిస్టెంట్లు జగదీశ్వర్ చారీ,రాంచందర్,రోహిత్,వార్డు ఆఫీసర్లు రమే ష్, చంద్రశేఖర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

**ఫరూక్ నగర్‌లో**

**ఫరూక్ నగర్:** మండల ప్రజా పరిషత్ ఫకార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఎం.జయంత్ రెడ్డి,సూపరింటెండెంట్, శ్రీనివాసరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎం.ప్రమోద్ కుమార్,జూనియర్ అసిస్టెంట్ కుమారి జెరూషా ,టైపిస్టు శ్రీమతి శైలజ,కంప్యూటర్ ఆపరేటర్లు మరియు ఆఫీస్ సబార్డినేట్స్ పాల్గొన్నారు.

**వికారాబాద్ జిల్లాలో**

**వికారాబాద్:** ప్రతి ఒక్కరు కొండాలక్ష్మణ్ బాపూజీని స్ఫూర్తిగా తీసుకోవాలని వికారాబా ద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. శుక్ర వారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షే మ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహిం చిన జయంతి కార్యక్రమంలో చిత్ర పటానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సమస్తలు) సుధీ ర్‌తో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడు తూ స్వాతంత్ర్య సమరయోధుడుగా, తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్య పాత్ర పోషించారని, వారి సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.బి సి సంక్షేమ అధికారి ఉపేందర్, డీపీఆర్ ఓ చెన్నమ్మ,కౌన్సిలర్ దత్తుతో పాటు వివిధ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కేసముద్రంలో**

**మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కేసముద్రం స్టేషన్ అంబేద్కర్ సెంటర్లో కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి కార్యక్రమం బీసీ జాక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బీసీ జాక్ చైర్మన్ కొలిపాక వెంకన్న మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనలో రానున్న బీసీ ఉద్యమంలో బీసీలు అంతా ఏకతాటిమీదికి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు సామల నరసయ్య , మామిడాల శ్రీనివాస్ , ఎం సి పి ఐ యు జిల్లా కార్యదర్శి కంచెం వెంకన్న ,పోకల శ్రీనివాస్ మేరు సంఘం నుంచి రాయబారపు సురేందర్, చామకూర నరసయ్య, మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద గోపి , గండి శ్రీనివాస్ ,సామల లక్ష్మీ నారాయణ , అంబటి నాగమల్లు, చారి గుబ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**ఆమనగల్లులో..**

**ఆమనగల్లు:** పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆమనగల్లులో మండల ప్రజా పరిషత్ ఆవరణలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి పఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో కుసుమ మాధురి, పద్మశాలి సంఘం నేతలు గాజుల శ్రీనివాస్, ఎంగలి బాలకృష్ణ మాట్లాడ ుతూ తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీకి భారత ప్రభుత్వం భారతరత్న అవా ర్డు ఇవ్వాలని, అలాగే తెలంగాణ పాఠ్య పుస్త కాలలో జాతిపిత జీవిత చరిత్ర చేర్చాలని కోరా రు. బడుగు బలహీన వర్గాల రాజాధికారం లోకి రావాలని ఆశించిన మొదటి వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత ఐక్యవేదిక రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, అవ్వారి శివలింగం, భీమనపల్లి దుర్గయ్య, గుర్రం కేశవులు, అప్పం శ్రీనివాస్, ఎంగలి ప్రసాద్, చిలివేరి వాసు, అరగొండ మధు, మామిడి శెట్టి రవి, వివిధ చేనేత కార్మికులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

**మిర్యాలగూడలో**

**మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ బ్రదర్స్ , డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ గార్లు కొండా లక్ష్మణ్ బాపూజీ గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ...తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం తన జీవితకాలం పోరాడిన తొలితరం నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. ఆయన తెలంగాణకు నిత్య స్ఫూర్తి అని, ఆయన పోరాట స్ఫూర్తి నేటి నేటి తరాలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ , స్కైలాబ్ నాయక్, దేశి రెడ్డి శేఖర్ రెడ్డి, పలువురు ఇతర కాంగ్రెస్ నాయకులు , బీఎల్ ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

**మెట్‌పల్లిలో నివాళులు అర్పించిన ?**

**ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**

**మెట్‌పల్లి:** మెట్ పల్లి పాల్తా బస్టాండ్ చౌరస్తా వద్ద గల కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పద్మశాలి కుల బాంధవులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ కోసం తొలి దశ మల్లీ దశ అహర్నిశలు కృషి చేస్తూ అలుపెరుగని పోరాటం చేసిన కొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ జాతిపిత గా అభివర్ణించారు కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి సత్యనారాయణ రావు కౌన్సిలర్లు పద్మశాలి సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**జగిత్యాల అర్బన్ మండలం,**

**జగిత్యాల:** కొండా లక్ష్మణ్ బాపూజీ 109 జయంతి సందర్భంగా జగిత్యాల అర్బన్ మండలం తిపన్నపేట గ్రామంలో లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ బాపూజీ అందించిన నిస్వార్థ సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో పోరాడి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. తిపన్నపేట గ్రామం స్పెషల్ ఆఫీసర్ రాజేందర్ రావు ,కార్యదర్శి కొమురయ్య, కారోబార్ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


హైదరాబాద్ గాంధీ భవన్‌లో


మహేశ్వరంలో

**రామన్నపేటలో...**

**రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు పోషబోయిన మల్లేశం, జడ సంతోష్, నాయకులు నీల దయాకర్, బందెల రాములు, కన్నెబోయిన బలరాం, సాల్వేర్ అశోక్, వేమవరం సుధీర్ బాబు, పున్న వెంకటేశం, దోమల సతీష్, గొరిగే నరసింహ, రచ్చ రమేష్, ఎండి అమీర్, కోనూరు ముత్తయ్య, మిర్యాల మల్లేశం, బొడ్డు అల్లయ్య, రామిని లక్ష్మణ్, కోనూరు శ్రీనివాస్, లవణం రాము, ఆవుల శ్రీధర్, ఎండి అజాజ్ ఖాన్, మారోజు అనంతచారి, బొడ్డుపల్లి రాజు, జాల అమరేందర్ రెడ్డి ఆంజనేయులు గౌడ్, నల్ల సైదులు, అంతటి మల్లయ్య, కుక్కు సాయి శేఖర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

**పేట తహసీల్దార్ కార్యాలయంలో**

తహసీల్దార్ కార్యాలయంలో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గ్రేసీ బాయ్ కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ శరణప్ప. మండల బిజెపి అధ్యక్షులు కోణం విఠల్. కార్యాలయ సిబ్బంది వీరమని విజయనిర్మల భవాని నాగరాణి దినేష్ శ్రీకాంత్. పాల్గొన్నారు.


మహబూబాబాద్‌లో


మహేశ్వరంలో..


షాద్‌నగర్‌లో


షాద్‌నగర్ మండలం ఫరూఖ్‌నగర్‌లో


కేసముద్రంలో


ఆమనగల్లులో


మిర్యాలగూడలో

# ఏజెన్సీలు తయారు చేసిన ప్రసాదాలు నైవేద్యంగా పెట్టడం నిషేధం

## ■ తిరుపతి లడ్డూ కల్తీ వివాదం వేళ.. అయోధ్య రామ మందిరం కీలక నిర్ణయం



**అయోధ్య:** భక్తులు మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ కల్తీ వివాదం వేళ అయోధ్య రామ మందిరం నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. బాల రాముడికి బయటి సంస్థలు తయారుచేసిన ప్రసాదా లను నైవేద్యంగా పెట్టడంపై నిషేధం విధించారు. ఆలయ పూజారుల సమక్షంలో తయారుచేసిన ప్రసాదాలనే బాలరాముడికి నైవేద్యంగా పెట్టాలని, భక్తులకు ప్రసాదంగా అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ తెలిపారు. మహా ప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ కల్తీ వివాదం దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు ఉపయోగించారన్న ఆరోపణలు పెద్ద దుమారం రేపుతున్నాయి. ఈ లడ్డూ కల్తీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.అదే సమయంలో ఆలయాల్లో పెట్టే ప్రసాదం స్వచ్ఛతపై భక్తుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అయోధ్య ఆలయ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా విక్రయిస్తున్న నెయ్యి స్వచ్ఛతపై రామ మందిరం ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ అనుమానం వ్యక్తం చేశారు. 'దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ ఆలయాలు, మఠాల్లో బయట ఏజెన్సీలు తయారు చేసిన ప్రసాదాలను పూర్తిగా నిషేధించాలి. దేవుళ్లకు ప్రసాదం ఆలయ అర్చకుల పర్యవేక్షణలోనే తయారు చేయాలి. అటువంటి ప్రసాదాన్ని మాత్రమే సమర్పించాలి' అని ఆయన అన్నారు.అదే సమయంలో తిరుపతి బాలాజీ లడ్డూ ప్రసాదంలో కొవ్వు, మాంసా హారం వినియోగిస్తున్నారనే ఆరోపణ లపై దేశవ్యాప్తంగా వివాదాలు తీవ్రమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా భక్తులు, సాధు సన్యాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మార్కెట్లో అమ్ముతున్న నూనె, నెయ్యిల నాణ్యత ప్రమాణా లను తనిఖీ చేయించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

# ఆయన ధైర్యవంతుడైన నిజాయితీ గల రాజకీయ నాయకుడు.. రాహుల్‌పై సైఫ్ అలీఖాన్ ప్రశంసలు




**దిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ ప్రశంసల వర్షం కురిపించారు. రాహుల్ ఎంతో ధైర్యవంతుడైన నిజాయితీ గల రాజకీయ నాయకుడని కొనియాడారు. ఓ జాతీయ మీడియా నిర్వహించిన చర్చా వేదికలో పాల్గొన్న సైఫ్ అలీఖాన్.. రాజకీయ నేతల గురించి చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.'ఎలాంటి నాయకుడిని ఇష్టపడతారు..?' అంటూ వ్యాఖ్యాత సైఫ్‌ను ప్రశ్నించగా.. ధైర్యంగా, నిజాయతీగా ఉండే రాజకీయ నాయకులంటే తనకు ఇష్టమని సమాధానమిచ్చారు. దీంతో ప్రధాని మోదీ, అరవింద్ కేజ్రీవాల్, రాహుల్ గాంధీ పేర్లను వ్యాఖ్యాత సూచించి వీరిలో ఎవరిని ఎంచుకుంటారు అని అడిగారు. దీనికి సైఫ్ అలీఖాన్ బదులిస్తూ.. ఈ ముగ్గురు నేతలూ ఎంతో ధైర్యవంతులైన రాజకీయ నాయకులే అని చెప్పారు.అయితే, వీరిలో రాహుల్ గాంధీ తీరు తనను ఎంతగానో ఆకట్టుకున్నట్లు చెప్పారు. గతంలో ఆయన చేసే పనులు, మాటలను కొందరు అగౌరవపరిచేవారని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల నుంచి ప్రజల్లో తన ఇమేజ్‌ను పెంచుకునేందుకు రాహుల్ తనను తాను ఎంతో మార్చుకున్నట్లు వివరించారు. ఇందుకోసం ఆయన చాలా కష్టపడ్డారని.. ఈ ప్రయాణం తనను ఎంతో ఆకట్టుకున్నట్లు సైఫ్ అలీఖాన్ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం నటుడి వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

# నాకు చాలాసార్లు ప్రధాని పదవి ఆఫర్ వచ్చింది : నితిన్ గడ్కరీ



**ముంబై:** కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తి కర వ్యాఖ్యలు చేశారు. 2024లోక్‌సభ ఎన్నికలకుముందు ఆ తర్వాత తనను ప్రధాని అభ్యర్థిగా ముందుకు రావాలని ప్రతిపక్షాల నుంచి ప్రతిపాదనలు వచ్చినట్టు గడ్కరీ తెలిపారు. ప్రధాన మంత్రి అభ్యర్థిగా ముందుకు వస్తే తనకు మద్దతు ఇస్తామని ప్రతిపక్షాలు చెప్పినట్లు వెల్లడించారు. ముంబైలో జరిగినఓ కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడుతూ.. '2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత కూడా నాకు చాలా సార్లు ఇలాంటి ఆఫర్ వచ్చింది. మోదీకి బదులు నన్ను ప్రధాని అభ్యర్థిగా నిలబెట్టాలని ప్రతిపక్షాలు ప్రతిపాదనలు చేశాయి. అయితే, నేను ఆ ఆఫర్‌ను తిరస్కరించాను. మోదీ బదులుగా నేను ప్రధాని అభ్యర్థిగా ముందుకు రావడం అంటే బీజేపీలో చీలిక సృష్టించాలనే ప్రతిపక్షాల పథకం' అని పేర్కొన్నారు.'నేను నాభావజాలంతో రాజీపడను. ప్రధాని పదవి ఆఫర్‌ను అంగీకరించే ప్రశ్నే లేదు. ప్రధాని కావాలనేది నాలక్ష్యం కాదు.ఆ పదవిపై ప్రత్యే క ఆసక్తి కూడా నాకు లేదు. మోదీ పాలనలోనా బాధ్యతలతోసంతృప్తిగా ఉన్నాను. నేను మొదటగా ఆర్ఎస్ఎస్ సభ్యుడిని. ఆ తర్వాత బీజేపీ కార్యకర్తని, మంత్రి పదవి ఉన్నా లేకపోయినా.. నేను నిబద్ధత కలిగిన కార్యకర్తగానే పనిచేస్తాను' అని గడ్కరీ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కేంద్ర మంత్రి వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

# స్వతంత్ర సేనాని రైలుపై రాళ్ల దాడి.. ప్రయాణికులకు గాయాలు



**పాట్నా:** దేశంలో రైళ్లపై దాడులు, పట్టాలు తప్పించేందుకు జరుగుతున్న కుట్రలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్ రైలుపై కొందరు దుండగులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు సైతం గాయాలయ్యాయి.

వివరాల్లోకి వెళితే.. బీహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్ జిల్లాలో స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్ రైలుపై గురువారం రాత్రి రాళ్ల దాడి జరిగింది. రైలు జైనగర్ నుంచి ఢిల్లీకి వెళ్తోంది. ఈ క్రమంలో ముజఫర్‌పూర్ %-% సమస్తిపూర్ మార్గంలో రైలుపై దుండగులు రాళ్ల దాడి చేశారు. ఈ దాడిలో రైలు ప్యాంట్రీకార్, పక్క కోచ్‌ల అద్దాలు ధ్వంసమయ్యాయి. స్లీపర్ కోచ్‌పై కూడా రాళ్లు రువ్వారు. సమస్తిపూర్ రైల్వే స్టేషన్ ఔటర్ సిగ్నల్ సమీపంలో రాత్రి 8:50 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది.ఈ దాడిలో పలువురు ప్రయాణికులు గాయపడినట్లు తెలిసింది. వారికి హుటాహుటిన సమస్తిపూర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మరోవైపు రాళ్ల దాడి ఘటనపై రైల్వే పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు. దుండగుల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. దాడి కారణంగా రైలు 45 నిమిషాలు ఆలస్యమైంది.కాగా, గత వారం కూడా ఈ రైలు పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. ఢిల్లీ %-% జైనగర్ మార్గంలో ఘాజీపూర్‌లోని రాజ్‌దేపూర్ సమీపంలో ట్రాక్‌పై ఉంచిన చెక్క దిమ్మెను ఢీ కొట్టింది. అయితే, ఆ ఘటనలో రైలు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకుంది. అప్పుడు ఇంజిన్ భాగం దెబ్బతినింది. ఆ తర్వాత రైలును అక్కడే ఆపేసి.. ఔరిహార్ రైల్వే స్టేషన్‌నుంచి కొత్త ఇంజిన్‌ను తెప్పించి రైలుకు అటాచ్ చేశారు. దీంతో రైలు మూడు గంటలు ఆలస్యమైంది.

# సరోగసీతో సంతానం పొందినా ప్రసూతి సెలవులు..

## ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం

**భువనేశ్వర్:** సరోగసీ ద్వారా మాతృత్వాన్ని పొందాలనుకునే తల్లుల కోసం ఒడిశా ప్రభుత్వం ఓ వెసులుబాటు తీసుకువచ్చింది. అలా సంతానాన్ని పొందిన ఉద్యోగినులకు ఆరు నెలల ప్రసూతి సెలవులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దీనికింద మహిళా ఉద్యోగులకు 180 రోజులు, పురుష సిబ్బంది కి 15 రోజుల సెలవులు తీసుకునే వెసులుబాటు ఉంది.ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న మహిళలు సరోగసీ తో సంతానాన్ని పొందితే వారికి 180 రోజుల మాతృత్వ సెలవులు వర్తిస్తాయి. ఒకవేళ సరోగసీ కోసం గర్భాన్ని అద్దెకిచ్చిన మహిళ కూడా ప్రభుత్వ ఉద్యోగిని అయితే ఆమెకూ ఈ సెలవులు వర్తిస్తాయి. ఇద్దరు సంతానం వరకే సెలవులు పొందొచ్చు. ఈ సెలవులు పొందాలంటే.. రిజిస్టర్డ్ వైద్యులు లేక ఆసుత్రుల నుంచి సరోగసీ తల్లి, కమిషనింగ్ తల్లీతండ్రి మధ్య ఉన్న ఒప్పందాన్ని సమర్పించాల్సి ఉంటుందని నోటిఫికేషన్లో వెల్లడించారు. చట్టబద్ధమైన వివాహం ద్వారా అయిదేళ్లు కలిసి ఉన్న దంపతులే సరోగసీకి అర్హులు. భార్యకు 23-50ఏళ్ల లోపు వయసు, భర్తకు 26-55 ఏళ్ల వయసు ఉండి సాధారణ పద్ధతుల్లో సంతానం కలగని పరిస్థితుల్లో మాత్రమే ఆ దంపతులు సరోగసీ విధానంలో బిడ్డను పొందవచ్చు. సరోగసీ పద్ధతిలో సంతానం పొందుతున్నవారికి మాతృత్వ, పితృత్వ సెలవుల ప్రయోజనాలను కొన్ని నెలల క్రితం కేంద్రం పొడిగించిన నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం ఈ నిర్ణయం వెలువరించింది.

# ఎన్నికల వాగ్దానాలతో అఫిడవిట్‌పై సంతకం..

## ఎమ్మెల్యే అభ్యర్థి నోటరీ వైరల్






**న్యూఢిల్లీ:** హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడిన విషయం తెలిసిందే. జులానా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐఎన్ఎల్‌డీ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సురేందర్ లాథర్ ఎన్నికల అఫిడవిట్ ప్రస్తుతం వైరల్ అవుతున్నది. ఒకవేళ ఎన్నికల్లో గెలిస్తే ఏం చేస్తానన్న దానిపై అతను కొన్ని వాగ్దానాలు చేశారు. అయితే ఓ నోటరీపై ఆ వాగ్దానాలను రాశారు. దానిపై ఆయన సంతకం చేశారు. ప్రస్తుతం ఆ నోటరీ వైరల్ అవుతున్నది.బుదా ఖేరా లాథర్ గ్రామానికి చెందిన సురేందర్.. తన నోటరీలో 25 వేల ఉద్యోగాలను కల్పించనున్నట్లు చెప్పారు. జులానా అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఆ ఉద్యోగాలను ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామానికి మంచినీరు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి ఊరుకు కిసాన్ మజ్దూర్ భవన్ కట్టించనున్నట్లు చెప్పారు. ఒకవేళ వాగ్దానాలను అమలు చేయకుంటే, అప్పుడు తాను రిజైన్ చేయనున్నట్లు ఆ నోటరీలో రాశారు.

# మునిగిన అణు జలాంతరామి.. తీవ్ర నిరాశలో చైనా



**వాషింగ్టన్:** డ్రాగన్ దేశం చైనాకు తీవ్ర నిరాశ ఎదురైంది. ఆ దేశం నిర్మిస్తున్న అణ్వాయుధ సామర్థ్యం కలిగిన జలాంతర్గామి నీట మునిగింది. ఆ ఘటనకు సంబంధించిన విషయాన్ని అమెరికా రక్షణ అధికారి ఒకరు వెల్లడించారు. సైనిక సామర్థ్యాన్ని విస్తరించాలనుకుంటున్న చైనాకు ఈ సంఘటన తీవ్ర నిరాశను మిగిల్చింది. ప్రస్తుతం చైనా వద్ద సుమారు 370 భారీ నౌకలు ఉన్నాయి. అయితే కొత్త తరహా అణ్వాయుధ సామర్థ్యం కలిగిన సబ్‌మెరైన్లను తయారు చేస్తున్నది. చైనాకు చెందిన ఫస్ట్ క్లాస్ న్యూక్లియర్ పవర్ సబ్‌మెరైన ఈ ఏడాది మే లేదా జూన్ నెలలో నీటిలో మునిగినట్లు అమెరికా రక్షణ అధికారి తెలిపారు. అయితే వాషింట్టన్‌లో ఉన్న చైనా ఎంబసీ ఈ అంశాన్ని ధ్రువీకరించలేదు. తనకు ఎటువంటి సమాచారం లేదన్నారు.

# 'లాడెన్ జీవిత చరిత్ర చదవండి'.. ఎన్‌సీపీ నేత సతీమణి వ్యాఖ్యలు




**ముంబయి:** ఉగ్రవాదులకు అనుకూలంగా వ్యాఖ్యలు చేయడం 'ఇండియా' బ్లాక్ నేతలకు ఓ అలవాటని మండిపడింది. మహారాష్ట్ర సీనియర్ నేత శరద్ పవార్ పార్టీ కి చెందిన నేత జితేంద్ర అవధ్ సతీమణి మాట్లాడిన మాటలే ఈ విమర్శలకు కారణం. సమాజంలో నెలకొన్న పరిస్థితులే ఒసామా బిన్లాడెన్ను ఉగ్రవాదిగా మార్చాయని వ్యాఖానించిన ఆమె.. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరును ప్రస్తావించడం తీవ్ర వివాదాస్పదమైంది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

జితేంద్ర అవధ్ సతీమణి రుతా అవధ్ ఓ బహిరంగ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. "మీరు ఒసామా బిన్ లాడెన్ జీవిత చరిత్ర చదవండి. కలాం ఎలా రాష్ట్రపతి అయ్యారో.. లాడెన్ ఎలా ఉగ్రవాదిగా మారాడో అర్థం చేసుకోవడానికి దానిని చదవండి. అతడు ఉగ్రవాదిగా ఎందుకు మారాడు..? అతడు ఆ మార్గాన్ని ఎంచుకోవడానికి సమాజం నుంచి అతడికి ఎదురైన పరిస్థితులే కారణం" అని వివరించారు. దీనిపై భాజపా తీవ్రంగా స్పందించింది. "ఎన్సీపీ(ఎస్పీ) నేత సతీమణి లాడెన్ను సమర్థిస్తూ మాట్లాడారు. ఆ సమయంలో కలాం ప్రస్తావన తెచ్చారు. ఉగ్రవాదులను సమర్థించడం ఇండియా బ్లాక్ కు అలవాటే" అని మండిపడ్డారు. అయితే ఈ విమర్శలపై స్పందించిన రుతా.. తన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు.

# అమెరికాలో తుపాకీ సంస్కృతికి చెక్..

## కొత్త చట్టంపై సంతకం చేసిన జో బైడెన్



**వాషింగ్టన్:** అగ్రరాజ్యం అమెరికాలో తుపాకీ సంస్కృతి రోజురోజుకూ పెచ్చుమీరుతోంది. కొందరు ఉన్మాదులు సృష్టిస్తున్న ఘోర కలికలతో అగ్రరాజ్యం అమెరికా వణికిపోతోంది. నిత్యం ఏదో ఒక చోట కాల్పుల మోత మోగుతూనే ఉంటుంది. ఈ ఘటనల్లో ఎంతో మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. చిన్నారులు సైతం ఈ సంస్కృతికి బలవుతున్నారు. ఈ నేపథ్యంలోనే తుపాకీ సంస్కృతిని అంతం పలికేందుకు అధ్యక్షుడు జో బైడెన్ కీలక ముందడుగు వేశారు. ఈ మేరకు హింసకు ముగింపు పలకాలనే ఉద్దేశంతో కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు.ఈ విషయాన్ని అధ్యక్షుడే స్వయంగా వెల్లడించారు. తుపాకీ సంస్కృతిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. అమెరికాలో వ్యాధులు, ప్రమాదాల వల్ల మృతి చెందుతున్న చిన్నారుల కంటే.. తుపాకీల కారణంగా చోటుచేసుకుంటున్న మృతుల సంఖ్యే ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ హింసను అంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. తుపాకీ హింసను అరికట్టేందుకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పై సంతకాలు చేసినట్లు బైడెన్ వెల్లడించారు.

# ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ ప్యానెల్‌పై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత సరిగా లేని అంశంపై ఇవాళ సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. వాయు నాణ్యతను పర్యవేక్షించడానికి, కాలుష్యాన్ని నియంత్రించడానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వాయు నాణ్యత నిర్వహణ కమీషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఏజీ మాసిలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. గాలిలోనే మొత్తం కలుషితం ఉన్నదని, ఎన్సీఆర్ రాష్ట్రాలకు చెప్పినట్లు ఎయిర్ క్వాలిటీ ప్యానెల్ పనిచేయడం లేదని జస్టిస్ ఓకా తెలిపారు.కమిటీలు ఏర్పాటు చేసి ఒక్క చర్య కూడా తీసుకోవడం లేదన్నారు. సీఏక్యూఎం పూర్తిగా పనిచేయలేదని చెప్పడం లేదని, కానీ అనుకున్న రీతిలో ఆ ప్యానెల్ పర్ఫార్మ్ చేయలేదని జస్టిస్ ఓకా వెల్లడించారు. శీతాకాల సమయంలో ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో తీవ్ర వాయు కాలుష్యం నమోదు అయ్యే విషయం తెలిసిందే. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల హర్యానా, పంజాబ్ రాష్ట్రాల నుంచి భారీ స్థాయిలో వాయు కాలుష్యం జరుగుతున్నది. మీరు తీసుకున్న చర్యల వల్ల కాలుష్యం తగ్గిందాఅని సీఏక్యూఎం చైర్మెన్ రాజేశ్ వర్మను సుప్రీంకోర్టు అడిగింది.

# ఇజ్రాయెల్‌తో సంబంధాలు తెంచుకోండి

## ముస్లిం దేశాలనుకోరిన ఇరాన్



ఇరాన్: ప్రపంచ దేశాల నుంచి ఒత్తిడి ఉన్నా.. హమాస్ ను సమూలంగా పెకిలించేవరకు, హెజ్బుల్లా విషయంలో తమ లక్ష్యాలను సాధించేవరకు దాడులు ఆగవని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటనలు చేస్తున్నారు. ఇరాన్ మద్దతున్న ఈ గ్రూప్ పై అటు గాజాలో, ఇటు లెబనాన్లో విరుచుకుపడుతున్నారు. గత కొన్ని రోజులుగా చేస్తోన్న వరుసదాడులతో హెజ్బుల్లా కీలక కమాండర్లను కోల్పోతోంది. రెండు వర్గాల మధ్య సంధి కుదిర్చేందుకు అమెరికా, ఫ్రాన్స్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ముస్లిం దేశాలకు ఇరాన్ ఓ విన్నపం చేసింది.ఇరాన్ రక్షణశాఖ మంత్రి బ్రిగేడియర్ జనరల్ అజీజ్ నాసిర్జాదేశ్ మాట్లాడుతూ.. ముస్లిం దేశాలు ఇజ్రాయెల్ తో దౌత్యపరమైన సంబంధాలు తెంచుకోవాలని కోరారు. ఆ దేశ దౌత్యవేత్తలను బహిష్కరించాలని అడిగారు. అలాగే నెతన్యాహు ప్రభుత్వంపై ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ ముందు లొంగిపోవద్దని యెమెన్కు చెందిన హూతీ చీఫ్ అబ్దుల్ మాలిక్ కూడా హెచ్చరించారు. ఇజ్రాయెల్ , హెజ్ బొల్లా ఘర్షణను ఆపేందుకు అమెరికా, ఫ్రాన్స్, ఇతర దేశాలు చేసిన 21 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను గురువారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తిరస్కరించారు. లెబనాన్పై పూర్తిశక్తితో విరుచుకుపడాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు. "ఇజ్రాయెల్ విధానం సుస్పష్టం. మేం మా లక్ష్యాలను సాధించేవరకు దాడులు ఆపం. హెజ్బుల్లా దాడుల కారణంగా ఉత్తర ఇజ్రాయెల్ను ఖాళీ చేసిన పౌరులు తమ నివాసా లకు తిరిగి వెళ్లడం మాకు కీలకం" అని నెతన్యాహు తెలిపారు. హెజ్ బొల్లా ఆయుధాలను దాచిన బెకా లోయనూ ధ్వంసం చేస్తామని ఇప్పటికే ప్రకటించారు. తాజా దాడిలో హెజ్‌బ్లల్లాకు చెందిన డ్రోన్ యూనిట్ కమాండర్ ప్రాణాలు కోల్పోయారు.

# హైదరాబాద్ మరో అగ్నిగోళం అవుతుంది: పటోళ్ల కార్తీక్ రెడ్డి




విశ్వంభర, హైదరాబాద్ : మూసీ పరివాహక ప్రాంతంలో ప్రజల ఆమోదం తీసుకున్న తర్వాతనే ప్రక్షాళన చేపట్టాలి.. లేదు మేం బలవంతం చేస్తాం అంటే మాత్రం హైదరాబాద్ మరో అగ్నిగోళం అవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి హెచ్చరించారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న వారి వెంట కేసీఆర్ ఉన్నాడు.. మీరు ఎవరూ భయపడొద్దు.. బీఆర్ఎస్ పార్టీ వాళ్ల తరపున పోరాడుతుందని కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కార్తీక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.మూసీ నదిపై ఆదిత్య నిర్మాణ సంస్థ నిర్మాణాలు చేస్తుంటే వాటిని ఆపకుండా, పేదలు.. సామాన్యులు ఉండే హైదర్‌షాకోట్ విలేజ్‌లో అధికారులు ఇండ్లకు మార్కింగ్ చేయడం జరిగింది. ఆదిత్య నిర్మాణ సంస్థ ప్రభుత్వ పెద్దల చేతులు తడిపింది అందుకే వారిని వదిలేశారు%‰% చేతులు తడపని పేదల ఇండ్లపై హైడ్రాను వాడుతున్నారు. 2022లో ఆదిత్య నిర్మాణ సంస్థకి మా బీఆర్ఎస్ ప్రభుత్వమే పర్మిషన్ ఇచ్చింది, కానీ తర్వాత ఆ పర్మిషన్‌ని నిలుపుదల చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి ఆదిత్య నిర్మాణ సంస్థకు అక్కడ బిల్డింగ్ కట్టుకునేందుకు పర్మిషన్ ఇచ్చారని కార్తీక్ రెడ్డి తెలిపారు. 2400 కిలోమీటర్ల పొడవున్న నమామి గంగే ప్రాజెక్టుకి అయిన ఖర్చు రూ.40 వేల కోట్లు. అయితే గండిపేట నుంచి నాగోల్ వరకు 55 కిలోమీటర్లు విస్తీర్ణం కలిగి ఉన్న మూసీ నది సుందరీకరణకు అవుతున్న ఖర్చు రూ. లక్షా 50 వేల కోట్లు. ఇక మూసీ నది డీపీఆర్ కోసం రూ.1500 కోట్లు ఖర్చు చేయబోతుంది ఈ ప్రభుత్వం..
**ప్రపంచంలో ఎక్కడైనా చూస్తామా డీపీఆర్ కోసం ఇంత ఖర్చు పెట్టడం..? అని పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ప్రశ్నించారు.** మూసీ సుందరీకరణ అనేది లక్షా అరవై వేల కోట్ల రూపాయల కుంభకోణం. ఆనాడు బీఆర్ఎస్ హయాంలో మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.16,000 కోట్లు. కానీ నేడు అదే మూసీ సుందరీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,50,000 కోట్ల వ్యయం పెంచింది.. ఇది పెద్ద కుంభకోణం అని పటోళ్ల కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు.

## మండల విద్యాధికారిగా కే. మహాదేవ రెడ్డి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కే మహాదేవ రెడ్డి(ఏ ఫ్ఏసీ)ని మండల విద్యాధికారిగా నియమిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం రోజు మండల వనరుల కేంద్రం ఆత్మకూరు(ఎం)నందు మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

## పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

### మండల అభివృద్ధి అధికారి జె రాములు నాయక్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్థానిక ఆత్మకూరు గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు పరిసర గ్రామాల పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని మండల అభివృద్ధి అధికారి జె రాములు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం పారిశుధ్యంతో సహవాసం చేసే పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైద్య శిబిరాన్నిసద్వినియోగం చేసుకోవాలి అని కోరారు. మండల వైద్య అధికారి డాక్టర్ వంశీకృష్ణ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని పరిశీలించి వారి రక్త సాంపిల్స్ ను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్ పంపించారు. అవసరమైన మందులను పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెంట్ ఎల్మినేటి లోకేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తుమ్మల ఆనంద్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కరుణాకర్, గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ సుదర్శన్, ఏఎన్ఎం పరకాల మమత, ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాది ముభరక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**విశ్వాంభర, పెద్ద శంకరంపేట్:** నారాయణఖేడ్ నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. చెక్కుల పంపిణీ జరిగిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్క పెద కుటుంబానికి సహాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ పార్టీ బీజేపీ పార్టీ అని తెలిస్తే చాలు వాళ్ళ చెక్కులను ఇవ్వకుండా పార్టీ కండువా కప్పుకుంటేనే చెక్కును ఇస్తాం అని వారిని చాలా ఇబ్బంది పెట్టేవారన్నారు. మా ఈ ప్రజా ప్రభుత్వం లో ఏ పార్టీ అయినా సరే వారికి ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పథకాన్ని అందిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ సెట్, హనుమాండ్లు, సయ్యద్, వివేకానంద, రాజేష్ కౌన్సిలర్లు తహేర్ మండల నాయకులు, వినోద్ పాటిల్, పండరి రెడ్డి, రమేష్ చౌహాన్, జైపాల్ మాజీ ఉప సర్పంచ్, శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, నెహ్రూ నాయక్, శివరెడ్డి, శివరాజ్, మాణిక్యం, రాజు నాయక్ పాల్గొన్నారు



**తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా మహేష్ కుమార్ గౌడ్ ని హై కమాండ్ నియమించింది. ఈ సం దర్భంగా టీటీడీ బోర్డు లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్, శ్రీమాన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అనుప్ చక్రవర్తి మహేష్ గౌడ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. (విశ్వంభర, హైదరాబాద్)**

## కుక్కల బెడద నుంచి కాపాడండి..






**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి గ్రామంలో వీధి కుక్కలు మహిళలు, చిన్న పిల్లలపై విరుచుకు పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని. చింతపల్లి మండల కేంద్రంలోనీ ఎంపీడీఓ, ఎమ్మార్వో కార్యాలయంలో కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని శుక్రవారం గ్రామ ప్రజలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో వీధి కుక్కలు విపరీతంగా వాడ వాడలో తిరుగుతున్నాయి గతంలో అధికారులకు విన్నవించినా స్పందించ లేదన్నారు. రెండు రోజుల క్రితం రెండు సంవత్సరాల వయస్సు గల ఊర్మిళ అనే అమ్మాయిపై వీధి కుక్కలు దారుణంగా దాడి చేశాయన్నారు. విధి కుక్కలు గ్రామంలో ఉన్న వృధులు, చిన్న పిల్లలపై మార్లు దాడి చేయడం జరిగిందన్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి విధికుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని వినతి పత్రంలో కోరారు. ఈ విషయం పై అధికారులు స్పందించక పోతే గ్రామ ప్రజలు అఖిల పక్షం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెన్నం శేఖర్, మోర వెంకటరమణ, కంచుకట్ల సాయిప్రసాద్, గంట జగదీష్, సోమరాజు ప్రదీప్, సోమరాజు సాయికుమార్, కంచుకట్ల ప్రవీణ్, లక్ష్మణ్, నరసింహ, శివ తదితరులు పాల్గొన్నారు.

## జాగృతి మహిళా కళాశాలలో ఘనంగా ప్రెషర్స్ డే



**విశ్వంభర మహేశ్వరం:** తుక్కుగుడ మున్సిపాలిటీలోని జాగృతి మహిళా కళాశాలలో సీనియర్ విద్యార్థినులు జూనియర్ విద్యార్థినులకు లకు స్వాగతం చెప్పే సందర్భంగా ఫ్రెషర్స్ డే "కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల డైరెక్టర్లు సరికొండ వెంకటేష్ గౌడ్, జయశ్రీ, పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు వెంకటేశ్వర్లు, డి. విజయ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జీవితంలో విజయం సాధించాలంటే, జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని, తల్లిదండ్రులను గౌరవించాలని, గొప్పవారి జీవితాలను పరిశీలించాలని, క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. విజయానికి చదువే శక్తివంతమైన ఆయుధం అని, దాని ద్వారా మహిళలు జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లాలని అన్నారు. ఎస్ఐలు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరాగాంధీ, కల్పనా చావ్లా, కిరణ్ బేడీ మొదలైన మహిళల గురించి చెబుతూ మహిళలు అనుకుంటే ఏదైనా సాధించగలశక్తి సామర్థ్యాలు గలవారని ఆమె అన్నారు. లక్ష్యం లేని జీవితం గమ్యం లేని ప్రయాణం అని అన్నారు. సరైన లక్ష్యాన్ని ఎంచుకొని వాటిని చేరుకునే ప్రణాళిక వేసుకుంటే జీవితం విజయవంతమవుతుందని అన్నారు. మహిళల భద్రతే షీ టీం లక్ష్యమని ఎస్సై విజయ అన్నారు. శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో జాగృతి మహిళా కళాశాల విద్యార్థినులకు మహిళల భద్రత, సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మహిళల రక్షణ కోసం షీటీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. మహిళలు, విద్యార్థినులు ఈవ్‌టీజింగ్‌కు గురైతే షీటీం వెంటనే స్పందిస్తుందని, ప్రతీ మహిళా, విద్యార్థినులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. సోషల్ మీడియా ద్వారా అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేస్తే షీ టీమ్ నంబరు 87126 56425 కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పొంగులేటిని ఎదుర్కోలేకనే ఈడి దాడులు: డాక్టర్ పిడమర్తి రవి



**విశ్వంభర హైదరాబాద్?** ప్రజాక్షేత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డినీ ఎదుర్కోలేకనే ఈడి రూపంలో మోడీ దాడి చేయించడం సిగ్గుచేటని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ప్రజా నాయకుడు, పేదల పక్షపాతి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజాదారణ చూసి నివ్వరపోయిన కేంద్ర పెద్దలు పొంగులేటిని ప్రజల నుంచి దూరం చేయడం సాధ్యతరం కాదని మచ్చలేని నాయకుడు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి అని అన్నారు. గత పది ఏళ్ల నుంచి ఒక్క బిజెపి నాయకుని పై ఈడి దాడులు జరగలేదని ఈ దేశంలో అత్యంత అవినీతిపరులు బిజెపి నాయకులే అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజానాయకులపై ఈడి దాడులు చేపించడం, అసత్య ఆరోపణలు చేయడం అలవాటుగా మారింది. అందుకు ఉదాహరణ ఉద్యమ నాయకుడు జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అని అన్నారు. ఎన్ని ఈడి మోడీ దాడులు జరిగినా పొంగులేటి ప్రతిష్టకు భంగం కలగదు అని అన్నారు. ఈ అసత్య ఆరోపణల నుంచి కడిగిన ముత్యం వలే పొంగులేటి గారు కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనసాగుతారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్న మోడీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఒక్కల గడ్డ సోమ చంద్రశేఖర్, పాతకోటి కిరణ్,మైస ఉపేందర్, చిరుమర్తి రాజు, బోరెల్లి సురేష్, నక్క మహేష్ జోగు గణేష్ మీసాల మహేష్, వాజిత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

### పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య




**విశ్వంభర, వరంగల్:** గొప్ప చరిత్ర కలిగిన వరంగల్ నగరాన్ని పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. వరంగల్ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ కోటలో ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలలో వరంగల్ కలెక్టర్ సత్య శారద దేవితో కలిసి ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కొత్త ప్రదేశాల సందర్శన మానవుల్లో ఉత్సాహన్ని, ఉల్లాసన్ని కలిగించడంతో పాటు విజ్ఞానాన్ని, సానుకూల దృక్పథాన్ని అలవరుస్తాయని అన్నారు. ఒకప్పుడు విహార యాత్రలు వినోదాల కోసమే ఉండేవాని కాని నేటి సమాజంలో విజ్ఞాన సాధనలుగా, అనుభవ సారాలుగా ఎదిగాయని తెలిపారు. విశిష్ట చరిత్ర కలిగిన ఓరుగల్లు లో చూడదగిన పర్యాటక ప్రాంతాలు అనేకం ఉన్నాయని అన్నారు. కాకతీయుల సామ్రాజ్యంలో ఓరుగల్లు నగరం రాజధానిగా విలసిల్లిందని తెలిపారు. కాకతీయులు నిర్మించిన అద్భుత ఆలయాలు, గొలుకట్టు చెరువులు ఎన్నో ఉన్నాయని కాని వాటికీ తగిన గుర్తింపు లభించడం లేదని అన్నారు. పర్యాటక రంగంలో వరంగల్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. దానికి అవసరమైన నిధులు మంజూరు చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గిసుగొండ మండలం గంగాదేవి పల్లిలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలలో కలెక్టర్ సత్య శారద దేవి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. గంగాదేవి పల్లి మాడల్ విలేజ్ గా అభివృద్ధి చెందింది అంటే గ్రామస్తుల ఎంతో ఉందని అన్నారు. గంగాదేవి పల్లి దేశం దృష్టినే ఆకర్శించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి, డీఆర్ డీవో కౌసల్య, జిల్లా టూరిజం అధికారి శివాజీ, జడ్పి సీఈవో రామ్ రెడ్డి, ఇతర అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## షరతులు లేకుండా రుణమాఫీ చెయ్యాలి

### మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్



**విశ్వంభర, నకిరేకల్:** నార్కట్ పల్లి మండల కేంద్రంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో రైతుధర్నా కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చెయ్యాలని రైతన్నలతో కలిసి చిరుమర్తి లింగయ్య రోడ్డెక్కారు. షరతులు లేకుండా రుణమాఫీ చెయ్యాలని డిమాండ్ పేస్తూ రేవంత్ సర్కార్ కి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. షరతులు లేకుండా హామీలు, కొర్రీలు లేకుండా రుణమాఫీ చెయ్యాలని వారు నిరసన తెలిపారు. రైతన్నలపై చిన్నచూపు తగదని కాంగ్రెస్ ప్రభుత్వంపై చిరుమర్తి లింగయ్య మండిపడ్డారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చెయ్యాలని చేసేదాకా నిరసన కార్యక్రమాలు చేపడతామని చిరుమర్తి లింగయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## అదనపు గదికి శంకుస్థాపన



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కూరెళ్ళ గ్రామం ఎస్సీ కొత్త కాలనీలో వినాయకుని మండపం దగ్గర అదనపు గది కోసం దాతలు పరిటాల రవి శంకుస్థాపన చేశారు. వినాయక కమిటీ ఆధ్వర్యంలో పరిటాల రవికి సన్మానం చేసి ధన్యవాదాలు తెలిపారు. కాలనీ వాసులు గడ్డం అశోక్, కూరెళ్ళ రమేష్, నార్కట్పల్లి సహదేవ్, నార్కట్పల్లి ఐలయ్య, కూరెళ్ళ స్వామి, నార్కట్పల్లి రవి, నార్కట్పల్లి నరస య్య, నార్కట్పల్లి రవి, నార్కట్పల్లి ఉప్పలయ్య, నార్కట్పల్లి మచ్చగిరి, నార్కట్పల్లియాదయ్య, తుమ్మలగూడెం యాదయ్య, జిట్టా నాగరాజు, నార్కట్పల్లి నవీన్, కూరెళ్ళ మణికుమార్, పాల్గొన్నారు.

## క్యాబినెట్ ఆమోదం సరైన విధానం కాదు




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** జమిలీ ఎన్నికల విధానానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం సరైన విధానం కాదని సీపీఎం ఆత్మకూరు(ఎం)మండల కార్యదర్శి వేముల బిక్షం అన్నారు. ఆత్మకూరు(ఎం)మండలంలోని తుక్కాపురం సీపీఎం గ్రామ శాఖ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2029 నుంచి ఒకే దేశం – ఒకే ఎన్నిక విధానాన్ని ఎన్డీఏ ప్రభుత్వం కేంద్ర క్యాబినెట్లో ప్రవేశపెట్టడం ఫెడరల్ వ్యవస్థ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో రైతుకు రుణమాఫీ కొంతమందికి మాత్రమే రుణమాఫీ అయ్యింది. మిగిలిన రైతులందరికీ కూడా రుణమాఫీని వెంటనే చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ మహాసభలో సీపీఎం పార్టీ నూతన గ్రామ శాఖ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. తుక్కాపురం పార్టీ నూతన కార్యదర్శిగా మల్లెల శ్రీశైలం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎరుకల పాపయ్య, జి ఎల్ ఎస్, అవనగంటి చంద్రయ్య, అభిలాష్ ఎరుకల లావణ్య పాల్గొన్నారు.

## తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాల్సిందే : వైఎస్ షర్మిల



**విశ్వంభర, విజయవాడ :** తిరుమల పవిత్రతను కాపాడేందుకు అన్యమతస్థులు ఎవరైనా స్వామివారి దర్శనం కోసం వస్తే నిబంధనల ప్రకారం డిక్లరేషన్ఇవ్వాల్సిందేనని ఏపీసీసీ చీఫ్ షర్మిల స్పష్టం చేశారు. తిరుమలలో లడ్డూ వివాదం, డిక్లరేషన్ అంశాలపై ఆమె స్పందించారు. తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాల్సిన రూల్ అందరికీ వర్తిస్తుందని, ' రూల్స్ అప్లైడ్ ఫర్ ఆల్ పీపుల్' అని వ్యాఖ్యానించారు.తిరుమల లడ్డూ తయారీలో నెయ్యి కల్తీ జరిగిందనే విషయం చంద్రబాబుకు తెలుసని, సాక్ష్యాలు, రిపోర్టులు ఉన్నా నిందితులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజకీయం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ పశ్చాత్తాప దీక్ష , మాజీ సీఎం జగన్ ప్రక్షాళన దీక్షలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకరిపై ఒకరు పోటీ పడి నీచమైన మత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం తిరుమల లడ్డూను కల్తీ చేసిందని ఆరోపించారు. మార్కెట్ కంటే తక్కువకే నెయ్యి కొనుగోలు చేయండంతో సరఫరాదారులు కల్తీ నెయ్యిని సరఫరా చేశారని విమర్శించారు.

**హైదరాబాద్ టూ అయోధ్య..**

## ఇకపై రెండున్నర గంటలే






**విశ్వంభర, హైదరాబాద్ :** అయోధ్య వెళ్లే భక్తులకు గుడ్‌న్యూస్.. ఇకపై హైదరాబాద్ నుంచి అయోధ్య వెళ్లాలంటే 30 గంటల సుదీర్ఘ ప్రయాణంతో పన్లేదు. కేవలం రెండున్నర గంటలే చాలు. ప్రజల డిమాండ్‌కు తగ్గట్టుగా హైదరాబాద్ నుంచి అయోధ్య, కాన్పూర్, ప్రయాగరాజ్ ప్రాంతాలకు శుక్రవారం నుంచి వరుసగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 27 నుంచి హైదరాబాద్ టూ కాన్పూర్, హైదరాబాద్ టూ అయోధ్యకు మధ్య వారానికి 4 రోజులు విమాన సర్వీసులు కొనసాగనుండగా.. సెప్టెంబర్ 28 నుంచి హైదరాబాద్‌ప్రయాగరాజ్, హైదరాబాద్‌ఆగ్రా మధ్య వారానికి మూడు రోజులు విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి.ప్రయాగరాజ్, అయోధ్యకు వెళ్లే భక్తులు ఈ సర్వీసులు వినియోగించుకోవాలని కేంద్ర విమానయాన శాఖ సూచిస్తోంది. ఇక ఇప్పటికే హైదరాబాద్ టూ అగర్తల, హైదరాబాద్ టూ జమ్మూ విమాన సర్వీసులు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ నుంచి అయోధ్యకు విమాన ధర దాదాపుగా రూ. 5 వేలు ఉండగా, హైదరాబాద్ టూ ప్రయాగరాజ్ రూ. 5,635గా, హైదరాబాద్ టూ కాన్పూర్ రూ. 4,598గా ఉంది. కాగా, హైదరాబాద్ నుంచి ఒక్క నెలలోనే 7 నూతన విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

**జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను**

## పునరుద్ధరించేది ఎన్డీఏ ప్రభుత్వమే

**బీజేపీ చీఫ్ జేపీ నడ్డా**



**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్ కు రాష్ట్ర హోదా కల్పించేది ఎన్డీఏ ప్రభుత్వమేనని కేంద్ర మంత్రి , బీజేపీ చీఫ్ జేపీ నడ్డా చెప్పారు. ఈ విషయాన్ని ఆర్టికల్ 370 ని రద్దు చేసినప్పుడే తాము స్పష్టం చేశామని తెలిపారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర హోదా ఇస్తామని తాము మాటిచ్చిన విషయాన్నే మేనిఫెస్టోలో చేర్చి కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని నడ్డా విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినంత మాత్రాన రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర హోదా కల్పించే అధికారం ఉండదని గుర్తుచేశారు. రాష్ట్ర హోదా ఇచ్చే అధికారం కేంద్రానికి మాత్రమే ఉంటుందన్నారు.

## హైదారాబాద్‌లో భారీ చోరీ.!

**తాళం పగలగొట్టి రూ.2 కోట్లు ఎత్తుకెళ్లిన దొంగలు**

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ శివారులోని ఐటీ కారిడార్ లో భారీ చోరీ జరిగింది. భూమి అమ్మగా వచ్చిన రూ.2 కోట్ల నగదు ఇంట్లో దాయగా.. దొంగలు పడి నోట్ల కట్టలను ఎత్తుకెళ్లారు. నోట్ల కట్టలతో పాటు బీరువాలో దాచుకున్న 28 తులాల బంగారు ఆభరణాలను కూడా మాయం చేశారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఐటీ కారిడార్ లోని మక్త గ్రామంలో నాగభూషణం నివాసం ఉంటున్నాడు. ఇటీవల శంకర్ పల్లిలో తనకున్న 10 ఎకరాల భూమిని నాగభూషణం అమ్మకానికి పెట్టాడు. మంచి ధర రావడంతో అమ్మకానికి సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నాడు.

ఇందులో భాగంగా రూ. 2 కోట్ల 2 లక్షలు అడ్వాన్స్ గా తీసుకున్నాడు. ఈ సొమ్మును నాగభూషణం ఇంట్లోనే దాచాడు. ఈ విషయం ఆ దొంగలు ఎలా తెలుసుకున్నారో ఏమో.. శనివారం రాత్రి ఆ సొమ్మంతా ఎత్తుకెళ్లారు. ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగలగొట్టి డబ్బు, నగలు పట్టుకెళ్లారని బాధితుడు నాగభూషణం కన్నీటిపర్యంతమయ్యాడు. నాగభూషణం ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దొంగతనం జరిగిన తీరును పరిశీలించి, పరారైన దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానంతో నాగభూషణం డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## బాసర మొదటి ఘాట్ వద్ద విషాదం..

**గోదావరిలో మునిగి మహిళ మృతి**

**విశ్వంభర, నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గోదావరిలో స్నానానికి వెళ్లి ఓ మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే..నిజామాబాద్ జిల్లా ధర్మార గ్రామానికి చెందిన జయ(45) అనే మహిళ బాసర గోదావరి మొదటి ఘాట్ వద్ద స్నానానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందింది. మృతురాలు జయకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా, జయ భర్త సంవత్సరం క్రితం మృతి చెందాడు, అత్త మూడు నెలల క్రితం మృతి చెందిందిఒకే సంవత్సరంలో కుటుంబంలోని ముగ్గురు సభ్యులు మృతి చెందంటంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. ఇదే సమయంలో మరో మహిళ నీటిలో మునిగిపోతుండగా గమనించిన ఓ భక్తుడు సదరు మహిళను కాపాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


## హైదరాబాద్‌లో బ్యానర్లు, కటౌట్లపై నిషేధం

**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరంలో పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లపై నిషేధం విధిస్తూ జీహెచ్ఎంసీ ఉత్తర్వులు జారీ చేసింది. వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్స్‌పై కూడా నిషేధం విధించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది జీహెచ్ఎంసీ. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరించారు.

# తిరుమలలో ఎప్పటినుంచో డిక్లరేషన్ ఉంది..

- ఎవరైనా పాటించాల్సిందే
- జగన్‌కు చంద్రబాబు కౌంటర్



**విశ్వంభర, అమరావతి :** ఏ మతానికైనా కొన్ని సంప్రదాయాలు, ఆచారాలు ఉంటాయని, వాటిని ఎవరైనా ఆచారాలను పాటించాల్సిందేనని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమల , హిందువులకు పవిత్రమైన పుణ్యక్షేత్రమని, హిందూయేతరులు ఆలయాన్ని సందర్శించినపుడు డిక్లరేషన్ ఇవ్వాలని ఎప్పటి నుంచో ఉందని తెలిపారు. వాటిని ఎవరైనా పాటించాల్సిందేనని వెల్లడించారు. శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు.

తిరుమల పర్యటన అభ్యంతరాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ (YS Jagan) చేసిన వ్యాఖ్యలను చంద్రబాబు తప్పుబట్టారు. చాలా మంది డిక్లరేషన్ ఇచ్చి స్వామివారిని గౌరవంగా దర్శించుకున్నారని అన్నారు. ఇతర మతాలను గౌరవించడం అంటే ఆయా ఆలయాల సంప్రదాయాలను పాటించడమేనని పేర్కొన్నారు. అన్యమతస్థుడైన డిక్లరేషన్ ఎందుకు ఇవ్వవని జగన్‌ను ప్రశ్నించారు. ఇంతకుముందు కూడా జగన్ నియమాలు ఉల్లంఘించి తిరుమల వెళ్లారని ఆరోపించారు.

**తిరుమలకు వెళ్లవద్దని ఎవరూ చెప్పలేదు..**

జగన్‌ను తిరుమలకు వెళ్లవద్దని ఎవరూ చెప్పలేదని, ర్యాలీలు, జనసమీకరణలు చేయవద్దని మాత్రమే చెప్పామని వివరించారు. తిరుమలకు వెళ్లవద్దని ఎవరైనా నోటీసులు ఇచ్చారా? వెల్లడించాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని చంద్రబాబు వెల్లడించారు.

నెయ్యి కల్తీ జరగలేదని పదేపదే అబద్ధాలు ఆడుతూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో టెండర్లలో ఉన్న నియమ నిబంధనలు మార్చి రివర్స్ టెండర్లు పిలవడంలో ఉన్న తిరకాసు ఏమిటని ప్రశ్నించారు. తక్కువ ధరకే టెండర్ ఇచ్చి నాసిరకం లేని నెయ్యిని సరఫరా చేసి అపవిత్రం చేశారని ఆరోపించారు. వైసీపీకి రాజకీయ పార్టీకి ఉండవలసిన లక్షణాలు లేవు. హుందాతనం లేదు. రాజకీయాల్లో ఉండే అర్హతలేదని ఆరోపించారు. సీఎం చట్టాలను, సంప్రదాయాలను గౌరవించడంలో మొదటివ్యక్తిగా ఉండాలని సూచించారు.

## నా మతం మానవత్వం.. డిక్లరేషన్‌లో రాసుకోండి : జగన్



**విశ్వంభర, అమరావతి :** తిరుమల పర్యటనను మతం పేరుతో అడ్డుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీవ్రంగా స్పందించారు. తన తండ్రి వైఎస్సార్ అనేక సార్లు తిరుమలను దర్శించుకున్నారు. నేను సీఎంగా 5సార్లు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించా. నా మతమేందో ప్రజలందరికీ తెలుసని అన్నారు. తిరుమల పర్యటన సందర్భంగా నెలకొన్న పరిస్థితులపై తాడేపల్లి నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

తాను నాలుగు గోడల మధ్య బైబిల్ చదువుతా తప్పేముంది. బయటకు పోతే హిందూత్వాన్ని, ముస్లిం, సిక్కు మతాలను గౌరవిస్తా.. అనుసరిస్తానని వెల్లడించారు. తిరుమలకు వస్తానంటే డిక్లరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేయడం శోచనీయమని ఆరోపించారు. ' నా మతం మానవత్వం. డిక్లరేషన్‌లో రాసుకుంటే రాసుకోండని' వెల్లడించారు. . దేవుడిని దర్శించుకోవడానికి ఐదేళ్లపాటు సీఎంగా పనిచేసినా వ్యక్తి పరిస్థితి ఇలా ఉంటే దళితుల పరిస్థితి ఏమిటని, వారిని రాబోయే రోజుల్లో గుడిలోకి రానిస్తారా. అంటూ అనుమానం వ్యక్తం చేశారు. తాను అధికారంలోకి రాకముందు చంద్రబాబు హయాంలోనే చేపట్టిన పాదయాత్ర తిరుమల నుంచే మొదలు పెట్టి, తిరుమలలోనే కాలినడకన స్వామివారిని దర్శించుకున్నానని వెల్లడించారు. అప్పుడు లేని మతం డిక్లరేషన్ ఇప్పుడే ఎందుకని ప్రశ్నించారు. రాజకీయ లబ్ది కోసం హిందూ ధర్మాన్ని వాడుకోవడం ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబుకు సబబేనా అంటూ నిలదీశారు.

మతాలను రాజకీయం కోసం వాడుకోవడం దౌర్భాగ్యమని అన్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసిన చంద్రబాబును ఎందుకు మందలించడం లేదని బీజేపీ అగ్రనాయకత్వాన్ని ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన పాపాన్ని రాష్ట్ర ప్రజల మీద పడకుండా ఉండేందుకు నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో గుడిల్లో పూజలు చేయాలని వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## దసరా తరువాత ఏపీకి కుంకి ఏనుగులు : పవన్ కల్యాణ్



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల బీభత్సవాన్ని అరికట్టేందుకు దసరా తరువాత 8 కుంకి ఏనుగులుపంపేందుకు కర్ణాటక అంగీకరించిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. శుక్రవారం డిప్యూటీ సీఎం పవన్, కర్ణాటక మంత్రి ఈశ్వర్ మధ్య ఎంఓయూ ఒప్పందం జరిగిందని వివరించారు. ఇటీవల కర్ణాటక వెళ్లి కుంకీ ఏనుగుల అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్రమంత్రి, అటవీశాఖ అధికారులతో చర్చించామని తెలిపారు.

దేశంలో ఎక్కడా జరుగని విధంగా అటవీశాఖపై ఇరు రాష్ట్రాలు ఒప్పందాలు చేసుకున్న దాఖలాలు లేవని వెల్లడించారు. ఆరు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు ఎలిఫెంట్ కారిడార్ ఏర్పాటుకు నిర్ణయించామని, మావటి, కావటిలకు శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి వారిలో సామర్థ్యాన్ని పెంచనున్నామని వివరించారు.

ఏపీలో ఏనుగుల సంరక్షణ, వాటి ఆహారం తదితర అంశాలపై ఒప్పందం చేసుకున్నామన్నారు. ఏపీలోని శ్రీకాకుళం, మన్యం, చిత్తూరు జిల్లాలో అధికంగా ఏనుగులు దాడులు చేస్తూ మనుషుల ప్రాణనష్టం, పంట నష్టం జరుగుతుందని వెల్లడించారు. కుంకీ ఏనుగుల వల్ల ఏనుగుల దాడులను అరికట్టే అవకాశం ఉందని అన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను ఏపీ, కర్ణాటక సంయుక్తంగా అరికట్టేందకు ఒప్పందం చేసుకున్నామని వివరించారు.

# మేము నిర్మిస్తే.. మీరు కూల్చేస్తున్నారు

**సీఎం రేవంత్‌పై ధ్వజమెత్తిన కేటీఆర్**



**విశ్వంభర, హైదరాబాద్:** ఆపరేషన్ మూసీ పేరుతో ప్రభుత్వం చేస్తున్న విధ్వంసం, బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. తాము నిర్మిస్తే.. మీరు కూల్చేస్తున్నారని సీఎం రేవంత్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. తమది నిర్మాణం.. మీది విధ్వంసం అంటూ ఫైర్ అయ్యారు. మావి లక్షల నిర్మాణాలు కాగా, మీవి లక్షల కూల్చివేతలంటూ విమర్శించారు.మూసి నది సాక్షిగా ఇదిగిదిగో మహానగరంలో కేసీఆర్ లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అంటూ మూసీ నిర్వాసితులకు రెండు పడక గదుల ఇండ్లను ప్రభుత్వం కేటాయించడంపై ఓ దినపత్రికలో వచ్చిన వార్తను కేటీఆర్ పోస్ట్ చేశారు. కాంగ్రెస్ విష ప్రచారాలు, అబద్ధాలు అనడానికి మరో సాక్ష్యం ఇదేనని పేర్కొన్నారు. కట్టలేదన్నారు, ప్రజలను మభ్యపెట్టాం అన్నారు.. మరి లక్ష ఇండ్లు రాత్రికి రాత్రికి ఎక్కడ నుండి పుట్టుకొచ్చాయి చిట్టి అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. మీ పాలనలో మీ అధికారులే మీ టేబుల్ ముందు పెట్టిన డబుల్ లెక్కలు చూసి మతిపోతుందా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నిజం, ఆయన హామీలు నిజం, ఆయన మాట నిజం అని తెలిసి మింగుడుపడటం లేదా అంటూ నిలదీశారు. మీ జూటా మాటలు, మీ కుట్రలకు, మీ దిమాక్ తక్కువ పనుల డ్యామేజ్ కంట్రోల్‌కు నేడు కేసీఆర్ నిర్మాణాలే దిక్కయ్యాయని పేర్కొన్నారు. కేసీఆర్ లక్ష డబుల్ నిర్మాణాలు నిజం, కేటాయింపులు నిజం అని చెప్పారు. మీ నాలుకలు తాటి మట్టాలు కాకుంటే ఇంకోసారి అబద్ధాలు మాట్లాడకండి అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## మూసీ నిర్వాసితుల తరలింపునకు ప్రత్యేక సిబ్బంది..

**జీహెచ్ఎంసీ ఉత్తర్వులు**



**విశ్వంభర, హైదరాబాద్ :** మూసీ నది ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. స్థానికుల ఆవేదనను పట్టించుకోని ప్రభుత్వం.. వారిని అక్కడ్నుంచి బలవంతంగా పంపించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. మూసీ నిర్వాసితులను మరో ప్రాంతానికి తరలించేందుకు 14 మంది హౌసింగ్ సిబ్బందిని నియమిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు.పిల్లిగుడిసెలు, జంగమ్మెట్, ప్రతాపసింగారం, సాయిచరణ్ కాలనీ, కమలానగర్, కొల్లూరు 1, గాంధీనగర్, జై భవానీ నగర్, తిమ్మాయిగూడ, నార్సింగి, బండ్లగూడ, డి పోచంపల్లి 2, బాచుపల్లిలో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లకు నిర్వాసితులను తరలించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది.

## ఇల్లు ఖాళీ చేయాలని హైడ్రా ఆదేశం..

**హైదరాబాద్‌లో మహిళ ఆత్మహత్య..**



**విశ్వంభర, హైదరాబాద్ :** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో హైడ్రా హడల్‌కి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. కూకట్‌పల్లి యాదవ బస్తీలో గుర్రంపల్లి బుచ్చమ్మ అనే మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ముగ్గురు బిడ్డల పెళ్లిళ్లకు కట్నంగా మూడు ఇండ్లు రాసిచ్చింది.అయితే హైడ్రా కూల్చివేతల్లో భాగంగా ఇండ్లు ఖాళీ చేయాలని హైడ్రా అధికారులు ఇటీవలే హెచ్చరించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బుచ్చమ్మ శుక్రవారం ఉరేసుకుని చనిపోయింది. మృతురాలి కుమార్తెలు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

హైడ్రా అధికారుల వేధింపుల కారణంగానే బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. కుమారులు లేనప్పటికీ.. తన ముగ్గురు కుమార్తెలు మంచిగా ఉండాలనే ఉద్దేశంతో రూపాయి రూపాయి కూడబెట్టి ఈ ఇల్లును కొనుక్కున్నది. బిడ్డల పెళ్లిళ్లకు కట్నం కింద రాసిచ్చింది. ఇప్పుడు ఇల్లు కూల్చేస్తాం అనేసరికి ఆవేదనకు గురై ఆత్మహత్య చేసుకుందని ఆమె బంధువులు తెలిపారు.

**మూసీ బఫర్ జోన్‌లో పట్టాలున్న కుటుంబాలకు**

## పునరావాసం, పరిహారం

**- దాన కిశోర్**

**విశ్వంభర, హైదరాబాద్ :** త్వరలో మూసీ నది బఫర్ జోన్‌లో నిర్మాణాలను సర్వే చేయనున్నట్లు మూసీ రివట్ ఫ్రంట్ ఎండీ దాన కిశోర్ ప్రకటించారు. బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణాలకు మార్కింగ్ ప్రక్రియ చేపడుతామన్నారు. బఫర్ జోన్‌లో పట్టాలున్న కుటుంబాలకు పునరావాసం, పరిహారం ఇస్తామన్నారు. నదీ గర్భంలో కొందరికి పట్టాలు ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పట్టాలున్న వారు సంబంధిత జిల్లా కలెక్టర్లను కలవాలి. పట్టాలు పరిశీలించి అర్హులకు పరిహారం అందిస్తామని దాన కిశోర్ స్పష్టం చేశారు.

**పిల్లలపై రేపట్నుంచి 2 రోజుల పాటు సర్వే..**

మూసీ నిర్వాసిత కుటుంబాల్లోని పిల్లలపై రేపట్నుంచి 2 రోజుల పాటు సర్వే నిర్వహించనున్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల సమీపంలోని స్కూళ్లల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. పిల్లలు విద్యా సంవత్సరం నష్టపోకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ చిన్నారుల నుంచి కాలేజీ విద్యార్థుల వరకు వివరాలను సేకరించనున్నారు అధికారులు.





## రాజకీయంగా నాపై తొలి కేసు నమోదైంది..

**అయినా రాజీనామా చేయను: సిద్ధరామయ్య**

**బెంగళూరు:** మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కేటాయింపుల కుంభకోణంలో లోకాయుక్త కేసు నమోదు చేయడంపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య స్పందించారు. మొదటిసారి తనపై రాజకీయ కేసు నమోదైందని తెలిపారు. అయినప్పటికీ సీఎం పదవికి రాజీనామా చేయబోనని స్పష్టం చేశారు. 'నేనేం తప్పు చేయలేదు. నాపై రాజకీయ కేసు నమోదు కావడం ఇదే తొలిసారి. ఇది రాజకీయ కేసు, దయచేసి అండర్‌లైన్ చేయండి' అని మీడియాతో అన్నారు.

కాగా, తన రాజీనామాను డిమాండ్ చేస్తూ బీజేపీ చేస్తున్న నిరసనలపై మీడియా అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య సమాధానం ఇచ్చారు. 'నేనెందుకు రాజీనామా చేయాలి? ఎవరైనా తప్పు చేస్తే రాజీనామా చేయాలి, తప్పు చేయలేదని చెబుతున్నప్పుడు, రాజీనామా చేసే ప్రశ్న ఎక్కడ ఉంది?' అని అన్నారు. ప్రతిపక్షాలు తనను చూసి భయపడుతన్నాయని, అందుకే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు.మరోవైపు సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని సిద్ధరామయ్య విమర్శించారు. అలాగే దేశవ్యాప్తంగా ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ కార్యాలయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. కాగా, సీబీఐ పక్షపాతంగా వ్యవహరిస్తోందని కర్ణాటక ప్రభుత్వం మండిపడింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని కేసుల దర్యాప్తు కోసం సీబీఐకి ఇచ్చిన సాధారణ సమ్మతిని గురువారం ఉపసంహరించింది.

## ఎడ్‌సెట్‌లో మరో 6,928 సీట్లు భర్తీ..

**30లోపు రిపోర్టింగ్‌కు అవకాశం**

**విశ్వంభర, హైదరాబాద్ :** రెండేండ్ల బీఈడీ కోర్సుల్లో మరో 6,928 సీట్లు భర్తీ అయ్యాయి. రెండో విడుత వెబ్ కౌన్సెలింగ్‌లో ఆయా సీట్లు నిండాయి. రెండో విడుత కౌన్సెలింగ్‌కు 11,087 మంది హాజరుకాగా, 9,616 సీట్లకు గానూ 6,928 సీట్లు నిండాయి. మొదటి విడుత కౌన్సెలింగ్‌లో 9,817 మంది సీట్లు కేటాయించగా, వీరిలో 4,841 మంది రిపోర్ట్ చేశారు. రెండో విడుతలో సీట్లు పొందిన వారు ఈ నెల 30వ తేదీలోపు ఆయా కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేష్‌బాబు సూచించారు.

## డిప్యూటీ సీఎం భట్టి ఇంట్లో చోరీ

**- ఖరగ్‌పూర్‌లో ఇద్దరు దొంగల అరెస్ట్**



**విశ్వంభర, ఖరగ్‌పూర్:** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ కేసులో పశ్చిమ్‌బెంగాల్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఖరగ్‌పూర్ జీఆర్పీ ఎస్పీ దేబశ్రీ సన్యాల్ వెల్లడించారు. ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో ఏడో నంబర్ ప్లాట్‌ఫాంపై జీఆర్పీ పోలీసుల తనిఖీలు నిర్వహించారు. అక్కడ అనుమానాస్పదంగా కనిపించిన రోషన్‌కుమార్ మండల్, ఉదయ్‌కుమార్ ఠాకూర్‌ను విచారించారు.వీరిద్దరూ భట్టి విక్రమార్క విదేశీ పర్యటనలో ఉండగా ఆయన ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులుగా గుర్తించారు. వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బిహార్‌కు చెందిన వారని ఎస్పీ వెల్లడించారు. దీనిపై తెలంగాణ పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే.. గత ప్రభుత్వం అమ్ముకుంది: మంత్రి పొన్నం

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే.. గత ప్రభుత్వం రూ.7,380 కోట్లకు అమ్ముకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. భారాస హయాంలో హైదరాబాద్పై పెట్టిన ఖర్చు వివరాలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చే ప్రయత్నం చేశారా? అని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా వాటర్ లాగింగ్ సెంటర్లు అలాగే ఉన్నాయన్నారు. పాతబస్తీలో మెట్రోరైలు నిర్మాణాన్ని అడ్డుకున్నారని విమర్శించారు. 'మూసీ' నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారన్న ప్రతిపక్షం ఆరోపణలను మంత్రి ఖండించారు.

## అటవీ శాఖ అధికారులపై ఇనుప రాడ్లతో దాడి

**ఇద్దరికి తీవ్ర గాయాలు**

**విశ్వంభర, ములుగు :** ములుగు జిల్లాలో అటవీ శాఖ అధికారులపై దుండగులు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. వివరాల్లోకి వెళ్తే..తాడ్వాయి అటవీ రేంజ్ దామరవాయి అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లను నరికి వేస్తున్నారనే సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బంది ఎఫ్ఎస్‌వో వినోద్, ఎఫ్‌బీవో శరత్ చంద్ర, సుమన్ బృందం సంఘటన స్థలానికి చేరుకొని చెట్లను తొలగిస్తున్న జేసీబీని స్వాధీనం చేసుకున్నారు.జేసీబీని తాడ్వాయి అటవీ కార్యాలయానికి తరలిస్తుండగా తాడ్వాయి సమీపంలో జేసీబీ ఓనర్ గంట సూరజ్ రెడ్డి (గున్ను ), మరో ఇద్దరితో కలిసి అటవీ అధికారులపై విచక్షణా రహితంగా ఇనుప రాడ్లతో దాడి చేశారు. జీప్ లైట్లను ధ్వంసంచేసి జేసీబీని తీసుకెళ్లారు.ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో వినోద్, శరత్ చంద్రకు తీవ్ర గాయా లయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## చెస్ ఒలంపియాడ్ విజేతలకు నజరానా

**విశ్వంభర, హైదరాబాద్ :** చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణపతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.25 లక్షల చొప్పున ప్రోత్సాహకాలను ప్రకటించారు. భారతదేశం తరఫున తొలిసారి స్వర్ణపతకాలు సాధించిన క్రీడాకారులు అర్జున్, ద్రోణవల్లి హారిక జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని అభినందించిన సీఎం.. రూ.25 లక్షల చొప్పున నజరానా ప్రకటించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు చదరంగ విజేతలను అభినందించారు.
హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో ప్రతిష్ఠాత్మక 45వ చెస్ ఒలింపియాడ్ జరిగిన సంగతి తెలిసిందే. టైటిల్ కోసం 190కి పైగా దేశాలు పోటీ బరిలోకి దిగాయి. దేశ విదేశాల తరపున ప్రపంచ అగ్రశ్రేణి ప్లేయర్లు తలపడ్డారు. అయితే ఈ చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు తొలిసారి స్వర్ణం నెగ్గి చరిత్ర సృష్టించాయి.
భారత్ గతంలో 2014, 2022 రెండు ఎడిషన్ చెస్ ఒలింపియాడ్‌లోనూ కాంస్యం నెగ్గింది. కరోనా కారణంగా 2020, 2021లో పోటీలను వర్చువల్‌గా నిర్వహించారు. 2020లో రష్యాతో కలిసి సంయుక్తంగా భారత్ స్వర్ణం గెలిచింది. ఇక 2021 పోటీల్లో భారత్ కాంస్యం సాధించింది. అయితే వర్చువల్‌గా జరిగిన టోర్నీల ఫలితాలను అధికారికంగా రికార్డుల్లో చేర్చలేదు. ఈసారి స్వర్ణం గెలవడం వల్ల భారత్‌కు అధికారికంగా ఇదే తొలి గోల్డ్ అయ్యింది.

## కుంబ్లే ఆల్‌టైమ్ రికార్డు బ్రేక్ చేసిన అశ్విన్

**కాన్పూర్ :** సుదీర్ఘ ఫార్మాట్‌లో రవిచంద్రన్ అశ్విన్ జోరు చూపిస్తున్నాడు. మొన్నటికి మొన్న బ్యాటింగ్‌లో రాణించి ఆరో సెంచరీతో భారత్‌ను గెలిపించిన అశ్విన్ ఇప్పుడు మరో ఘతన సాధించాడు. ఈ స్పిన్ మాంత్రికుడు ఆసియా ఖండంలోనే భారత్ తరఫున అత్యధిక వికెట్ల వీరుడిగా నిలిచాడు. కాన్పూర్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో (27; 67 బంతుల్లో, 4 ఫోర్లు)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకొని ఈ ఘనత అందుకున్నాడు.
అంపైర్ ఔట్ ఇవ్వడంతో బంగ్లా కెప్టెన్ షాంటో రివ్యూకి వెళ్లాడు. సమీక్షలో కూడా ఎల్బీడబ్ల్యూగా ఫలితం తేలింది. వికెట్ల ముందు షాంటో దొరికిపోయినట్లు రిప్లేలో స్పష్టంగా కనిపించింది. అయితే ప్యాడ్‌కు బంతి తగలకుండా ఇన్‌సైడ్ ఎడ్జ్ తీసుకున్నా షాంటో ఔటయ్యేవాడు. ఎలా అంటే.. ప్యాడ్లకు తాకిన బంతిని సెకండ్ స్లిప్‌లో ఉన్న గిల్ డైవ్ చేస్తూ క్యాచ్ అందుకున్నాడు. మొత్తంగా బంగ్లాదేశ్ రివ్యూని కోల్పోయింది.
ఈ క్రమంలో ఆసియాలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అశ్విన్ చరిత్ర సృష్టించాడు. అంతకుముందు ఈ రికార్డు అనిల్ కుంబ్లే పేరిట ఉంది. కాగా, ఓవరాల్‌గా ఆసియాలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ ముత్తయ్య మురళీధరన్. ఆసియాలో ఈ లంక దిగ్గజ స్పిన్నర్ 612 వికెట్లు పడగొట్టాడు. అశ్విన్ 420, కుంబ్లే 419 వికెట్లతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో రంగన హెరత్ (354), హర్భజన్ సింగ్ (300) ఉన్నారు.
కాగా, టాస్ ఓడి బ్యాటింగ్ చేస్తున్న బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. అయితే వెలుతురులేమి కారణంగా మ్యాచ్‌ను అంపైర్లు నిలిపివేశారు. వర్షం పడే సూచనలు ఉండటంతో మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచారు. ఇవాళ తడి ఔట్ ఫీల్డ్, వెలుతురులేమి కారణాలతో ఆటకు అంతరాయం కలుగుతోంది. ప్రస్తుతం ముష్ఫికర్ రహీమ్ (6), మోమినుల్ హక్ (40) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు, అశ్విన్ ఒక వికెట్ తీశారు.

### ఆసియాలో అత్యధిక టెస్టు వికెట్లు తీసిన బౌలర్లు..

ముత్తయ్య మురళీధరన్ (శ్రీలంక) - 612 వికెట్లు, రవిచంద్రన్ అశ్విన్ (భారత్) - 420* వికెట్లు
అనిల్ కుంబ్లే (భారత్) - 419 వికెట్లు, రంగనా హెరాత్ (శ్రీలంక) - 354 వికెట్లు. హర్భజన్ సింగ్ (భారత్) - 300 వికెట్లు



# వర్షంతో ముందుగానే ముగిసిన భారత్, బంగ్లా రెండో టెస్టు తొలి రోజు ఆట

**విశ్వంభర, కాన్పూర్ :** కాన్పూర్ వేదికగా శుక్రవారం భారత్ బంగ్లాదేశ్ మధ్య ప్రారంభమైన రెండో టెస్టు తొలి రోజు ఆట ముగిసింది. తొలుత ఔట్ ఫీల్డ్ కారణంగా మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఆ తర్వాత వర్షం పడటంతో తొలి రోజు ఆట ముగిసినట్లు అంపైర్లు ప్రకటించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్.. 35 ఓవర్లలో 107/3 పరుగులు చేసింది. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ 2 వికెట్లు తీయగా.. రవిచంద్రన్ అశ్విన్ ఒక వికెట్ తీశాడు. గురువారం రాత్రి కాన్పూర్‌లో భారీ వర్షం కురిసింది. దీంతో మైదానం చిత్తడిగా మారింది. ఫలితంగా మ్యాచ్ సుమారు గంటసేపు ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ మ్యాచులో టాస్ గెలిచిన కెప్టెన్ రోహిత్ శర్మ.. బౌలింగ్ ఎంచుకున్నాడు. వాస్తవానికి కాన్పూర్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుందనే అంచనాలు ఉండేవి. దీంతో అక్షర్ పటేల్ లేదా కుల్‌దీప్ యాదవ్‌లలో ఒకరు తుది జట్టులోకి వస్తారని అంతా భావించారు. కానీ వర్షం కారణంగా పిచ్ పరిస్థితి మారిపోవడంతో యాజమాన్యం తుది జట్టులో మార్పులు చేయలేదు. దీంతో తొలి టెస్టుకు బరిలో దిగిన జట్టునే కాన్పూర్‌లోన బరిలోకి దించింది.



అటు బంగ్లాదేశ్ రెండు మార్పులు చేసింది. నహీద్ రాణా, టస్కిన్ అహ్మద్‌లను జట్టు నుంచి తప్పించింది. తైజుల్ ఇస్లాం, ఖలీద్‌ను జట్టులోకి తీసుకుంది. ఇక టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ ఆచీతూచీ బ్యాటింగ్ చేసింది. ముఖ్యంగా బుమ్రా బౌలింగ్‌లో వికెట్ ఇవ్వకూడదని నిర్ణయించుకున్నారో, ఏమో.. ఆ జట్టు బ్యాటర్లు పట్టుదలతో బ్యాటింగ్ చేశారు. సిరాజ్ కూడా వికెట్ల వేటలో విజయం సాధించలేకపోయాడు. ఇదే సమయంలో ఆకాశ్ దీప్ అదరగొట్టాడు. స్వల్ప వ్యవధిలోనే ఓపెనర్లు ఇద్దరినీ ఔట్ చేశాడు. జాకిర్ హసన్ (0), ఇస్లామ్ (24)ను పెవిలియన్ చేర్చాడు. దీంతో 29 పరుగులకే బంగ్లాదేశ్ రెండు వికెట్లు కోల్పోయింది.
ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన నజ్ముల్ హుసేన్ శాంటో, మొమినుల్ హక్‌తో కలిసి 50 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. దీంతో బంగ్లాదేశ్.. 80/2తో కోలుకున్నట్లే కనిపించింది. తొలి టెస్టుల్లో ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన అశ్విన్.. ఈ మ్యాచులోనూ తొలి రోజు ఆటలో ఓ వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. శాంటో (31)ను పెవిలియన్ చేర్చాడు. ఇక వర్షం కురిసి ఆట నిలిచిపోయే సమయానికి బంగ్లాదేశ్ 35 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. క్రీజులో మొమినుల్ (40), ముష్ఫికర్ రహీమ్ (6) ఉన్నారు. తొలి రోజు ఆటలో 9 ఓవర్లు వేసిన బుమ్రా.. వికెట్ తీయలేకపోయాడు.
భారత్ జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, జస్ప్రీత్ బుమ్రా.
బంగ్లాదేశ్ జట్టు: నజ్ముల్ హసన్ శాంటో (కెప్టెన్) , షాద్మాన్ ఇస్లాం, జకీర్ హసన్, మోమినుల్ హక్, ముష్ఫికర్ రహీమ్, షకీబ్ అల్ హసన్, లిటన్ దాస్ (వికెట్), మెహిదీ హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లాం, హసన్ మహమూద్, ఖలీద్ అహ్మద్.

## జడేజా ప్రపంచ రికార్డు

**కాన్పూర్ :** టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. టెస్ట్ క్రికెట్‌లో విజయాలు సాధించిన మ్యాచ్‌ల్లో 2000 ప్లస్ పరుగులతో పాటు 200 ప్లస్ వికెట్లు తీసిన తొలి ప్లేయర్‌గా జడేజా చరిత్రకెక్కాడు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా జడేజా ఈ ఫీట్ సాధించాడు. చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో జడేజా హాఫ్ సెంచరీతో పాటు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 5 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా 280 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. దాంతో జడేజా 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఎవరికీ సాధ్యం కానీ రికార్డ్‌ను అందుకున్నాడు. భారత్ గెలిచిన టెస్ట్‌ల్లో జడేజా ఇప్పటి వరకు 2003 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో 218 వికెట్లు పడగొట్టాడు. తద్వారా టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే విజయాలు సాధించిన మ్యాచ్‌ల్లో 200 ప్లస్ వికెట్లతో పాటు 2000 ప్లస్ రన్స్ చేసిన తొలి క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. రవీంద్ర జడేజా తర్వాత టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ జాబితాలో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అతను భారత్ సాధించి టెస్ట్ విజయాల్లో 1943 పరుగులతో పాటు 369 వికెట్లు తీసాడు. బంగ్లాదేశ్‌తో కాన్పూర్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో అశ్విన్ 57 పరుగులు చేసి భారత్ విజయం సాధిస్తే.. 2000 పరుగులతో పాటు 300 వికెట్లు తీసిన తొలి ప్లేయర్‌గా నిలుస్తాడు.



జడేజా@300
ప్రస్తుతం జడేజా టెస్ట్‌ల్లో 299 వికెట్లు తీసాడు. 300 వికెట్ల మైలురాయి అందుకునేందుకు ఒక్క వికెట్ దూరంలో ఉన్నాడు. కాన్పూర్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో జడేజా ఈ ఫీట్ సాధించనున్నాడు. తద్వారా భారత్ తరఫున 300 వికెట్లు తీసిన తొలి లెఫ్టార్మ్ స్పిన్నర్‌గా చరిత్రకెక్కనున్నాడు.
తొలి టెస్ట్‌లో జడేజా అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. రవిచంద్రన్ అశ్విన్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన జడేజా (86) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు.

## కోల్‌కతా నైట్‌రైడర్స్ మెంటార్‌గా బ్రావో

**విశ్వంభర, క్రీడావిభాగం :** ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు కొత్త మెంటార్ వచ్చేశాడు. టీమ్‌ఇండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ వెళ్లిపోవడంతో కేకేఆర్ మెంటార్ పోస్ట్ ఖాళీ అయింది. గౌతీ స్థానంలో వెస్టిండీస్ మాజీ ఆటగాడు డ్వేన్ బ్రావో వచ్చాడు. ఈ విషయాన్ని కేకేఆర్ ఫ్రాంచైజీ సోషల్ మీడియా వేదికగా తెలియజేసింది. " 'సర్ ఛాంపియన్' బ్రావోకు హాలో చెప్పండి. ఛాంపియన్ సిటీకి స్వాగతిస్తున్నాము." అని ట్వీట్ చేసింది.
'బ్రావో మా జట్టులో చేరడం ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. అతడు ఏ జట్టుకు ఆడినా సరే గెలవాలనే తపనతోనే ఆడుతుంటాడు. అతడి అనుభవం, జ్ఞానం ఫ్రాంచైజీ, ఆటగాళ్లకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. అతడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మా ఫ్రాంచైజీలన్నింటితో CPL, MLC, ILT20 లీగుల్లో ఆడినందుకు మేము ఎంతో సంతోషిస్తున్నాము.' అని కేకేఆర్ సీఈఓ వెంకీ మైసూర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐపీఎల్‌లో ఎప్పుడూ కూడా బ్రావో కేకేఆర్ తరఫున ఆడలేదు. చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అయితే.. కరేబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)లో అతడు కేకేఆర్ ఫ్రాంచైజీకి చెందిన ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ తరఫున ఆడాడు. 2013 నుంచి 2020 వరకు ట్రిన్‌బాగోకు నైట్‌రైడర్స్‌కు బ్రావో కెప్టెన్‌గా వ్యవహరించడం గమనార్హం.
ఇక కేకేఆర్ మెంటార్‌గా రావడం పై బ్రావో స్పందించాడు. "సీఎల్‌లో గత 10 సంవత్సరాలుగా ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ తరఫున



ఆడాను. అంతేకాదు లీగుల్లో నైట్‌రైడర్స్ తరఫున, వ్యతిరేకంగా ఆడాను. దీంతో వారు ఎలా పని చేస్తారనే దానిపై నాకు ఓ అవగాహన ఉంది. యజమానుల అభిరుచి, మేనేజ్‌మెంట్ వృత్తి నైపుణం, కుటుంబ వాతావరణంలా ఉండే డ్రెస్సింగ్ రూమ్‌లను చూశాను. కోచ్‌గా నాకు ఇది సరైన వేదిక." అని బ్రావో అన్నాడు.
2021లోనే అంతర్జాతీయ క్రికెట్‌కు డ్వేన్ బ్రావో వీడ్కోలు పలికాడు. అప్పటి నుంచి కేవలం లీగుల్లో మాత్రమే ఆడుతున్నాడు. తాజాగా అన్ని రకాల క్రికెట్ నుంచి రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. అతడు ఈ విషయాన్ని ప్రకటించిన కాసేపటికే కేకేఆర్ తమ మెంటార్‌గా నియమించినట్లు వెల్లడించడం గమనార్హం.



## బంగ్లాదేశ్ సూపర్ ఫ్యాన్‌పై దాడి జరగలేదు : కాన్పూర్ పోలీసులు

**కాన్పూర్ :** ఇండియా వర్సెస్ బంగ్లాదేశ్ రెండో టెస్ట్‌కు హాజరైన బంగ్లా సూపర్ ఫ్యాన్ 'టైగర్ రాబి'పై దాడి జరిగినట్లు జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని కాన్పూర్ పోలీసులు స్పష్టం చేశారు. టైగర్ రాబిని ఎవరూ కొట్టలేదని, అనారోగ్యంతో అతను కిందపడిపోయాడని పేర్కొన్నారు. శుక్రవారం కాన్పూర్ వేదికగా రెండో టెస్ట్ ప్రారంభం కాగా.. టాస్ ఓడిన బంగ్లాదేశ్ బ్యాటింగ్‌కు దిగింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. తొలి రోజు ఆట ఆరంభంలో టైగర్ రాబికి, స్థానిక టీమిండియా అభిమానులకు గొడవ జరిగిందని వార్తలు వచ్చాయి. సీ బ్లాక్‌లో ఉన్న రాబి బంగ్లాదేశ్ జాతీయ జెండాను ఊపుతూ.. మద్దతుగా నినాదాలు చేశాడని, దాంతో స్థానిక భారత అభిమానులు తీవ్ర ఆగ్రహానికి గురై అతనితో వాగ్వాదానికి దిగారని, లంచ్ బ్రేక్ సమయంలో టైగర్ రాబీపై భౌతిక దాడికి పాల్పడ్డారని కూడా ప్రచారం జరిగింది.
అస్వస్థతకు గురైన టైగర్ రాబీని పోలీసులు మైదానం బయటకు తీసుకెళ్తున్న వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అయితే టైగర్ రాబీపై ఎవరూ దాడి చేయలేదని, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారమంతా అవాస్తవమని కాన్పూర్ పోలీసులు స్పష్టం చేశారు. మరోవైపు టైగర్ రాబీ సెన్సేషనల్ అవ్వాలనే ఉద్దేశంతోనే తనపై దాడి జరిగినట్లు నటించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.
ఆసుపత్రికి వెళ్లే సమయంలో టైగర్ రాబీ మీడియాతో మాట్లాడుతూ తనపై దాడి చేశారని, పొత్తికడుపుతో వీపుపై బలంగా కొట్టారని, దీంతో ఊపిరి తీసుకోవడం కష్టమైందని తెలిపాడు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసులు అతనిపై ఎలాంటి దాడి జరగలేదని స్పష్టం చేశారు. టైగర్ రాబీపై దాడి చేసినట్లు ఎక్కడా కనపించలేదని చెప్పారు.
వార్తల్లో నిలిచేందుకు టైగర్ రాబీ ఇలా ప్రవర్తించడం ఇదే తొలిసారి కాదని, గతంలోనూ అనేక సార్లు స్థానిక అభిమానులతో గొడవకు దిగేందుకు ప్రయత్నించాడని బీసీసీఐకి చెందిన ఓ అధికారి మీడియాకు తెలిపారు. చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లోనూ తమిళం అర్థం కాక అక్కడి ఫ్యాన్స్‌తో గొడవకు దిగాడని గుర్తు చేశారు. ఈ ఘటనను బంగ్లాదేశ్ మీడియా పెద్దదిగా చూపిస్తుందని, టైగర్ రాబీపై ఎలాంటి దాడి జరగలేదని స్పష్టం చేశారు.
బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ మ్యాచ్‌లను నిర్వహించకుండా అడ్డుకుంటామని హిందు మహాసభ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాన్పూర్ మైదానానికి పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. భారత్, బంగ్లా ఆటగాళ్లకు మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. మైదానంలోనూ భద్రతా సిబ్బందిని పెంచారు.

## మమ్మల్ని పక్కనపెట్టి చాయ్‌వాలాతో సెల్ఫీలు

### హాకీ ప్లేయర్ హార్దిక్ సింగ్ ఆవేదన

**విశ్వంభర, క్రీడావిభాగం :** 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యంతో సత్తా చాటిన భారత హాకీ జట్టుకు ఓ నిరాశాజనకమైన సంఘటనను మిడ్ ఫీల్డర్ హార్దిక్ సింగ్ షేర్ చేసుకున్నాడు. ఒలింపిక్స్‌లో మెడల్ నెగ్గి గత నెల భారత్‌కు తిరిగి వచ్చిన తమకు ఎయిర్ పోర్టులో విచిత్రమైన అనుభవం ఎదురైందని అన్నాడు. అభిమానులు పతకం గెలిచిన తమను పట్టించుకోకుండా సోషల్ మీడియా స్టార్ డాలీ చాయ్‌వాలాతో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపించినట్లు పేర్కొన్నాడు.
'నేను స్వయంగా ఎయిర్‌పోర్ట్‌లో నా కళ్లతో చూశాను. అక్కడ నాతో పాటు హర్మన్ ప్రీత్ సింగ్, మన్‌దీప్ సింగ్ ఉన్నారు. మరోవైపు సోషల్ మీడియా స్టార్ డాలీ చాయ్‌వాలా కూడా అక్కడికి చేరుకున్నాడు. దీంతో అభిమానులంతా అతడితో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. మమ్మల్ని అస్సలు గుర్తించలేదు. మేం ఒకరిని ఒకరం చూసుకున్నాం. అది మాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. హర్మన్ ప్రీత్ కెరీర్‌లో 150కి పైగా గోల్స్ చేశాడు. మన్‌దీప్ 100కి పైగా ఫీల్డ్ గోల్స్ సాధించాడు. డాలీ చాయ్‌వాలా స్పెషల్ టీ (Special Tea)తో సోషల్ మీడియాలో సంచలనంగా మారాడు. బిల్‌గేట్స్‌కి కూడా టీ అందించాడు. అది గొప్ప విషయమే, కానీ ఒలింపిక్స్‌లో రెండు సార్లు మెడల్స్ సాధించినప్పటికీ భారత హాకీ స్టార్లకు తగిన గుర్తింపు దక్కడం లేదు. ఒక అథ్లెట్‌కు గొప్ప పేరు, డబ్బు ముఖ్యమే. కానీ, ఫ్యాన్స్ మమ్మల్ని చూస్తున్నప్పుడు, అభినందిస్తున్నప్పుడూ అంతకంటే ఆనందం మరొకటి ఉండదు' అని హార్దిక్ అన్నాడు.



## ఓలా ఎలక్ట్రిక్ హైపర్ సర్వీస్ క్యాంపెయిన్ లాంచ్

**విశ్వంభర, బిజినెస్ :** ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్.. తన కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేందుకు ముందుకు వచ్చింది. అందుకోసం దేశవ్యాప్తంగా హైపర్ సర్వీస్ క్యాంపెయిన్ ప్రారంభిస్తున్నట్లు శుక్రవారం తెలిపింది. ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ల యజమానుల నుంచి భారీగా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో.. ఓలా ఎలక్ట్రిక్ 'సర్వీస్ క్యాంపెయిన్' పేరుతో సొంత సర్వీస్ సెంటర్లు వెయ్యికి పెంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో 500 ఓలా ఎలక్ట్రిక్ సర్వీస్ సెంటర్లు ఉన్నాయి. హైపర్ సర్వీస్ క్యాంపెయిన్‌లో భాగంగా డిసెంబర్ కల్లా వాటిని రెట్టింపు చేయాలని యోచిస్తున్నది. మరోవైపు, నెట్ వర్క్ ప్రోగ్రామ్ కింద లక్ష మంది థర్డ్ పార్టీ మెకానిక్‌లకు ట్రైనింగ్ ఇవ్వనున్నది. ఎలక్ట్రిక్ వాహనాల వాడకం, వాటి మరమ్మతులకు ప్రతి మెకానిక్ సిద్ధం కావాలన్న ఆలోచనతోనే తామీ నిర్ణయం తీసుకున్నామని ఓలా ఎలక్ట్రిక్ వెల్లడించింది. వచ్చేనెల 10 నుంచి దశలవారీగా 'క్విక్ సర్వీస్ గ్యారంటీ' అమలు చేస్తామని ఓలా ఎలక్ట్రిక్ పేర్కొంది. అందులో భాగంగా ఒక రోజు కంటే ఎక్కువగా బైక్ లేదా స్కూటర్ సర్వీసింగ్ టైం పడితే.. కస్టమర్ల వెసులుబాటు కోసం ఓలా ఎస్1 స్కూటర్ ఇవ్వనున్నది. దీంతోపాటు ఓలా కేర్+ సబ్ స్క్రైబర్లు ఉచితంగా ఓలా క్యాబ్ కూపన్లు పొందొచ్చునని పేర్కొంది. ఈ సందర్భంగా ఓలా ఎలక్ట్రిక్ ఎండీ భవిష్ అగర్వాల్ స్పందిస్తూ.. 'దేశంలో మాకు 800 సేల్స్ స్టోర్లు ఉన్నాయి. కానీ 500 సర్వీస్ సెంటర్లు మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైపర్ సర్వీస్ క్యాంపెయిన్‌లో భాగంగా మా నెట్ వర్క్ విస్తరణతోపాటు ఏఐ పవర్డ్ సర్వీస్ సాయంతో కస్టమర్లకు మెరుగైన సేవలు అందిస్తాం' అని చెప్పారు.



## భారత్‌లో రోల్స్ రాయిస్ కొత్త కారు ధర ఎంతంటే..

**విశ్వంభర, బిజి నెస్ :** లగ్జరీ కార్ల తయారీ సంస్థ రోల్స్ రాయిస్ భారత మార్కెట్‌లోకి మరో కొత్త కారను తీసుకొచ్చింది. రోల్స్ రాయిస్ కల్లినన్ సిరీస్2 కారును లాంచ్ చేసింది. అంతకు ముందు మోడల్ కారుతో పోలిస్తే అప్డేటెడ్ డిజైన్, అధునాతన ఫీచర్లను కలిగి ఉంది. భారత దేశంలో కల్లినన్ సిరీస్ 2ను రోల్స్ రాయిస్ మోటార్స్ చెన్నై విడుదల చేసింది. ప్రపంచంలోని ప్రముఖ సూపర్ లగ్జరీ ఎస్‌యూవీల్లో ఒకటిగా నిలుస్తుందని కంపెనీ తెలిపింది. విలాసవంతమైన కార్ల కోసం



చూస్తున్న వారిని కల్లినన్ సిరీస్ 2 కారు ఆకర్షిస్తోందని తెలిపింది. బ్లాక్ బ్యాడ్జ్ కల్లినన్ సిరీస్ 2 భారత దేశంలో కూడా అందుబాటులోకి వస్తుందని, రోల్స్ రాయిస్ మరింత ప్రత్యేకమైన, అధునాతన అంశాలను కోరుకునే వారికి ఇది అనుగుణంగా రూపొందించినట్లు పేర్కొంది. సెప్టెంబర్ 27,2024 నుంచి రోల్స్ రాయిస్ మోటార్ కార్స్ కల్లినన్ సిరీస్ 2 భారతదేశంలో అందుబాటులో ఉంటుందని తెలిపింది.
ఇండియన్ మార్కెట్‌లో రోల్స్ రాయిస్ కల్లినన్ సిరీస్ 2 ప్రారంభ ధర రూ.10.50 కోట్లు (ఎక్స్ షోరూమ్)గా కంపెనీ నిర్ణయించింది. అలాగే బ్లాక్ బ్యాడ్జ్ కల్లినన్ సిరీస్ 2 కారు ప్రారంభ ధర రూ. 12.25 కోట్లు (ఎక్స్ షోరూమ్)గా ఉంది. ఈ సూపర్ లగ్జరీ ఎస్‌యూవీ కారు డెలివరీలు 2024 క్యూ4 నుంచి మొదలవుతాయని పేర్కొంది. ఈ కారును గ్లోబల్ మార్కెట్లలో ఈ ఏడాది 2024, మే నెలలో లాంచ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సూపర్ లగ్జరీ ఎస్‌యూవీ డిజైన్ సరికొత్తగా ఉంటుందని కంపెనీ పేర్కొంది. సరికొత్త ఇంటీరియర్, ఫీచర్స్ ఉంటాయని అయితే అదే ఇంజిన్ ఉంటుందని పేర్కొంది. ఈ కొత్త ఫీచర్లు తీసుకురావడంతో ఇప్పటికే మార్కెట్లో ఉన్న టాప్ ఎండ్ మోడల్ కన్నా ధర రూ. 3.55 కోట్లు ఎక్కువగా అవుతోందని తెలిపింది కంపెనీ. అలాగే పాత మోడల్ కన్నా బ్లాక్ బ్యాడ్జ్ ధర రూ. 4.05 కోట్లు ఎక్కువగా ఉంటుందని తెలిపింది. ఈ కారణంగానే భారత మార్కెట్‌లో అత్యంత ధర గల ఎస్‌యూవీగా ఈ కారు నిలుస్తోందని తెలిపింది. ఈ ధర వద్ద అసలు ప్రత్యర్థి కార్లు లేవు. ఈ కారు లాంచ్ సందర్భంగా రోల్స్ రాయిస్ మోటార్ కార్స్ ఆసియా పసిఫిక్ రీజనల్ డైరెక్టర్ ఐరీస్ నిక్కీన్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## ఓటీటీలోకి భలే ఉన్నాడే

టాలీవుడ్ యంగ్ హీరో తరుణ్ సినిమాల లైనప్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఒకవైపు లైంగిక వేధింపుల కేసు తన పై ఉన్నా కూడా వరుస సినిమాలు చేస్తున్నాడు. ఒక నెల గ్యాప్ లోనే మూడు సినిమాల తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అందులో ఒక పురుషోత్తముడు సినిమా మాత్రమే ఓ మాదిరిగా ఆకట్టుకుంది.. మిగిలిన రెండు సినిమాలు బోల్తా కొట్టాయి. అయితే భలే ఉన్నాడే సినిమాతో రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా వచ్చి రెండు వారాలు పూర్తి అయ్యింది. అప్పుడే ఓటీటీలోకి వచ్చేస్తుంది. భలే ఉన్నాడే మూవీ స్ట్రీమింగ్ హక్కులను ఈటీవీ విన్ సొంతం చేసుకుంది. సెప్టెంబర్ 13న థియేటర్లలో రిలీజైన ఈ సినిమాను అక్టోబర్ 3 నుంచి తమ ప్లాట్‌ఫామ్ పై స్ట్రీమింగ్ చేయనున్నట్లు సదరు ఓటీటీ వెల్లడించింది.. ఈ సినిమాలో రాజ్ తరుణ్ గతంలో ఎన్నడూ కనిపించని విధంగా కొత్తగా కనిపించాడు. పెళ్లి కూతుళ్లకు చీరలు కట్టే రాధ అనే ఓ భిన్నమైన పాత్రలో రాజ్ తరుణ్ ఈ సినిమాలో నటించాడు. చేసేది అలాంటి వృత్తే అయినా.. అతనికి ఆడాళ్లంటే భయం, భక్తి, గౌరవం. అలాంటి వ్యక్తి జీవితంలోకి కృష్ణ అనే ఓ గడుసరి అమ్మాయి వస్తుంది. ఆ తర్వాత అతని జీవితం ఎలాంటి మలుపు తిరిగింది? ఆడవాళ్లకు అతడు దూరంగా ఉండటానికి కారణమేంటి? అన్నది ఈ సినిమా కథ.. రాజ్ తరుణ్ తన పర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్నా.. మూవీ పెద్దగా మెప్పించలేకపోయింది. కామెడీ, ఎమోషన్ ఇలా అన్నీ అంతంతమాత్రంగానే పండాయి. దీంతో బాక్సాఫీస్ దగ్గర అతనికి మరో నిరాశ తప్పలేదు. థియేటర్లలో పెద్దగా మెప్పించలేదు కానీ ఓటీటీలో ఎలాంటి టాక్ ను అందుకుంటుందో చూడాలి..





## జవాన్ భార్యగా సాయి పల్లవి

కోలీవుడ్ హీరో శివ కార్తికేయన్, సాయి పల్లవి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వీరిద్దరు తమ నేచురల్ యాక్టింగ్‌తో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారు. ప్రస్తుతం వీరిద్దరు జంటగా కలిసి నటిస్తున్న చిత్రం 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. కమల్ హాసన్ చెందిన రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ చిత్రాన్ని నిర్మిస్తోంది. జీవీ ప్రకాశ్ సంగీతం అందించారు. అక్టోబర్‌లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు రాజ్ కుమార్ పెరియస్వామి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి సాయి పల్లవి ఇంట్రోను పరిచయం చేస్తూ మేకర్స్ ఓ వీడియో రిలీజ్ చేశారు. ఇందులో ఆమెను అమర జవాన్ సతీమణిగా చూపించారు. ఈ సినిమా ప్రారంభం అయినప్పటి నుంచి ప్రేక్షకులలో క్యూరియాసిటీ నెలకొంది. ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తరచుగా అప్ డేట్స్ ఇస్తూ వస్తున్నారు. ఇప్పటికే సాయి పల్లవి ఫస్ట్ లుక్ రిలీజ్ చేయగా, తాజాగా నేచురల్ బ్యూటీ సాయి పల్లవి ఇంట్రోను వదిలారు. ఈ సినిమాలో ఆమె ఇందు రెబాక వర్గీస్ అనే పాత్ర పోషిస్తోంది. కొన్ని రియల్ విజువల్స్ తో కలిపి సాయి పల్లవి పాత్రలను ఇంట్రడ్యూస్ చేశారు మేకర్స్. ఈ ప్రచార చిత్రం ఆసక్తిగా, కూల్ అండ్ ఎమోషన్‌గా సాగింది.

ఈ సినిమా మేజర్ ముకుంద్ జీవితంలోని పలు కోణాలను ఆవిష్కరిస్తూ ఉండబోతుందని లెటెస్ట్ ఇంట్రో వీడియో చూస్తే అర్థమవుతోంది. ఇంకా ఈ వీడియోలో సంగీతం మనసుకు హత్తుకునేలా ఉంది. శివ కార్తికేయన్‌తో మంచి కెమిస్ట్రీ ఈ సినిమాలో కనిపించేలా ఉందని అనిపించింది. ఈ సినిమాలో ఇందు రెబాక వర్గీస్ అనే పాత్రలో కనిపించనుండగా కొన్ని నిజ జీవిత విజువల్స్ తో పాటుగా సాయి పల్లవి పాత్రని చూపించడం బాగుందని చెప్పాలి. అలాగే ఈ వీడియోలో మ్యూజిక్ కూడా ఇంపుగా ఉండగా శివ కార్తికేయన్ తో మంచి కెమిస్ట్రీ ఈ సినిమాలో కనిపించేలా ఉంది. మొత్తానికి అమరన్ నుంచి సాయి పల్లవి ఫ్యాన్స్‌కు బ్యూటీఫుల్ ట్రీట్‌ను అందించారని చెప్పాలి.

ఇక ఈ చిత్రంలో విశ్వరూపం ఫేమ్ రాహుల్ బోస్ విలన్‌గా నటిస్తున్నారు. చిత్రాన్ని ఎక్కువ భాగం కశ్మీర్‌లో చిత్రీకరించారట. 75 రోజుల పాటు అక్కడ షూటింగ్ జరిపినట్లు ఇప్పటికే మేకర్స్ తెలిపారు. అలానే కశ్మీర్ షూటింగ్ లొకేషన్‌లో సాయిపల్లవి, శివ కార్తికేయన్ కలిసి దిగిన ఫొటోలు కూడా సినీ ప్రియులను బాగా ఆకట్టుకున్నాయి. అలానే విడుదల చేసిన మేకింగ్ వీడియోలు కూడా సినిమాపై అంచనాలు పెంచాయి. ఇక సాయి పల్లవి సినిమాల విషయానికొస్తే, ఆమె నాగచైతన్య హీరోగా తెరకెక్కుతున్న 'తండేల్' చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. దీనికి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఇంకా నితీశ్ తివారి తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం రామాయణ్‌లోనూ సీతగా నటిస్తోంది. ఇందులో రణ్‌బీర్ కపూర్ రాముడిగా నటిస్తున్నారు. దీంతో పాటే హిందీలో మరో ప్రాజెక్ట్‌లోనూ నటిస్తోంది.

## సంతోషం ఉప్పొంగుతోందన్న దేవర

టాలీవుడ్ అగ్ర హీరో జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో కొరటాల శివ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న దేవర చిత్రం ఇవాళ ప్రపంచవ్యాప్తంగా రిలీజైంది. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా దేవర మేనియా నెలకొంది. ఈ నేపథ్యంలో, జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియాలో భావోద్వేగభరితంగా స్పందించారు.

"నేను ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. మీ అద్భుతమైన స్పందన చూసి సంతోషంతో ఉప్పొంగిపోతున్నాను. థాంక్యూ కొరటాల శివ గారూ... దేవర చిత్రాన్ని ఎంతో రసవత్తరంగా, భావోద్వేగాల అనుభూతిని కలిగించేలా తెరకెక్కించారు. తమ్ముడూ అనిరుధ్... నీ సాంగ్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ తో దేవర చిత్రానికి జీవం పోశావు. దేవర చిత్రానికి బలమైన మూల స్తంభాల్లా నిలిచి నా నిర్మాతలు హరికృష్ణ కొసరాజు, సుధాకర్ మిక్కిలినేని గారికి ప్రత్యేక ధన్యవాదాలు. కెమెరామన్ రత్నవేలు, ఆర్ట్ డైరెక్టర్ సాబూ సిరిల్, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ చిత్రం కోసం అమోఘమైన రీతిలో కృషి చేసిన ప్రతి టెక్నీషియన్ కు కృతజ్ఞతలు. నా అభిమానులూ... మీ సంబరాలు చూశాక నాకెంతో ఆనందం కలిగింది. మీరు చూపించే ప్రేమకు సదా రుణపడి ఉంటాను. ఈ సినిమాను నేను ఎంత ఆస్వాదించానో, మీరు కూడా అదే రీతిలో ఆస్వాదిస్తుండడం హర్షణీయం. మిమ్మల్ని ఎప్పటికీ ఇదే విధంగా అలరిస్తుంటానని హామీ ఇస్తున్నాను" అంటూ జూనియర్ ఎన్టీఆర్ తన ఎక్స్‌లో పేర్కొన్నారు.

## అగని లడ్డూ వివాదం..
### ప్రకాశ్ రాజ్ మరో ట్వీట్



తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదం వివాదం నేపథ్యంలో తన కామెంట్‌ను ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తప్పుగా అర్థం చేసుకున్నారని ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. దీన్ని ఉద్దేశించి తాజాగా పవన్ కల్యాణ్ స్పందించారు. వ్యక్తిగతంగా ప్రకాశ్‌రాజ్ అంటే తనకు ఇష్టమని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ప్రకాశ్‌రాజ్ తనకు మంచి మిత్రుడని, తమకు రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఒకరి పట్ల మరొకరికి ఎంతో గౌరవం ఉందని పవన్ కల్యాణ్ అన్నారు. ఆయనతో కలిసి వర్క్ చేయడం తనకెంతో ఇష్టమని తెలిపారు. తిరుపతి లడ్డూ వివాదంలో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఆ విషయంలో దోషులకు శిక్ష పడాలనే ఉద్దేశంతో పోస్టు పెట్టానని వివరించారు. (దిల్లీలో మీ స్నేహితులంటూ) ఆయన ఆ విధంగా కామెంట్ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఆయన పోస్ట్‌ను తాను తప్పుగా అర్థం చేసుకోలేదన్న పవన్, ప్రకాశ్‌రాజ్ ఉద్దేశం తనకు అర్థమైందన్నారు.

**జస్ట్ ఆస్కింగ్ అంటూ..**

తిరుమల లడ్డూ మహా ప్రసాదం కల్తీ ఘటనపై నటుడు ప్రకాశ్ రాజ్ మరో పోస్ట్ పెట్టారు. 'మనకేం కావాలి? ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి తద్వారా రాజకీయ లబ్ధిని సాధించటమా? లేక ప్రజల మనోభావాలు గాయపడకుండా పరిపాలనా సంబంధమైన, అవసరమైతే తీవ్రమైన చర్యలతో సున్నితంగా సమస్యను పరిష్కరించుకోవటమా? జస్ట్ ఆస్కింగ్'' అని తాజాగా మరో పోస్ట్ పెట్టారు. ఆయన ఎవరిని ఉద్దేశించి పెట్టారు? ఎందుకు పెట్టారు? అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. తిరుమల శ్రీవారి కల్తీపై ఆరోపణలపై దేశవ్యాప్తంగా చర్చ సాగుతున్న విషయం అందరికీ విధితమే. రాజకీయ నాయకులు, భక్తులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని రోజుల కిందట నటుడు ప్రకాశ్‌రాజ్ పవన్‌కల్యాణ్‌ను కోట్ చేస్తూ ఓ పోస్ట్ చేశారు. "మీరు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో జరిగిన ఘటన ఇది. విచారించి నేరస్థులపై చర్యలు తీసుకోండి. మీరెందుకు అనవసర భయాలు కల్పించి, దీన్ని జాతీయస్థాయిలో చర్చించుకునేలా చేస్తున్నారు. మన దేశంలో ఇప్పటికే ఉన్న మతపరమైన ఉద్రిక్తతలు చాలు కేంద్రంలో ఉన్న మీ స్నేహితులకు ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు.

## ఇర్రెగ్యులర్ పీరియడ్స్ సమస్యకు ఈ ఆహారం తీసుకుంటే మేలు




**విశ్వంభర, ఫిచర్:** ప్రస్తుత జీవనశైలి, కాలుష్యం, వివిధ కారణాల వల్ల ఎక్కువ మంది మహిళలు ఇర్రెగ్యులర్ పీరియడ్స్ సమస్యలతో సతమతం అవుతున్నారు. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలనేదానిపై తలపట్టుకుంటున్నారు. ఆ సమస్య పరిష్కారం కోసం మందులు వాడుతుంటారు. ఇలాంటి వారికి పిల్లలు పుడతారా.. లేదా.. పిల్లలకోసం వారు ఏం చేయాలి అని చాలా మంది మహిళలు సతమతమవుతున్నారు. ఆ సమస్య ఉంటే కొన్ని ఫుడ్స్ డైట్‌లో చేర్చుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఆ ఆహారాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

హార్మోన్లలో హెచ్చుతగ్గులు, ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ వంటివి క్రమరహిత్య పీరియడ్స్‌కు దారితీస్తాయి. ఒత్తిడి, ఫుడ్, వ్యాయామం ఇలాంటి పలు అంశాలు కూడా పీరియడ్స్‌ను డిస్టర్బ్ చేస్తాయి.

- ఇలాంటి ఇబ్బందుల వల్ల రుగ్మతలు, గర్భాశయ ఫైబ్రాయిడ్లు, దీర్ఘకాలిక సమస్యలు, పీసీఓఎస్, పీసీఓడీ సమస్యలు ప్రతి అమ్మాయిని ఇబ్బంది పెడతాయి.
- అల్లంలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీస్పాస్మోడిక్ లక్షణాలు ఋతుచక్రాలను నియంత్రిస్తాయి. అంతేకాకుండా నొప్పిని తగ్గిస్తాయి. 2014 క్లినికల్ స్టడీ ప్రకారం.. ఇది 92మంది మహిళల్లో పీరియడ్స్ సమయంలో బ్లీడ్‌ని కంట్రోల్ చేస్తుందని తేలింది.
- దాల్చినచెక్క కూడా పీరియడ్స్ సమస్యను క్లియర్ చేస్తుంది. పీసీఓఎస్ సమస్యతో ఇబ్బంది పడేవారు దీనిని తీసుకుంటూ ఉంటే సమస్య కంట్రోల్ అవుతుందని అమెరికన్ జర్నల్ తేల్చింది. ఇది మెరుగైన రక్తప్రసరణను అందించి నొప్పి నుంచి ఉపశమనం అందిస్తుంది.
- యాపిల్ సైడర్ వెనిగర్ బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను కంట్రోల్ చేస్తుంది. అలాగే హార్మోన్లను కూడా అదుపులో ఉంచుతుంది. దీనిని నీటిలో డైల్యూట్ చేసి.. తీసుకుంటే పీరియడ్ రెగ్యూలర్‌గా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెప్తున్నారు.
- జీలకర్ర నీటిని రెగ్యూలర్‌గా తీసుకుంటే ఎసెన్సిషియల్ ఆయిల్స్, న్యూట్రెంట్స్ శరీరానికి అందుతాయి. ఇవి హార్మోన్లను అదుపులో ఉంచి మెరుగైన జీర్ణక్రియను అందిస్తాయి. ఉదయాన్నే పరగడున జీలకర్ర తాగితే మంచి ఫలితాలు ఉంటాయి.
- బొప్పాయి ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. అలాగే పచ్చిబొప్పాయి కూడా పీరియడ్స్ సమస్యలను తగ్గిస్తుంది. పీరియడ్ నొప్పిని తగ్గించి.. రెగ్యూలర్‌గా వచ్చేలా హార్మోన్స్ పై ప్రభావం చూపిస్తుంది.
- పైనాపిల్‌లోని ఎంజైమ్స్ పీరియడ్ నొప్పిని తగ్గిస్తాయి. అలాగే ఇది పీరియడ్ సైకిల్‌ని కూడా రెగ్యూలర్ చేస్తుంది. కాబట్టి పైనాపిల్‌ని తిన్నా.. జ్యూస్‌గా తీసుకున్నా పీరియడ్ హెల్త్ మంచిగా ఉంటుంది.
- పసుపులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పీరియడ్ నొప్పి ని తగ్గిస్తాయి. హార్మోన్లను అదుపులో ఉంచుతాయి. అలాగే పీరియడ్ సమస్యలను కూడా దూరం చేసి.. హెల్తీగా ఉండడంలో హెల్ప్ చేస్తాయి.
- కలబంద జ్యూస్: ప్రతి రోజు ఖాళీ కడుపుతో ఒక టీస్పూన్ తేనెలో కలబంద రసం కలిపి తీసుకోవాలి. దీని వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. పీరియడ్స్‌కు సంబంధించి ఎలాంటి సమస్యకైనా కలబంద చాలా అద్భుతంగా పనిచేస్తుంది. ఈ జ్యూస్ ఋతుక్రమాన్ని క్రమబద్ధీకరించడానికి సహాయపడుతుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com